# కథాకేళి

కథలు

\- కస్తూరి మురళీకృష్ణ



శ్రీ
కౌముది
మీ మునివేళ్లలో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 86

తెలుగులో 'కథ'కు నిర్వచనాలు చాలా ఉన్నాయి. 'కథ' లక్ష్యాలను వివరించే వాదనలు కూడా బోలెడన్ని ఉన్నాయి. కథలు రచించటంలోని మెళుకువలు, ఎత్తుగడ, కథన సంవిధానాలు, ముగింపులు వంటి వాటిని గురించిన చర్చలూ చాలా ఉన్నాయి. కానీ తెలుగుకథ ప్రపంచంలో వస్తువుకు ఇచ్చిన ప్రాధాన్యం ఇతర ఏ అంశానికీ ఇవ్వలేదు. 'వస్తువు' ఆధారంగా తెలుగు సాహిత్యంలో జట్లు ఏర్పడ్డాయి. ముఠాలు ఏర్పడ్డాయి. దాంతో 'కథ అంటే ఇదే', 'కథ ఇలాగే ఉండాలి' అన్న కఠినమైన చట్రాలూ ఏర్పడ్డాయి. ఫలితంగా కథనం, విభిన్నమైన ఇతివృత్తాలను వైవిధ్య భరితంగా నిర్వహించటం, కథలతో ప్రయోగాలు చేయటం, కథనంలో నైపుణ్యం చూపించటం వంటి అంశాలు వెనకపడ్డాయి. వార్తలు రాయటానికి కథలు రాయటానికి తేడాలేని పరిస్థితి నెలకొంది. కథలలో సృజనాత్మకత రెక్కలు కట్టుకుని ఎగరటం, ఊహ ఆకాశాన్ని తాకటం వంటి అంశాలు తెలుగు కథకు దూరం అయ్యాయి. ఫలితంగా అనేక ప్రక్రియలు తెలుగు కథా ప్రపంచానికి పరిచయం లేనివయ్యాయి.

ఇటీవలే 'ఆ అరగంట చాలు' అన్న తెలుగులో భయానక కథల తొలి సంపుటిని వెలువరించిన సందర్భంలో, సాహిత్య ప్రపంచంలో ఆ సంకలనానికి స్పందనను చూసిన తరువాత, ఆ స్పందనను పాఠకుల స్పందనతో పోల్చిన తరువాత 'కథాకేళి' ఆలోచన జనించింది.

తెలుగులో డిటెక్టివ్‌కథలు, క్రయిమ్ కథలు, బాలసాహిత్యం, భయానక కథలు, చారిత్రాత్మక కథలు, సైన్స్ ఫిక్షన్ కథలు వంటి అనేకానేక ప్రక్రియలు దాదాపుగా శూన్యం అనే చెప్పాలి. అడపా దడపా, అక్కడొకటి, ఇక్కడొకటి ప్రచురితమవుతూన్న ఆ ప్రక్రియలు అంతగా పాఠకులకు చేరువకాలేదు. అయితే, ప్రక్రియల్లో ఏ కథకు ఆ కథ విడిగా రాయటం సులభం. కానీ ఒకే 'ఇతివృత్తం' ఆధారంగా పలు విభిన్న ప్రక్రియలలో కథలను సృజించి, కథారచన అన్నది ఒక సృజనాత్మక ప్రక్రియ అని, ఇజాలు, ఆదర్శాలు, ఉద్యమాలు కథ సృజనలో భాగాలు తప్ప అవే కథలు కావాలని పాఠకలోకానికి నిరూపించాలన్నది ఈ ప్రయోగ లక్ష్యం. అందుకోసం ఈ కఠినమైన మార్గం ఎంచుకున్నాను. నెల నెలా ఒక విభిన్నమైన కథ అదే ఇతివృత్తంతో సృజించి మీ ముందు ఉంచబోతున్నాను.

కస్తూరి మురళీ కృష్ణ

*ఇతివృత్తం*

'పులి, మేక' కథ మన అందరికీ తెలుసు.

ఒక మేక చెరువులో దిగువ గట్టులో నీరు తాగుతూంటుంది. ఎగువ గట్టు వద్ద నీరు తాగుతున్న పులి మేకను చూస్తుంది. ఎలాగయినా దానితో కయ్యం పెట్టుకుని దాన్ని చంపి తినటానికి కారణం వెతుకుతుంది. చివరికి మేక దగ్గరకు వెళ్ళి, 'నీ ఎంగిలి నీళ్ళు నాకు వస్తున్నాయి. నీ ఎంగిలి నాతో తాగించటానికి ఎంత ధైర్యం ఉండాలి?' అని గుడ్లురిమింది.

'ఎగువన ఉన్నది నువ్వు. దిగువున ఉన్న నేను నువ్వు తాగిన తరువాతే తాగుతాను. కాబట్టి నీ ఎంగిలి నీళ్ళు నేను తాగుతాను తప్ప నా ఎంగిలి నీళ్ళు నీ దగ్గరకు వచ్చే ప్రసక్తే లేదు. అదీగాక, ప్రవహించే నీటిలో 'ఎంగిలి' ప్రసక్తే ఉండదు అంది' మేక తార్కికంగా వాదిస్తూ.

కానీ బలం వల్ల కలిగిన అంధకారం, మేకను చంపితినాలన్న కోరికవల్ల ఏర్పడిన పొరల వల్ల పులి మేక మాటలు వినలేదు. పైగా తనకు ఎదురు చెప్పి అవమానిస్తోందన్న ఆగ్రహం ప్రదర్శించి మేకను చంపి తిన్నది.

ఇతర జంతువులు కూడా పులి బలానికి జడిసి పులి చర్య సమంజసం అన్నాయి. ఇదీ కథ.

అంటే, బలహీనుడిని చంపితినటానికి, దోచుకోటానికి బలవంతుడికి కారణం అవసరం లేదన్నది ఈ కథ సారాంశం.

ఇప్పుడీ 'పులి, మేక' కథ ఆధారంగా, ఇదే ఇతివృత్తంతో పలు విభిన్నమైన కథల సృజనను చూడండి. చదవండి. మీ అభిప్రాయాన్ని, సూచనలను తెలపండి.

## *మేక - పులి - మనిషి*

**తెల్లారింది.**

'ఎప్పుడు బయటకు వెళ్దామా' అని ఎదురుచూస్తోంది బుజ్జి మేక. దానికి ఒళ్ళంతా ఉత్సాహమే. ప్రతీదీ ఆశ్చర్యమే. ప్రతీదీ అత్యద్భుతమే. దాని ఉరుకులు, పరుగులకు అడ్డు అదుపు ఉండటం లేదు. పరవళ్ళు తొక్కే జలప్రవాహంలా, ఆకృతి దాల్చిన చైతన్యంలా ఉందా బుజ్జిమేక. దానికి జీవితంలో దుఃఖం తెలియదు.

బాధలు తెలియవు. భయాలు తెలియవు. ఆందోళనలు లేవు. దానికి ఇవాళ్ళ, రేపు అన్న ఆలోచనేలేదు.

ప్రొద్దున్నే తన బంధువులందరితో కలసి తిరుగుతుంది. వాళ్ళు ఏ చెట్టు ఆకులు లాగితే, వారితో పోటీపడి మరీ ఆ చెట్టు ఆకులను ఇష్టంగా నములుతుంది.

ఒకో చెట్టు ఆకును ఒకో రుచి ఉండటం దానికి ఆశ్చర్యంగా ఉంటుంది. ఎవరు తనకోసం ఇన్ని రకాల రుచికరమైన ఆకులను సృజించానన్న ఆశ్చర్యం దానికి కలగదు. అవి తనకోసమే ఉన్నాయి. అంతే. అయితే, దాని వేగానికి, దూకుడుకు పెద్దలు అడ్డువేయటం దానికి నచ్చదు.

'అటు వెళ్ళకు. ఇటు వెళ్ళకు. అటు తిరగకు. ఇది తినకు. అది తినకు. జట్టును వదిలి వెళ్ళకు. అందరితో కలసి ఉండు. ముందు పరిగెత్తకు. మరీ వెనక ఉండకు' అని పెద్దలు ప్రతి చిన్న విషయానికీ భయపడుతూ, తనని భయపెడుతూ ఆంక్షలు విధిస్తూండటం బుజ్జి మేకకు చిరాకుగా ఉంటుంది.

ఈ పెద్దవాళ్ళు ప్రతి విషయానికీ ఎందుకు భయపడతారో అర్ధంకాదు. 'వీళ్ళకి భయపడటం, బెదురుతూండటం తప్ప మరొకటి తెలియదు' అనుకుంది బుజ్జిమేక.

దానికి తెల్లారి లేవగానే పచ్చిక బయళ్ళలోకి పరుగెత్తాలని ఉంటుంది. ముఖ్యంగా, రాత్రిపూట పడిన మంచుతో తడిసి, నునులేత సూర్యకిరణాల వెలుతురులో మెరుస్తూ లేతగా, తాజాగా కనిపించే ఆకులను తన మృదువైన పెదవులతో తాకుతూ, పళ్ళతో మెత్తగా కొరుకుతూంటే, ఆకులలోని రసం నాలికపైన అత్యద్భుతమైన రుచిని కలిగిస్తూ గొంతులోకి దిగుతూంటే ఎంతో హాయిగా, ఆనందంగా ఉంటుంది. కానీ పెద్దలకు బద్ధకం. లేచిన వెంటనే కదలవు. తాము కదిలేవరకూ తనని కదలనివ్వవు.

లేచి దూకుడికి సిద్ధంగా ఉన్న బుజ్జిమేక నిరసనగా ఇంకా బద్ధకంగా పడుకుని ఉన్న పెద్దల వైపు చూసింది.

అంతలో దానికి ఓ ఆలోచన వచ్చింది.

'వీళ్ళు చెప్పినట్టు వినాల్సిన అవసరం ఏముంది? వీళ్ళు బద్ధకం వదిలించుకుని కదిలేలోగా తాను ఒంటరిగా ఎంతో దూరం పోవచ్చు. ఎన్నెన్నో తాజా ఆకులు తినవచ్చు.'

ఆలోచన రాగానే ఆగలేక పోయింది బుజ్జిమేక. ఒక్క ఉదుటున లేచి పరుగెత్తింది. మేక జింక అయినట్టు రెట్టించిన ఉత్సాహంతో, అదుపులేని ఆనందంతో దూకుతూ పరుగెత్తింది, బుజ్జిమేక అరణ్యంలోకి ఒంటరిగా!

●●●

ఒంటరితనంలో, స్వేచ్ఛలో ఇంత ఆనందం ఉందని బుజ్జిమేక ఎన్నడూ అనుకోలేదు.

విశాల ఆకాశం క్రింద పచ్చిక బయళ్ళలో, పచ్చటి చెట్ల నీడలో ఇష్టం వచ్చినట్టు తిరిగింది బుజ్జిమేక.

ముందు కాస్సేపు దానికి భయం అనిపించింది. ప్రతి చిన్న శబ్దానికీ చెదిరింది. కానీ కాస్సేపటికి ఒంటరితనం అలవాటయింది. సర్వం మరచిపోయింది.

హాయిగా, స్వేచ్ఛగా విహరించింది. వెళ్ళాలనిపించిన వైపు వెళ్ళింది. తినాలనిపించిన దాన్ని తిన్నది. దొర్లింది. పొర్లింది. ఆడింది. పాడింది. చివరికి అలసి సొలసి చెట్టునీడలో కాసేపు విశ్రమించింది.

దానికి అంతులేని ఆనందంగా ఉంది. ఇక ఎల్లప్పటికీ ఒంటరిగానే ఉండాలని అనుకుంది. తనకింత ఆనందం కలగకూడదనే పెద్దలు మాటిమాటికీ ఆంక్షలు పెడుతూ, తనని అదుపులో పెడుతున్నారని వారిని కాస్సేపు తిట్టుకుంది. తనని చూసి వాళ్ళకి అసూయ అనుకుంది.

తాను ఎటైనా దూకగానే 'అటు వెళ్ళకు పులి బూచి వస్తుందని, ఇటు వెళ్ళకు సింహం బూచి ఉందనీ, ఆ వైపుపోకు నక్కలు, తోడేళ్ళ బూచులు ఉన్నాయని' బెదిరిస్తారు. వాళ్ళంతా అబద్ధాలు చెపుతున్నారని నిరూపణ అయిపోయింది' అనుకుంది. నీడలో పడుకుని

గలగలలాడే ఆకుపచ్చని ఆకుల నడుమ నుండి కనబడుతున్న నీలి ఆకాశాన్ని చూస్తూ అలా ఎంతోసేపు మత్తుగా, ఆనందంగా ఉంది. ఇంతలో దానికి దాహం వేసింది.

దాహం వేసినప్పుడల్లా పెద్దలు తనని నీటి దగ్గరకు తీసుకెళ్తారు. కానీ ఇప్పుడు నీరు ఎక్కడ ఉందో తానే వెతుక్కోవాలి. ఇది కొత్త ప్రదేశం. ఏది ఎక్కడ ఉందో ఎలా వెతకటం? ప్రొద్దుటి నుంచీ బుజ్జిమేక ఎదుర్కొన్న మొదటి సమస్య ఇది. కాస్సేపు ఏం చేయాలో ఆలోచించింది. ఏమీ తోచలేదు. ‘ఉట్టిగా కూచుంటే నీళ్ళు తన దగ్గరకు రావుగా. అలా వెతుకుతూ పోతే అవే దొరుకుతాయి‘ అనుకుంది. లేచి నడవసాగింది. ఇపుడు కూడా బుజ్జిమేకకు భయం వేయలేదు. నీళ్ళు దొరుకుతాయి అన్న ధీమా దానికి ఉంది.

దాని ధైర్యం సమంజసమే అని నిరూపిస్తూ కాస్సేపటికే ఆనందానికి అంతులేదు.

‘ఇంకా ఏం కావాలి?‘

తినటానికి చుట్టూ పచ్చటి చెట్లున్నాయి. ఆకులు రమ్మనిపిలుస్తూ ఊరిస్తున్నాయి. తాగటానికి నీళ్ళు జలజలా పారుతున్నాయి.

ఒక్క ఉదుటున నీటి దగ్గరకు వెళ్ళింది. ఆత్రంగా నోరు పెట్టింది. చల్లటి నీళ్ళు అమృతప్రాయంగా ఉన్నాయి. ఎప్పుడూ తాము తాగే అలవాటయిన చేదునీళ్ళ ముందు ఈ నీళ్ళు తియ్యగా, అమృతంలా ఉన్నాయి. ఆత్రంగా గబగబా తాగింది.

ఎంతో ఆనందంగా, ఉత్సాహంగా ఉంది. ఇక్కడ నీళ్ళు కూడా ఎంతో రుచిగా ఉన్నాయి. వీటిని వదిలి తామెప్పుడూ ఆ పాత నీటినే ఎందుకు తాగుతామో దానికి అర్థం కాలేదు. ‘వెళ్ళి అందరికీ ఈ విషయం చెప్పాలనుకుంది. కానీ వాళ్ళంతా వస్తే మళ్ళీ తనకి ఆంక్షలు మొదలవుతాయి. అసలు వాళ్ళతో తనకి సంబంధం ఏమిటి? హాయిగా ఇక్కడే ఉండిపోతే? తన ఇష్టం వచ్చినట్టు ఉండవచ్చు‘ అనుకుంది.

ఇంతలో ఏదో అలికిడి అయితే తలెత్తి చూసింది.

ఎదురుగా ఓ విచిత్రమైన జీవి ఉంది. దానికీ తనలాగే నాలుగు కాళ్ళున్నాయి. నడుంకి తల అతుక్కుని ఉంది. కానీ, అది తనకి భిన్నంగా ఉంది. తనకన్నా బలంగా ఉంది. ఒంటినిండా గోధుమ రంగు వెంట్రుకలు ఉన్నాయి. దాని కాళ్ళకి గోళ్ళున్నాయి.

బుజ్జిమేకను చూసి నవ్వింది ఆ జీవి. ‘ఏమిటీ... ఒక్కర్తివే ఉన్నావా? మీ వాళ్ళంతా ఏరి?‘ అడిగింది.

ఎందుకో అది నవ్వితే తన ప్రమేయం లేకుండానే బుజ్జిమేక వళ్ళు వణికింది. దాని పళ్ళు కత్తుల్లా ఉన్నాయి. అది నవ్వుతూ ఉన్నా, దాని కళ్ళు క్రూరంగా ఉన్నాయి. నవ్వుతో ముఖం క్రౌర్యంగా, భయంకరంగా అనిపించింది.

బుజ్జి మేకకు భయం కలిగింది. నోరు పెగల్లేదు. మొట్టమొదటిసారి తాను ఒంటరిగా ఉండటం వల్ల కలిగే ప్రమాదం గ్రహింపుకు వచ్చింది. తాను మందలో ఉంటే తన చుట్టూ పెద్దలు ఉండేవారు. తాను అంచులకు వెళ్తాంటే మధ్యకు తోసేవారు. అందరూ తనకు అండగా నిలబడేవారు.

ఇపుడు తాను ఒంటరి. తాను ఒంటరిగా ఎలా ఆనందించిందో, ఇప్పుడు ప్రమాదాన్నీ తానే ఎదుర్కోవాలి. అలాకాక, తాను అందరితో కలసి ఉంటే, తనకు అందరి అండ ఉండేది.

మేకను జాగ్రత్తగా పరిశీలిస్తున్న పులికి బుజ్జిమేకకు ఇంకా ఏమీ సరిగ్గా తెలియదని అర్థమయింది. దాని లేతదనం చూస్తూంటే పులిలో లేని ఆకలి పుట్టుకొచ్చి, అది మహాగ్ని అయి దహించసాగింది. బుజ్జిమేక నునులేత మాంసం తన నోట్లో కరగటాన్ని ఊహించుకుంటే ఒళ్ళంతా ఆనందంతో పులకించసాగింది. తన వాడి గోళ్ళు దాని లేత చర్మాన్ని చీల్చి దాని మాంసాన్ని కొరుకుతూ.. పులి తాళలేక పోయింది.

‘నేనెవరో తెలుసా?‘ గంభీరంగా అడిగింది.

బుజ్జి మేక శరీరం వణకసాగింది. దానికి భయానికి కారణం తెలియదు. కానీ భయస్వరూపం దాని మనసుకి తెలిసింది.

'నువ్వూ నాలాంటి ప్రాణివి' అంది బలహీనంగా.

'హ్హా...హ్హా...హ్హా' నవ్వింది పులి.

మేక అదిరిపోయింది. అసలిలాంటి శబ్దం ఉంటుందని అది అనుకోలేదు. గడగడ వణికిపోసాగింది. పారిపోవాలనుకుంది. కాళ్ళు కదలలేదు. 'నేను పులిని. ఈ ప్రాంతం నాది. ఇక్కడి రాజును నేను. నన్ను చూసి నమస్కరించలేదు. మర్యాద చేయలేదు. పైగా, నువ్వు నీళ్ళలో మూతిపెట్టి ఎంగిలి చేసిన నీళ్ళు నన్ను తాగమంటున్నావు' అంది కోపంగా.

'రాజా ఈ భూమి అందరిదీ కదా!' అంది మేక ధైర్యం చిక్కబట్టుకుని. పులి వికటంగా నవ్వింది.

'మీరు పైన ఎగువన తాగండి. నేను ఎంగిలి చేసిన నీళ్ళు పైకి పోవు' అంది బలహీనంగా.

'నాకే ఎదురు చెప్తావా? నేను అబద్ధం ఆడుతున్నానంటావా? ఎంత ధైర్యం!' అంటూ పంజా విసిరింది పులి.

తన శరీరం నిప్పులో పెట్టినట్టు ఒక్కసారిగా భగ్గుమంది బుజ్జిమేక శరీరం. ఆ మంట దానికి చైతన్యాన్నిచ్చింది. ఛెంగున ఎగిరి పరుగు ప్రారంభించింది.

తన దెబ్బకి మాములు ప్రాణి పడి ఛావాలి. రక్తం కారుతున్నా బుజ్జి మేక ఎగిరి పరుగిడుతోంది.

పులి అహం దెబ్బ తిన్నది. 'చిన్నదని జాలి చూపించకూడదు' అనుకుంది. అంతలోనే దానికి ఉత్సాహం హెచ్చింది. నిలుచున్న దాన్ని చంపి తినటం కన్నా, వెంటాడి, వేటాడి తిన్న దాన్లో మజా ఎక్కువ ఉంటుంది. పెద్దగా అరచి బుజ్జిమేక వెంట పడింది.

ప్రాణభయం అనుభవానికి వచ్చింది బుజ్జిమేకకు. అంతలోనే శరీరం నుంచి రక్తం కారుతూండటం వల్ల నీరసం వచ్చింది. కానీ వేగం తగ్గించటానికి లేదు.

కానీ వేగం తగ్గించటానికి లేదు.

దాని చెవుల్లో అమ్మమాటలు వినిపించాయి. నాన్న పలుకులు ప్రతిధ్వనించాయి. పెద్దల హితవచనాలు మనసులో మెదిలాయి. కంటనీరు కారసాగింది.

మందలో ఉంటే ఆనందం లేదు. ఆనందం కావాలంటే ఒంటరిగా విహరించాలి. కానీ, ఒంటరితనంలో ప్రమాదం ఉంది రక్షణ లేదు. దాని బుజ్జి మనసు పరిపరి విధాల దానికన్నా వేగంగా పరుగిడుతోంది. కానీ పులి తనకి దగ్గరవటం తెలుస్తోంది. తన జీవితం సమాప్తమవుతుందని తెలుస్తోంది.

ఇంతేనా జీవితం? తానింకా పూర్తిగా ఏమీ అనుభవించనేలేదు. అప్పుడే తనకు కాలం చెల్లిపోతుందా? ఇంత చిన్న జీవితం అనుభవించటం వల్ల లాభం ఏమిటి? తన జన్మకు అర్ధం ఏమిటి?

పులి దగ్గరకు వచ్చింది. గాయం చేసింది. కానీ తనని పోనిచ్చింది. 'బ్రతుకు జీవుడా' అని పరుగెత్తింది బుజ్జిమేక. అంతలో పులి మళ్ళీ దగ్గరకు వచ్చింది.

బుజ్జి మేకకు అర్ధమయింది. పులి తనతో ఆడుకుంటోంది. తనతో చెలగాటమాడుతోంది. తనను వేధించి, హింసించి ఆనందిస్తోంది. బుజ్జిమేకకు నీరసం వచ్చింది. ఎలాగో పోయే ప్రాణాన్ని కాపాడు కోవాలని విఫల ప్రయత్నాలు చేయటం ఎందుకు?

బుజ్జిమేక పడిపోయింది. కళ్ళు మూసుకుని పులిగోళ్ళు, పళ్ళు తన శరీరాన్ని చీల్చే భయంకరానుభూతిని అనుభవించేందుకు తనని తాను సిద్ధం చేసుకుంది.

'జీవితం అనుభూతుల పరంపర. మంచి అయినా, బాధాకరమైనా అనుభవించటమే జీవి పని' అనుకుంది.

కానీ ఎదురు చూసిన పులి వేటు పడలేదు.

ఏవో అరుపులు, కేకలు వినిపించాయి. ఎన్నో జీవులు పరుగెత్తుతున్నట్టు అనిపించింది.

అతి కష్టం మీద, మూత పడుతున్న కళ్ళు తెరిచి చూసింది బుజ్జిమేక. ఒక్కసారిగా దాని కళ్ళు విచ్చుకున్నాయి.

ఎదురుగా ఎన్నో విచిత్రమైన జీవులు కర్రల్లాంటి ఆయుధాలు ధరించి పులిపై విరుచుకు పడుతున్నాయి. రెండు కాళ్ళతో, భుజాల నుంచి విచిత్రంగా వ్రేలాడే మరో రెండు కాళ్ళలాంటి పుల్లలతో కర్రలు పట్టుకున్న ఆ జీవులు చూడటానికి బలహీనులే అయినా, సంఖ్య వల్ల కలిగిన బలంతో పులిని చితక బాదుతున్నారు. పులి విసిరిన పంజాను లాఘవంగా తప్పుకుంటూ దాన్ని గాయపరుస్తున్నారు.

ఆ విచిత్ర పోరాటం చూస్తూ పరుగెత్తి ప్రాణాలు రక్షించుకోవాలన్న ధ్యాస కూడా లేకుండా అలాగే పడి ఉంది బుజ్జిమేక.

ప్రపంచ వైచిత్రి దానికి అర్ధమయీ, అవనట్టుంది.

తనని చంపుతుందనుకున్న పులి విచిత్ర జీవుల చేతుల్లో చచ్చింది. దాని ప్రాణాలు పోయాయి. తాను బ్రతికుంది.

ఇంతలో ఓ బుజ్జి విచిత్ర జీవి దాని దగ్గరకు వచ్చింది. బుజ్జి మేకను తడిమి కిలకిల నవ్వింది.

పెద్ద జీవులు వచ్చాయి. బుజ్జిమేక చుట్టూ గుమికూడాయి. దాని శరీరంపై ఏవో ఆకులు పూసి కట్లు కట్టాయి.

'నా ప్రాణాలు కాపాడారు. ఎవరు మీరు?' అడిగింది తేరుకున్న బుజ్జిమేక.

'మేం మనుషులం. సాటి జీవి ప్రాణం కాపాడటం మా ధర్మం. బలవంతుల నుంచి బలహీనులను రక్షించి, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడటం మా కర్తవ్యం. అన్ని జీవులూ సమానమేనని అందరికీ జీవించే హక్కునివ్వటం మా లక్ష్యం' గంభీరంగా అంది ఆ జీవి.

విస్ఫారిత నేత్రాలతో ఆ జీవి వైపు చూసింది బుజ్జి మేక.

'జీవులన్నిటిలోకీ శక్తివంతుడవు, బుద్ధిమంతుడవు, రాజీవుడవు, రారాజువు. మేము బలహీన జీవులం. అన్నిటికీ, అందరికీ భయపడుతూ జీవిస్తూంటాం. మాకు అభయమిచ్చి, మమ్మల్ని రక్షించవా?' అంది బుజ్జిమేక.

నవ్వాడు మానవుడు 'ఏదీ మీ వారందరినీ చూపించు. అల్పప్రాణుల రక్షణను మించి వేరే ధర్మంలేదు' అన్నాడు ఆ మానవజీవి.

'మీరు చాలా మంచివారు. దయార్ద్ర హృదయాలు' అంది బుజ్జిమేక. వారికి తమ మంద ఉండే చోటు చూపించింది.

బుజ్జి మేకను చూడగానే దాని తల్లిదండ్రులు పరుగున వచ్చి ఎత్తుకున్నారు. కానీ విచిత్రమైన జీవులను చూసి మేకలన్నీ చెదిరి దూరంగానే ఉన్నాయి.

'భయం లేదు. మన రక్షణ కోసం వచ్చారు. నా ప్రాణం కాపాడారు. మనకిక పులులు, సింహాలంటే భయం ఉండదు. స్వేచ్ఛగా, హాయిగా, నిర్భయంగా బ్రతకవచ్చు' ఆనందంగా చెప్పింది బుజ్జిమేక.

'వద్దు.. ఈ జీవులేవో విచిత్రమైనవి. ఈ ప్రపంచంలో నష్టం వెన్నంటిలేని లాభం ఉండదు. ప్రమాదం లేని ప్రమోదం ఉండదు. వీళ్ళు నమ్మదగ్గవారో, లేదో తెలియకుండా తొందరపడకూడదు' హెచ్చరించి అందరినీ వెనక్కులాగారు పెద్దలు.

మేకల మందలో చర్చలు ఆరంభమయ్యాయి. వాదోపవాదాలు తీవ్రమయ్యాయి.

ఇంతలో ఓ మేక 'అటుచూడండి' అని అరిచింది.

మాటలు మాని అన్నీ ఆ వైపు చూశాయి.

వీళ్ళు చర్చల్లో మునిగిన సమయంలో మేకల చుట్టూ కంచెకట్టారు మానవులు.

'ఇక మీరు సురక్షితం. మీకేభయంలేదు అన్నారు. 'నేను చెప్పినట్టు చేయండిక'

'మాకీ కంచెవద్దు' అని అనబోయిన మేకను కర్రతో గట్టిగా కొట్టాడు. దాంతో అన్ని మేకలు మౌనంగా ఉండిపోయాయి.

'పులి వీటి మాంసం వెంటబడిందంటే, వీటి మాంసం రుచిగా ఉండి ఉంటుంది' అంటూ ఓ బలిష్టంగా ఉన్న మేకను చేతుల్లోకి తీసుకున్నాడు. మిగతా మేకలన్నీ ఒక్క దగ్గరకు ఒదిగి నిలబడ్డాయి భయంగా.

కంచె బయట, బుజ్జిమేకను ఓ గుంజెకు కట్టాడు బాల మానవుడు. కిలకిల నవ్వుతూ దాన్ని పుల్లతో పొడుస్తూ ఆడుకోసాగాడు. కంచెలో బందీలయిన తవారిని చూసింది బుజ్జిమేక. గుంజను దాటిపోలేని తనవైపు చూసుకుంది.

పైన అనంతమైన నీలి ఆకాశం వైపు చూసింది. ఎదురుగా దిగంతాల వరకూ సాగిన పచ్చిక బయళ్ళను, మైదానాలను చూసింది.

బుజ్జిమేక కళ్ళనుంది రెండు నీటి చుక్కలు రాలాయి.

## మేకలూ - మైదానాలు

ఆకాశంలో వింత రంగుల విచిత్రమైన విన్యాసం సాగుతోంది.

ఆ విన్యాస సౌందర్యం చూసి నిశ్చేష్ట అయినట్టు సర్వ ప్రకృతి నిశ్చలంగా ఉంది.

చిరుగాలి కూడా వీయటంలేదు. చిన్న ఆకు కూడా కదలటం లేదు.

ఆ నిశ్శబ్ద నిశ్చల ప్రకృతి పరమ రమణీయమైన సౌందర్యాన్ని చూస్తూ మైమరచి పోయినట్టు నిలిచిపోయాయి ఆ రెండు మేకలు.

యవ్వనం ఏ జీవికయినా ఒక వింత అందాన్నిస్తుంది. పైగా, ఆ యవ్వనానికి ప్రేమ పరిమళం తోడయితే తద్వారా కలిగే అందం వర్ణనాతీతం ప్రతి ఒక్కరికీ అత్యంత ఆనందం కలిగిస్తాయి ప్రేమలో ఉన్న జీవులు.

వీరిద్దరినీ చూస్తూ ఆనందంతో ఆకాశంలో రంగులు చిత్రవిచిత్ర విన్యాసాల నృత్యంచేస్తున్నాయని మేకల సమూహం భావిస్తూ సంతోషిస్తోంది. సర్వ ప్రకృతిని స్థంభింపచేసే పరమాద్భుత సౌందర్య వంతులయిన వారు తమ సమూహంలో ఉన్నారన్న గర్వంతో కలిగిన సంతోషం అది.

భార్య మేకకు గమ్మత్తుగా ఉంది. ఈ కొమ్ములు తిరిగిన యువకుడు తన భర్త అనుకుంటే గర్వంగా ఉంది. తమ పెళ్ళి సమయంలో తల్లి చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి.

'ప్రపంచంలో అన్నిటికన్నా ముఖ్యం ధర్మపాలన. ఇతడు నీ భర్త, నువ్వు అతడి భార్య. ఇద్దరూ కలసి సంసారం చేయాలి. సంతానాన్ని కనాలి. వారిని ప్రయోజకులను చేయాలి. ఇది బాధ్యత. బాధ్యతనే ధర్మం. ధర్మం నుంచి తప్పించాలని ఎంతో మంది ప్రయత్నిస్తారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నీ ధర్మం నెరవేర్చటంలోనే నీ వ్యక్తిత్వం తెలుస్తుంది. మాకు మంచి పేరు వస్తుంది. అందరికీ సౌఖ్యం, ఆనందాలు కలుగుతాయి.' తల్లి మాటలు గుర్తుకు వచ్చిన మేక మనస్సులో ఓ అందమైన భావన మెదిలింది.

'అందుకే నన్ను ధర్మపత్ని అంటారన్నమాట' అనుకుంది. 'జీవితాన్ని సార్థకం చేసుకునే ధర్మాచరణలో తామిద్దరూ సహచరులం' అన్న భావన ఆమెకు ఎంతో గొప్పగా అనిపించింది. భర్తకు దగ్గరగా జరిగింది

కాలం హాయిగా, ఆనందంగా, వేగంగా గడుస్తోంది. 'అసలు జీవితంలో ఇంత ఆనందం ఉందా?' అనిపిస్తోంది భార్య మేకకు. ప్రొద్దున్నే ఇద్దరూ కలసి మేతకు బయలుదేరతారు. పచ్చిక బయళ్ళలో హాయిగా తిరుగుతారు. ఆడుకుంటారు. అలసిపోయి ఇంటికి తిరిగి వస్తారు.

భర్త తన పక్కన ఉంటే అదో తెలియని భద్రతా భావన ఆమెకు కలుగుతుంది. అడవిలో అనేక క్రూరమృగాలుంటాయని ఆమెకు తెలుసు. అవి రకరకాల రూపాల్లో ఉంటాయని తెలుసు. నక్కలు, తోడేళ్ళు, పులులు, సింహాలు వంటివి తమని చీల్చి చెండాడటానికి సిద్ధంగా ఉంటాయని తెలుసు.

నీళ్ళల్లో మొసళ్ళు, పాములవంటి ఉంటాయనీ తెలుసు. కానీ తన భర్త పక్కన ఉంటే అవేవీ తన దరిదాపులకు కూడా రావనీ తెలుసు. భర్త తనపక్కన ఉన్నప్పుడు, తోడేళ్ళు, ఇతర మృగాలన్నీ తన వైపు ఆకలి చూపులు ప్రసరిస్తూండటం గమనించింది. కానీ ధైర్యంగా కళ్ళెత్తి చూడటం కానీ, దగ్గరకు వచ్చే ప్రయత్నాలు కానీ చేయవు. తన భర్త వాడి కొమ్ములు, బలమైన కాళ్ళు, బలమైన చెట్ల కాండాలని సైతం చీల్చగల శక్తివంతమైన పళ్ళు వాటన్నిటినీ దూరం ఉంచుతాయి. అందుకే మందలో గర్వంగా తలెత్తుకు తిరుగుతోంది మేక. రాత్రిపూట అలసి సొలసి భర్త పడుకున్నప్పుడు, పైన మిలమిలలాడే తారలు తన భర్తకు చల్లగాలి వీవెనలు వీస్తున్నట్టనిపిస్తుంది ఆమెకు. మురిపెంగా అతడివైపు చూస్తూ ఎప్పుడో నిద్రలోకి జారుకుంటుంది. ఎవరికీ లేని భద్రత ఆమెకి ఉంది అన్న ధీమా ఆమెది.

●●●

ఆ మేకల మందలో సంచలనం కలిగింది.

అది అతి సన్నగా ఆరంభమయింది. పొరుగు అడవి నుండి బహిష్కృతమైన ఓ యువమేక ఈ మందలో ఆశ్రయం కోరింది. 'ఆ మందలో వాళ్ళంతా వెనకబడినవారు. కొత్త ఆలోచనలు స్వీకరించలేనివారు. స్వేచ్ఛ అంటే ఉలిక్కిపడతారు. మేకల మనసులను సంప్రదాయం, ధర్మం అంటూ పనికి రాని, కాలం చెల్లిన బంధనాలలో బంధించి ఉంచేందుకే ఇష్టపడతారు. కొత్త ఆలోచనలను స్వాగతించటం, స్వేచ్ఛను ఆమోదించటం తెలియని అనాగరిక మేకల మంద అది. అక్కడున్న యువ మేకలు కూడా పెద్ద మేకల మాట జవదాటని వెన్నెముకల్లేని మేకలు. మీరు అలాకాదన్న ఆశతో మీ ఆశ్రయం కోరుతున్నాను' అంది ఆ యువ మేక.

దాన్ని కాదంటే ఎక్కడ తమని కూడా అనాగరికులు, అభివృద్ధి నిరోధకులు, స్వేచ్ఛ వ్యతిరేకులు అని దూషిస్తాడేమోనని భయపడ్డాయి. ఆ మందలో నిర్ణయాలు తీసుకునే మేకల పెద్దలు. కానీ వాడిపై ఓ కన్నేసి ఉంచాలని నిశ్చయించాయి. అంతేకాదు, ఇతర యువతీ యువ మేకలను జాగ్రత్తగా ఉండమని హెచ్చరించాయి.

అలా ఆ మందలో ప్రవేశించిన ఆ యువమేక త్వరలోనే ఎంతో మంది యువతీ, యువకులను ప్రభావితం చేయగలిగాడు. ముఖ్యంగా యువతి, యువ మేకలు ఇష్టం వచ్చినట్టు, ఇష్టమైనప్పుడు, ఇష్టమైన వారితో కలవ వచ్చని అదే ప్రేమ అని ఆ యువమేక చెప్పటం యౌవనావేశంలో ఉన్న వారందరికీ నచ్చింది.

యవ్వనంలో కోరికలు తీరక వయసయిపోతున్నదని బాధపడే మేకలకూ నచ్చింది.

అంతవరకూ కట్టుబాట్లనీ, సంప్రదాయమని, ధర్మమని పురుషమేకలకు దూరంగా ఉండేవి ఆడమేకలు. ఇది నచ్చని పురుష మేకలకు ఆ కొత్త యువమేక వాదనలు నచ్చాయి. తమ ఇంటి ఆడమేకలు కాక పరాయి స్త్రీ మేకలన్నీ ఆ యువమేక ప్రభావానికి గురికావాలని వాంఛించి, అలా ప్రచారం చేయసాగాయి. తమ ప్రచార ప్రభావానికి లొంగని యువతి మేకలను, ఇతర మహిళ మేకలను

వెనకబడినవారని దూషించటం ఆరంభించాయి. వీరి చర్యలను ప్రతిఘటించిన వారిని అభివృద్ధి నిరోధకులని, ఛాందసులను విమర్శించసాగాయి.

తన చుట్టూ చెలరేగుతున్న ఈ సంచలనం గమనించినా, దాని సంపూర్ణ స్వరూపాన్ని గ్రహించలేకపోయింది. కానీ అందరూ కొత్తగా వచ్చి యువ మగమేక గురించి చర్చిస్తూంటే దాని పట్ల కుతూహలం కలిగింది. ఒకరోజు భర్త మేకతో అన్నది.

'అందరూ కొత్తగా వచ్చిన దాని గురించి ఏవేవో చెప్తున్నారు?' భర్త మేక ఆమెవైపు కోపంగా చూశాడు.

'ఆ వెధవ మేక గురించి ఆలోచన కూడా చేయకు. దుష్టుడు వాడు వాడి తీరని కోరికలకు సిద్ధాంతం ముసుగువేసి, తాను భ్రష్టుపట్టింది కాక, అందరినీ భ్రష్టుపట్టిస్తున్నాడు. వీడిమాట అందరూ అనుసరిస్తే కొన్నాళ్ళకి భ్రష్టు పట్టటమే ధర్మం అవుతుంది'

భర్త మాటలు ఆమెకి రుచించలేదు. అతడికి సమాధానంగా ఏదో అనబోయింది. కానీ అలాగే కోపాన్ని పెంచటం ఎందుకని మౌనంగా ఉండిపోయింది. కానీ ఆరోజు నుంచీ కొత్తమేక పట్ల కుతూహలం ఆసక్తిగా పరిణమించింది.

●●●

ఆ కొత్తమేక మిగతా ఆడమేకలన్నిటితో సరసాలాడటం, ఛలోక్తులు విసిరి నవ్వించటం, తనని చూడగానే ముఖం తిప్పుకుని పోవటం భార్య మేకలో ఆమెకే అర్థంకాని నిరాశ కలిగించింది. కొంచెం కోపం కూడా కలిగింది.

'తన వైపు ఎందుకు చూడడు? కనీసం ఎందుకని నవ్వడు? తనలో ఏం లోపం ఉంది?' అనుకుంది.

ఓ రోజు అనుకోని పరిస్థితులలో ఇద్దరూ ఎదురు పడాల్సి వచ్చింది. భార్యమేక గుండె ఝల్లుమంది.

ఆ కొత్తమేక తన వైపు చూసిన చూపు తన శరీరంలోకి తొలుచుకుపోయినట్టనిపించింది.

'తన భర్త ఏనాడూ తనని అలా చూడలేదు' అనుకుంది. ఆ సమయంలో భర్త దూరంగా ఉండటం 'మేలయిందని'పించింది.

●●●

మరోసారి అనుకోకుండా ఎదురు పడింది కొత్త మేక. భార్య మేకను చూసి నవ్వింది. కాళ్ళు తడబడుతూంటే, వొళ్ళు వణుకుతుంటే గబగబా అక్కడికి దూరంగా వచ్చేసింది. ఎంతో సేపటి వరకూ గుండె దడ తగ్గలేదు. ఆమె పరిస్థితి ఆమెకే విచిత్రంగా ఉంది. భర్త మేకను ప్రేమిస్తోంది. తన జీవితం, తన ధర్మం భర్త మేక. కానీ కొత్త మేక పట్ల ఆకర్షణ కలుగుతోంది. ఏమిటిది?

తన సందిగ్ధాన్ని ఎవరు తీరుస్తారో భార్యమేకకు తెలియలేదు. అసలు ఎవరికయినా ఏమని చెప్పుకోవాలో అర్థం కాలేదు.

ఆమెకు తెలియకుండానే ఆమెలో ఓ అశాంతి బయలుదేరింది. ఒక అసంతృప్తి రేఖ మాత్రంగా పొడసూపింది. ఆమె ప్రమేయం లేకుండానే మాట మాటికీ చిరాకు పడటం, కోపం రావటం జరుగుతోంది. కళ్ళు నీళ్ళతో నిండుతున్నాయి.

●●●

ఆ రోజు ఎప్పటిలాగే అన్యమనస్కంగా మేత మేస్తోంది. ఎవరో తనని వెంబడిస్తున్నట్టు అనిపించింది. చుట్టూ చూసింది. ఆమె భర్తమేక దగ్గరలేదు. భయం వేసింది.

ఇంతలో చెట్టు చాటునుంచి కొత్త మేక వెలుపలికి వచ్చింది. సూటిగా భార్య మేక దగ్గరకు వచ్చింది.

'నిన్నిలా ఒంటరిగా కలవటం కోసం ఎన్ని రోజులుగా ఎదురు చూస్తున్నానో తెలుసా?' అంది కొత్తమేక.

ఆ స్వరం వింటుంటేనే ఒళ్ళు విచిత్రంగా కంపిస్తోంది. ఆ కంపనలో ఏదో హాయి ఉంది.

'నీకెంత ధైర్యం? నా భర్తమేక దగ్గరలోనే ఉంది' అతి కష్టం మీద అంది. కానీ అందులో బెదిరింపుకన్నా బేలతనం ఉంది. ఎక్కడ భర్తమేక వచ్చేసి తమ కలయికను మధ్యలో అడ్డుకుంటుందోనన్న భయం ఉంది. కొత్తమేక అందంగా మందహాసం చేసింది.

'ప్రేమించాలంటే ఎంతో ధైర్యం కావాలి. ప్రేమ దైవంతో సమానం. దైవం దేనికయినా భయపడుతుందా? నిన్ను ప్రేమిస్తున్న నేను ఎవరికయినా ఎందుకు భయపడాలి?' అడిగిందా కొత్త మేక.

భార్య మేకకి ఏమనాలో తోచలేదు. 'నాకు పెళ్ళయింది' అంది. 'అయితే ఏంటట? ఈ బంధాలు, బాంధవ్యాలు అన్నీ మనకి మనం కల్పించుకున్నవి. బంధనాలలో ఒదిగి ఆనందాన్ని వదులుకోకు. కాకిలా వెయ్యేళ్ళు బ్రతికేకన్నా, హంసలా ఒక్కరోజు బ్రతకటం మేలు. మందను దాటని మేకలా జీవితాంతం ఉండేకన్నా, స్వేచ్ఛగా మందని వదలి ఒక్క రోజు బ్రతికినా చాలు.'

కొత్త మేక అంటున్న మాటలు అర్థం కాకపోయినా, అతను తన తెలివి తక్కువతనాన్ని, పిరికితనాన్ని విమర్శిస్తున్నాడని భార్యమేకకి అర్థమయింది. దానికి సిగ్గుపడింది.

'నాకు తెలుసు, నువ్వు నన్ను ప్రేమిస్తున్నావు. కానీ మీ మేక మందకు జడిసి ఆ నిజాన్ని అణచిపెడుతున్నావు నిన్ను నువ్వే మోసం చేసుకుంటున్నావు' అంటూ ఒక అడుగు ముందు కేసి, భార్య మేకను సున్నితంగా స్పృశించి చెట్ల నీడలలో మాయమయింది.

ఆ స్పర్శ భార్య మేకలో అత్యంత సౌఖ్యవంతమైన ప్రకంపనాలు సృష్టించింది. అలలు అలలుగా ఉబికి వస్తూ నరనరాన్ని ఉత్తేజిత పరుస్తున్న ఆ సౌఖ్యభావనకు ఉక్కిరిబిక్కిరి అయింది భార్య మేక. వివశ అయింది. మైమరచిపోయింది.

తాను నిద్రపోతున్నదో, మేల్కొని ఉన్నదో తాను చైతన్యంలో ఉందో, చైతన్యరహితంగా ఉన్నదో ఏమీ తెలియని ఒక స్వరం మరిపించే సౌఖ్యానుభూతి సాగరంలో మునిగిపోయింది.

'ఏమైంది?' భర్త మేక స్వరం వినిపించటంతో ఉలిక్కిపడింది. ఈలోకానికి వచ్చిపడింది. ఎందుకో క్షణంలో ఆనందం ఆవిరైపోయింది. నోరు చేదయిపోయింది. భర్తను చూస్తే గర్వం అనిపించలేదు. చిరాకు కలిగింది.

'పద' భార్యను దగ్గరకి తీసుకున్నాడు భర్తమేక.

అతని పరిష్వంగం ఇబ్బందిగా అనిపించింది. ఎలాంటి సౌఖ్యానుభూతి కలగలేదు. అతి మామూలుగా ఉంది స్పర్శ.

ఏదైనా ఆరంభంలో ఉన్న ఉద్వేగం, ఉత్తేజం, సౌఖ్యం రానురాను ఉండదని, ఎలాంటి గొప్ప అనుభూతి అయినా అలవాటయితే సామాన్యమైపోతుందని భార్య మేకకు తెలియదు. జీవితాంతం కొత్త అనుభూతులు లభించవనీ తెలియదు. తన శరీరం భర్తస్పర్శకు సౌఖ్యానుభూతితో స్పందించక పోవటానికి కారణం, తన భర్తలోపమే అనుకుంది. అంతకాలం తమ నడుమ ఏర్పడిన బంధం, అనురాగం భార్యమేకకు గుర్తుకురాలేదు. అత్యంత నవీన సౌఖ్యానుభూతి తీవ్రత హోరులో గత సౌఖ్యానుభూతుల సారం కొట్టుకుపోయింది. కొత్త అనుభూతుల కోసం శరీరం తపించసాగింది. మనసు ఆతృత పడసాగింది.

●●●

'మనం ఈ మందలో ఉంటూ కలవటం కుదరదు. మందకు దూరంగా పారిపోదాం' భార్యమేకతో అంది కొత్త మేక.

'అమ్మో.. ఎవరూ లేకుండానా?' అంది భార్య మేక.

'వీళ్ళంతా తాము ఆనందం అనుభవించరు. ఎదుటివారు అనుభవిస్తూంటే చూస్తూ ఓర్వరు. పైగా నీ భర్త మేక నన్ను వదలడు. తన కొమ్ములతో...'

'ఒద్దు మాట్లాడకు' కొత్త మేకను తాకింది భార్యమేక. వివశ అయింది.

‘పద పోదాం. సౌఖ్యానుభూతి కోసమే మనం జీవించేది. ఆ సౌఖ్యం అనుభవించని జన్మ వ్యర్థం. కట్టుబాట్లు, సంప్రదాయాలు, బాంధవ్యాలు, ధర్మం అన్నీ అసూయ పరులు సృష్టించినవి. ఎదుటి వారేదో ఆనందం పొందేస్తారని భయపడే కుళ్ళుబోతులు ఏర్పాటు చేసినవి. పద ఇద్దరం కలసి ప్రేమలో జీవిద్దాం. సౌఖ్య సాగరంలో ఈదులాడుదాం‘

భార్యమేకకు సమాధానం ఇచ్చే చైతన్యం లేదు. ఆమె చైతన్యం సర్వం కొత్త మేక స్పర్శ హరించింది. దాని వాదనలు, భార్యమేక సంశయాలను జయించాయి. ఇద్దరూ గుట్టుచప్పుడు కాకుండా, మందను వదిలి వేశారు. దూరం అడవిలోకి వెళ్ళిపోయారు.

●●●

స్వేచ్ఛలో ఎంత ఆనందం ఉందో భార్య మేక అనుభవానికి వచ్చింది. ఇద్దరూ కలసి మైదానాల్లో గాలుల్లా పరుగెత్తారు. నదుల్లో ఈదులాడారు.

మేఘాలపై తేలియాడారు. కొండ శిఖరాలపై నృత్యం చేశారు.

‘నువ్వు ఇంకా ఆ మూర్ఖుల మాటలు విని ఆ మందలోనే ఉండుంటే ఇంత ఆనందం, ఇంత సౌఖ్యం అనుభవించే దానివేనా?‘ సొమ్మసిల్లి ఒకరి ఒడిలో ఒకరు పడిపోయారు. అప్పుడడిగింది యువమేక.

సమాధానంగా అత్యంత సౌఖ్యానుభూతితో కూడిన చిరునవ్వు నవ్వింది భార్యమేక. ఆమెకూ ఇదంతా కలలా ఉంది. కానీ ఆరంభంలోని తీవ్రత ఇప్పుడు లేదు.

ఇంతలో నీడపడినట్టయి కళ్ళు తెరచింది. అరవటం కూడా మరచిపోయేంతగా భయపడింది.

ఇంతకాలం దూరం నుంచి చూసి వెళ్ళిపోయే, తోడేళ్ళు, నక్కలు ఇప్పుడూ ఆశగా, ఆకలిగా తమని చుట్టుముట్టాయి.

కొత్త మేక వెనుక దాక్కుంది భయంగా. కానీ తోడేళ్ళు ఆమె కళ్ళముందే కొత్త మేకను చీల్చి వేశాయి. నక్కలు ఊళలు పెడుతూ భార్యమేక పైకి దూకాయి.

కొత్తమేక మరణానికి దుఃఖం పొంగిపొర్లుతున్నా, ప్రాణభయం భార్యమేక కాళ్ళకు శక్తినిచ్చింది. అతివేగంగా నక్కల నుంచి, తోడేళ్ళనుంచి తప్పించుకుని పరుగెత్తసాగింది. ఏ జీవి అయినా తన ప్రాణాన్ని మించి దేన్నీ ప్రేమించదని అర్థమయింది.

ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగెత్తుతున్న భార్యమేక మనసులో రకరకాల ఆలోచనలు పరుగెత్తుతున్నాయి.

తన మందలోనే ఉంటే ఈ నక్కలు, తోడేళ్ళ బారిన పడేదా? తన భర్త పక్కన ఉంటే తనవైపు కన్నెత్తి చూసే ధైర్యం వీటికి ఉండేదా? మంద తన వెంట రక్షణగా ఉంటే ఈ పరిస్థితి వచ్చేదా? కానీ మందలో ఉంటే, అత్యంత తీవ్రమైన స్వానుభూతి అనుభవానికి వచ్చేదా? కానీ దాని పరిణామం ఏమిటి?

ఆమె కళ్ళముందు తాను కలలు గన్న తన సంతానం రూపాలు అస్పష్టంగా కదలసాగాయి. వారికొకరూపు ఏర్పడనేలేదు. తాను తన బాధ్యత, తన ధర్మం నిర్వహించనే లేదు. అపుడే తన జీవితం అంతం అయిపోతోంది. తన జీవితమే కాదు, తనద్వారా జన్మించబోయే తరువాత తరం, వారిద్వారా సృజించబడే అనేక తరాలు అదృశ్యమైపోతున్నాయి. తన ధర్మం తన బాధ్యత. శారీరక సౌఖ్య వాంఛకు ప్రేమ అనే ముసుగు తొడిగి తన స్వార్థం తాను చూసుకుంది. కానీ తాను భావితరాలకు చేస్తున్న అన్యాయాన్ని గ్రహించలేకపోయింది.

దుఃఖం పొంగిపొర్లుతుంటే పరుగెత్తటం ఆపి నిలుచుండిపోయింది భార్యమేక. ఎంతసేపటికీ నక్కలు తోడేళ్ళు రాకపోయేసరికి చుట్టూ చూసింది. తాను ఎంత వేగంగా పరుగెత్తిందంటే అవి వెనుకబడిపోయాయి. ఇప్పుడు తాను వెనక్కు వెళ్ళలేదు. ముందు ఏమీలేదు. తాను గతంతో సంబంధం తెంచుకుంది. వర్తమానంలో జీవించాలనుకుంది. భవిష్యత్తు కోల్పోయింది.

దుఃఖిస్తూ ఎదురుగా ఉన్న పారుతున్న నీటిని చేరుకుంది. నీరు తాగాలని నోరు నీట్లో పెడుతూంటేనే 'ఏయ్' అన్న గర్జన వినిపించింది.'

'నీ ఎంగిలి నన్ను తాగమంటావా?' గర్జించింది ఎగువనున్న పులి. ఒంటరిదాన్ని చూస్తే ప్రతివాడికీ చులకనే. మేక ఏదో అనబోయింది.

'నాకే ఎదురు చెప్తావా?' అంటూ పులి మీదకు దూకింది.

పులి గోళ్ళు తనని చీల్చి, పళ్ళు తన మాంసాన్ని ముక్కలు చేస్తుంటే భార్య మేకకు నొప్పి కలగలేదు. దాని కళ్ళముందు, ఎదురుగా ఉన్న విశాల మైదానంలో స్వేచ్ఛగా విహరిస్తూన్న తన పుట్టని సంతానం, వారికి పుట్టని తరతరాల మేకలు కనిపించాయి. అవి తనవైపు జాలిగా చూస్తున్నట్టు అనిపించింది.

ఆకాశంలో అస్తమిస్తున్న సూర్యకిరణాలు రంగురంగుల విన్యాసాలు చేస్తున్నాయి. బలవంతుడు బలహీనుడిని అణచివేయటం స్వభావికం. ఇది భౌతిక శక్తికి సంబంధించింది. కానీ తాను బలవంతుడి దౌష్ట్యానికి బలైపోలేదు. తన మనస్సే తన శత్రువు. తనను తానే మోసం చేసుకుంది. తరతరాలకు అన్యాయం చేసింది. భార్య మేక ప్రాణాలు అనంత వాయువుల్లో కలసిపోయాయి.

## మేకస్వామ్యాలు - మేక వన్నె పులులు

'**ఎంతో ఆలోచించిన తరువాత ఈ నిర్ణయం తీసుకున్నాము.** ఇది మన మేకల సమూహం అభివృద్ధి కోసం తీసుకున్న నిర్ణయం. ఎంతకాలం మనం అడవుల్లో ఆకులు తింటూ బ్రతుకుతాం? ఎంతకాలం మనం ప్రకృతిపై ఆధారపడి బ్రతుకుతాం? ఎంతకాలం మనం చుట్టూ పొంచి ఉన్న క్రూర జంతువుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి క్షణం క్షణం భయ పడుతూ బ్రతుకుతాం? ఈ పరిస్థితిని మార్చటం కోసమే ఈ చారిత్రాత్మకమైన నిర్ణయాన్ని తీసుకున్నాం. మేకలు శక్తివంతమై, అభివృద్ధి చెందేందుకే ఈ మేకల గతిని నిర్దేశించే నిర్ణయం తీసుకున్నాం' గంభీరంగా ప్రకటించింది నాయక మేక. 'మనం మేక స్వామ్యం అమలు పరుస్తున్నాం. మేకలు, మేకలకోసం, మేకలను, మేకలే పాలించే వ్యవస్థ ఇది' అన్నాయి మేకలు. 'ఎంతకాలం, అనాగరికంగా బ్రతుకుతాం?' అన్న ఆలోచన మేకలకు నక్కలు, కుందేళ్ళను చూసిన తరువాత కలిగింది. అవి ఒక సమూహంలా ఏర్పడి, తామందరికీ సంబంధించిన నిర్ణయాలు తీసుకునేందుకు తమలో తెలివైన వాడిని, నిస్వార్థపరుడిని నాయకుడిగా ఎంచుకుని, వాడు చెప్పినట్టు వినటం చూసిన తరువాత మేకలకూ అలాంటి ఆలోచన కలిగింది.

'ఎంతకాలం నాధుడు లేని అనాధగా ఉంటాం? మనమూ ఓ నాయకుడిని ఎన్నుకుంటే నిర్ణయాల బాధ్యత అతనిదవుతుంది. మనం హాయిగా ఆకులు తింటూ గడపవచ్చు' అనుకున్నాయి మేకలు.

అనుకున్న వెంటనే ఎవరు 'నాయకుడిలా ఉండాలా?' అని ఆలోచించాయి.

వాటిలో తెలివైన మేకలుగా గుర్తింపు పొందిన మేకలు నాయకత్వం వహించటానికి సుముఖత చూపలేదు. 'సిద్ధాంతాలు చేయటం, విశ్లేషణలు చేయటం, విమర్శించటం మా పని. నడుం బిగించి సిద్ధాంతాలను ఆచరణలో పెట్టటం కార్యశూరులపని, మేధావుల పని కాదు' అన్నాయి. దాంతో మేకలు గొప్ప మేకలుగా గుర్తింపు పొందిన మేకలను ఆశ్రయించాయి.

'మేము వీరులమే. శత్రువును చీల్చి చెండాడతాము. కానీ మాకు ఎవరయినా ఆజ్ఞలివ్వాలి. మేమే నిర్ణయాలు తీసుకోలేం. అదీగాక, మాకు యుద్ధం తెలుసు కానీ, 'పాలన' తెలియదు. దానికి ఆలోచన అవసరం. దూర దృష్టి అవసరం. మీరు ఋషి మేకల దగ్గరకు పొండి' అన్నాయి వీరమేకలు.

దాంతో ఋషి మేకల దగ్గరకు వెళ్ళాయి.

'మేము లోక కళ్యాణం కోసం తపస్సు చేస్తున్నవాళ్ళం. ఆధ్యాత్మిక చింతనలో మునిగి, కోరికలను అణిచి, సర్వసౌఖ్యాలను త్యజించి, సమజానికి దూరంగా బ్రతుకుతున్నాం. సమాజ శ్రేయస్సును నిస్వార్థంగా కాంక్షించే మేము, రాజభవనాలలో నివసించి నాయకత్వం నెరపలేము. సమాజానికి దిశానిర్దేశనం చేయగలం. నియం నిబంధనల నేర్పరచగలం. అంతేకానీ నాయకుడిలా వ్యవహరించలేం' అన్నాయి.

మేకలకేం చేయాలో తోచలేదు. ఒకప్పుడు తమకు నాయకుడిలా వ్యవహరించిన మేకలను కాదనే కొత్త వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటున్నాయి. మళ్ళీ పాత వాళ్ళ దగ్గరకు వెళ్ళటం ఇష్టం అనిపించలేదు. అందుకని కొన్ని మేకలు, ఇతర జంతువుల సమూహాలను పరిశీలించేందుకు వెళ్ళాయి. 'జంతుస్వామ్యం' అన్న పద్ధతిని అని ఎలా ఏర్పరచాయో తెలుసుకోవాలని పర్యటించాయి.

ఆ పర్యటన ఫలితంగా 'మేకస్వామ్యం' అన్న వ్యవస్థను రూపొందించాయి. ఇలా 'మేకస్వామ్యాన్ని' రూపొందించటంలో అవి ఒక వాస్తవాన్ని విస్మరించాయి.

ప్రతి జీవికీ తనదైన ప్రత్యేక మానసిక, శారీరక వ్యవస్థ ఉంటుంది. దాని కంటూ ప్రత్యేక జీవన విధానం ఉంటుంది. వీటి ఆధారంగా రూపొందు వ్యవస్థ ఆయా జీవుల మానసిక, శారీరక వ్యవస్థకు ఉద్దీపనం కలిగిస్తుంది. ఉత్తేజాన్నిస్తుంది. అభివృద్ధికి దారి తీస్తుంది.

ఇందుకు భిన్నంగా ఇతర జీవులను గుడ్డిగా అనుకరిస్తూ, తమ మానసిక, శారీరక, సామాజిక, చారిత్రక ప్రాకృతిక వ్యవస్థకు భిన్నమైన వ్యవస్థను రూపొందించుకుంటే, అందువల్ల అనర్థం తప్ప అభివృద్ధి సాధ్యం కాదు. కానీ అవి మేకలు కావటంతో, స్వతహాగా ఆలోచించే శక్తికన్నా, అనుకరణ, అనుసరణ, అధికారానికి తల వంచటం వాటి జీవలక్షణం కావటంతో, అవి ఇతర జీవుల వ్యవస్థలన్నిటి నుంచి కొంచెం కొంచెం సంగ్రహించి, తమదన్న దానిని సంపూర్ణంగా విస్మరించి 'మేకస్వామ్యా'న్ని ఏర్పాటు చేసుకున్నాయి.

స్వచ్ఛందంగా, నాయకత్వం వహించాలనుకునేవారు, ముందుకు వచ్చి, తాము ఏరకంగా మేకలను అభివృద్ధి పరుస్తారో ప్రకటిస్తే, ఎవరి పద్ధతి అధిక శాతం మేకలకు నచ్చితే వారు కొన్నాళ్ళపాటు నాయకుడిగా ఉంటాడు. కొన్నాళ్ళయిన తరువాత అతని పాలన ఫలితాలను విశ్లేషిస్తారు. నచ్చితే మళ్ళీ ఆ మేకనే నాయకుడవుతుంది. నచ్చకపోతే, మళ్ళీ స్వచ్ఛందంగా నాయకత్వం కోసం పోటీ జరుగుతుంది. టూకీగా ఇదీ 'మేకస్వామ్యం'. ఇందులో మేకలన్నిటి అభిప్రాయానికి విలువ ఉంటుంది. ఏ మేక అయినా నాయకుడు కావచ్చు. దాంతో ఇదే శ్రేష్ఠమైన వ్యవస్థ అన్న నమ్మకంతో మేకల గుంపు 'మేకస్వామ్యా'న్ని అమలు పరచటం ప్రారంభించాయి. తమ నిర్ణయాన్ని ప్రకటించాయి. ఆ నిర్ణయంతో ఇతర మేకలన్నీ 'మే' 'మే' అంటూ తమ హర్షాన్ని ప్రకటించాయి.

ఈ 'మే', 'మే'ల హర్షాతిరేక ధ్వనులలో, ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించే స్వరాలు అణగిపోయాయి.

'మేకస్వామ్యం' అమలవటం ఆరంభమయింది.

ఆరంభంలో మేకలన్నీ మేక స్వామ్యం పట్ల ఉత్సాహం ప్రకటించినా, రాను రాను మేకలలో మేకస్వామ్యం పట్ల నిరసన మొదలయింది. బహుశా జీవుల లక్షణం ఇదేనేమో. *తన దగ్గర ఉన్న దానికన్నా పొరుగువాడి దగ్గర ఉన్నదే ఆకర్షణీయంగా కనిపిస్తుంది.* దాని కోసం తపన పడతాడు. లేదా పొరుగువాడిది తనదయిన తరువాత దానిపై అసంతృప్తి మొదలవుతుంది. పాతదే గొప్పగా అనిపిస్తుంది. దాంతో ముందుకు వెళ్ళలేక, వెనక్కు మళ్ళలేక, ఉన్నదానితో సంతృప్తి చెందలేక సతమతమవుతాడు. మేకలిప్పుడు ఆ స్థితికి చేరుకున్నాయి.

మేకలు మేకస్వామ్యాన్ని అమలు పరచటం తెలుసుకున్న ఇతర జంతువులు తెలివిగా మేకలను బోల్తా కొట్టించి, మేకస్వామ్యం ద్వారా అధికారాన్ని సంపాదించసాగాయి. ఇది కూడా మేకలలో అసంతృప్తిని పెంచింది.

మేధావి మేకలు, కార్యశూర మేకలు, సన్యాసి మేకలు, దక్షత ఉన్న మేకలు నాయకత్వంపై ఆసక్తి చూపక పోవటంతో దొంగ మేకలు, క్రూర మేకలు, స్వార్థపర మేకలు, లోభి మేకలు అధికారానికి పోటీపడ్డాయి. వాటిలో కల్లబొల్లి కబుర్లు చెప్పి, అరచేతిలో స్వర్గం చూపించే వారి మాయలో పడి మేకలు వారికే అధికారం అప్పగించి సంతృప్తిగా నిట్టూర్చాయి. అలవాటయిన రీతిలో అన్నిటికీ తలలూపసాగాయి.

దాంతో మేకల జీవనవిధానం అనూహ్యమైన రీతిలో మారిపోయింది. అంతవరకూ స్వతంత్రంగా జీవించే మేకల జీవన విధానం దెబ్బతిన్నది. ప్రతిదానికీ నాయక మేకల నిర్ణయాల కోసం ఎదురు చూసే విధానం అమలులోకి వచ్చింది.

అంతకు ముందు మేకలన్నీ కలసి 'ఇది మాది ఇది తమది' అన్నట్టుండేవి. ఇప్పుడు మేకలు 'ఏదీ నాది కాదు. ఇదంతా నాయక మేకది' అన్నట్టు వ్యవహరించసాగాయి.

దాంతో మేకలలో ఐకమత్య భావన, దెబ్బ తిన్నది. దీనికి తోడు నాయక మేకలు నాయకత్వం నిలుపుకోవటం కోసం మేకల నడుమ విభేదాలు సృష్టించి తమ సమర్థకులకు అరచేతిలో స్వర్గం చూపిస్తూ తమ సమర్థక మందని ఆకర్షించి, ఇతరులను విస్మరించసాగాయి.

ఎందుకంటే ఎక్కువ సంఖ్య అధికారాన్ని నిర్ణయిస్తుంది. కాబట్టి నాయక మేకల దృష్టి 'సంఖ్య' పైన తప్ప 'సేవ'పై నిలవటంలేదు.

ఈ సంఖ్యల 'మేధను' 'స్వార్థం' కప్పేయటంతో అవీ నిజాన్ని విస్మరించాయి. దాంతో మేకల నడుమ ద్వేషాలు, యుద్ధాలు మొదలయ్యాయి. అంతవరకూ కలసి ఉన్న మేకలు నాయకుల వారీగా చీలిపోసాగాయి. మేకల మందలో మొదలైన మేకస్వామ్య ప్రేరేపిత సంఖ్యల సముచిత సంకుల పోరాటాలను చూస్తున్న ఇతర జంతువులు సంతోషంతో చిందులు వేశాయి.

మేక వన్నె పులులు, గోముఖ వ్యాఘ్ర మేషాలు, మేక వేషాల నక్కలు, తోడేళ్ళు మేకల మందలో ప్రవేశించాయి. నాయక మేకలను లోబరచుకున్నాయి. తామే మేకలకు నాయకత్వం వహించసాగాయి.

'మేకస్వామ్యం'లోకి 'క్రూరజంతువు'లు మారు వేషాలలో ప్రవేశించి తమ జీవితాలను అల్లకల్లోలం చేస్తూ, తమ మనుగడను ప్రమాదంలోకి నెడుతున్నాయని గ్రహించిన ఆలోచన పరులయిన కొన్ని మేకలు నిరసన వ్యక్తపరచాయి.

కానీ తల ఊపటం అలవాటయిన మేకలు నాయకుల మాటలకు తలలూపుతూ వచ్చాయి. ఇప్పుడు తమకు నాయకత్వం వహిస్తున్నది పైకి మేకల్లా కనిపిస్తున్నవి, అసలు మేకలు కావని, మారువేషాల్లో ఉన్న క్రూరమైన జంతువులనీ గ్రహించలేకపోయాయి. నిజం తెలిసిన నాయక మేకలు కూడా తమ జీవితం సాఫీగా గడిచిపోతే చాలన్నట్టు మిన్నకున్నాయి.

దాంతో మారువేషాల మేషాలు రెచ్చిపోయాయి. తమ ఇష్టం వచ్చినట్టు వ్యవహరించసాగాయి. తమ మందలకు మేకలను ఆహారంగా పంపసాగాయి. మేకలు గ్రహించకుండా తమ వ్యవస్థను మేకల వ్యవస్థలో ప్రవేశపెట్టి మేకలను హరించసాగాయి. ఇది గ్రహించి 'మోసం' అని అరిచిన మేకలను, తమ క్రూరమృగ మందల నడుమ వదిలేసేవి. దాంతో మేకల మందలో మేకలు తగ్గిపోయి మేకల వేషాల్లో ఉన్న పులులు, సింహాలు, నక్కలు, తోడేళ్ళు, భల్లూకాలు ఎక్కువయిపోయాయి. మేకల సమూహం సంపూర్ణంగా అదృశ్యమయిపోసాగింది.

ఇది గ్రహించిన కొన్ని మేకలు ఎలాగైనా మేకస్వామ్య కరాళ దంష్ట్రల నుండి బయటపడాలని ఆలోచించాయి. కానీ 'మేకస్వామ్యం' కాస్తా ఇప్పుడు 'క్రూరమృగాల నేతృత్వం'గా మారిపోయింది. వాటికి వ్యతిరేకంగా మేకలు ఎంత ప్రయత్నించినా పోరాడలేవు. పోరాడి గెలవలేవు. అందుకని మిగిలి ఉన్న మేకలు ఎలాగయినా 'మేకస్వామ్యం' నుంచి తప్పించుకోవాలని పథకం వేశాయి.

వాటిల్లోని మేధావి మేక ఒక ప్రణాళిక చెప్పింది.

'మనం కూడా క్రూరమృగాల వేషాలు వేసుకుందాం. మేతమేస్తున్నట్టు చేసి, మన కాపలా దార్ల కళ్ళు కప్పి అరణ్యంలోకి జారుకుందాం. అటు నుంచి ఈ మృగాలన్నిటికీ దూరంగా, ప్రశాంతంగా గడుపుదాం. మనకీ స్వామ్యాలు వద్దు, నాయకత్వాలు వద్దు. మేకలం, మేకల్లాగా స్వేచ్ఛగా బ్రతుకుదాం. ఎంత ప్రయత్నించినా కాకి కోకిల కానట్టే మేక, పులి కాలేదు. భల్లూకం కాలేదు' అంది.

అన్ని మేకలు మేధావి మేకతో సమ్మతించలేదు. 'మాకు ఇక్కడే బాగుంది' అన్నాయి.

దాంతో తన మాట వినే కొన్ని మేకలను వెంట తీసుకుని మారువేషాలలో బయట పడింది మేధావి మేక.

అలా మేకల మందనుంచి వేరుపడ్డాయి మారువేషాల్లో ఉన్న మేకలు. తమ అసలు మందనుంచి ఎంతో దూరం పారిపోయాయి. తాము కొత్త జీవితం ప్రారంభించటానికి సరైన స్థలం వెతుకుతూ అరణ్యంలో తిరగసాగాయి.

అయితే, మేధావి మేక ఒకటి గమనించింది. తమ సమూహంలో ఉన్నవన్నీ మేకలు కావు.

మారువేషంలో పారిపోవాలని పథకం వేశాయి. తమతో రావటం ఇష్టంలేని మేకలు ఈ పథకాన్ని బహిరంగ పరిచినట్టున్నాయి.

అందువల్ల తాము క్రూర జంతువులా వేషం వేసుకుని తప్పించుకుంటే, అవి మేక వేషం వదలి అసలు వేషంతోనే తమతో వచ్చాయి. మారు వేషాలలో ఉండటం వల్ల తాము అవీ మేకలే అనుకున్నాయి. కానీ వీలు చూసుకుని ఒకటొకటిగా అవి అసలు మేకలను భోంచేస్తున్నాయి. దాంతో ఇప్పుడు తనతో ఉన్న వాటిల్లో ఏది మారు వేషంలో ఉన్న మేకనో, ఏది అసలు మేకనో గుర్తించటం కష్టంగా ఉంది.

తన అనుమానం ఎవరితో చెప్పాలో, ఎలా చెప్పాలో అర్థం కాలేదు మేధావి మేకకు. మారువేషంలో ఉన్న మేక అనుకుని ఏ తోడేలుకో, పులికో తన మనసులో మాట చెప్పేస్తే, తనకు నిజం తెలిసిందని గ్రహించి ముందుగా తననే చంపేస్తారు. అలాగని ఇక్కడే ఉంటే ఏదో ఓ రోజు వీటికి ఆహారం అయ్యే వంతు తనదవుతుంది.

అందుకని ఎంత బాధాకరమయినదయినా, తాను గ్రహించిన నిజం ఎవరికీ చెప్పకుండా తానొక్కటే తప్పించుకోవాల్సి ఉంటుంది. ఇలా నిర్ణయించుకున్న తరువాత ఒకరోజు ఎవరూ గమనించకుండా నిశ్శబ్దంగా అందరికీ దూరం వెళ్ళింది మేధావి మేక. కాస్త దూరం వెళ్ళిన తరువాత పరుగులంకించుకుంది.

తనకెవ్వరూ ఇంక పట్టుకోలేరన్న ధీమా కలిగిన తరువాత వేగం తగ్గించింది.

వేగం తగ్గించి అలుపు తీర్చుకుంటుంటే, పక్క పొదలో అలికిడి అయింది. 'భయపడకు' అంటూ పొదచాటునుంచి ఓ మేక వచ్చింది. దాన్ని చూసి నిట్టూర్చింది మేధావి మేక.

‘నువ్వు అందరికీ దూరం పోవటం చూసి ఏం చేస్తున్నావో తెలుసుకోవాలని నిన్ను వెంబడించాను‘ చెప్పింది మేక.

‘అందరి ప్రాణాలు పోతాయని తెలిసి, ఎవరికీ చెప్పకుండా నేనొక్కడినే ప్రాణాలు దక్కించుకున్నానన్న బాధ నాకు లేకుండా చేశావు‘ అంది మేధావి మేక సంతోషంగా, దప్పిక తీర్చుకునేందుకు నీటివైపు నడుస్తూ.

‘అందరి ప్రాణాలు ఎందుకు పోతాయి?‘ అయోమయంగా అడిగింది మేక.

‘ఎందుకంటే తప్పించుకున్న వన్నీ మేకలు కావు. మనం వేషాలు వేసుకోవటంతో ఎవరెవరో తెలియలేదు. నేను పులివేషం వేసుకున్నాను. కానీ పులిని కాదు. దాంతో నిజం పులి వెంట వచ్చినా మనం మేక అనుకుని పొరపడతాం అలా, క్రూరమృగాలు మనతో వచ్చి ఒకటొకటిగా మేకల్ని చంపేశాయి. అందుకని నేను తప్పించుకుని దూరం వచ్చేశాను. ఎవరితో మాట్లాడాలన్నా భయమే. నేను పులివేషంతో ఉన్న మేకతో మాట్లాడుతున్నానో, మేక పులి వేషంలో ఉందనుకుని అసలైన పులితో మాట్లాడుతున్నానో తెలియదు కదా!‘ అంది కదలి మేక నీటిలో మూతి పెడుతూ.

‘అయ్యో.. నీటిని ఎంగిలి చేశావు. నేను నీళ్ళెలా తాగాలి?‘ అరిచింది మేక.

ఆశ్చర్యంగా చూసింది మేక వైపు పులివేషంలో ఉన్న మేధావి మేక.

‘అదేమిటి.. పులిలా మాట్లాడతావు. నేను దిగువ తాగుతున్నాను. నా ఎంగిలి నీకు రాదు. పులి వేషంలో ఉన్న నేను పులిలా మాట్లాడాలి కానీ, మేకవి నువ్వు. మేకలానే ఉన్నావు. నువ్వు పులిలా మాట్లాడితే బాగుండదు‘ నవ్వుతూ అంది మేధావి మేక. పెద్దగా గర్జించింది మేక.

‘వేషం వేసుకున్నంత మాత్రాన నువ్వు పులి కానట్టే, నేను మేకను కాను. ఎంత వేషం వేసినా పులి పులే. మేక మేకనే‘ అంటూ తాను కప్పుకున్న మేకతోలును విదిలించి, పులి వేషంలో ఉన్న మేధావి మేకపైకి దూకింది మేకవన్నె పులి.

## గ్రహాంతర మేక

**మేకలన్నీ ఆ పిలుపు విని పరుగెత్తుకు** వచ్చాయి. పొదలలో ఉన్నదాన్ని చూసి ఆశ్చర్యపోయాయి.

మామూలుగా ఆకులు తినటానికి చెట్టును లాగిన మేక, పొదలలో తనవైపే చూస్తూన్న ఆ మేకను చూసి బెదిరింది.

ఎందుకంటే, అది మేకలాగే ఉన్నా మేక అనిపించటం లేదు. దాని ఆకారం మేకలానే ఉంది. కానీ శరీరం రంగు జింక శరీరంలా గోధుమ వర్ణంలో ఉంది. జీబ్రాలా శరీరంపైన నల్లటి పట్టీలున్నాయి.

అందుకే దాన్ని చూసి బెదిరింది. పారిపోవాలనుకుంది.

అంతలో ఆ వింతమేక తనవైపే జాలిగా చూస్తూ నోరు తెరిచింది. దానిపళ్ళ అమరిక కూడా వింతగా ఉంది.

దాన్ని చూసి ‘మే..‘ అని ‘ఎవరు?‘ అనడిగింది మేక.

అది కూడా ఏదో సమాధానం ఇవ్వాలని ‘మే..‘ అంది. దాని ‘మే..‘ కూడా విచిత్రంగా ధ్వనించింది. అర్థం కాలేదు.

భయంతో రెండడుగులు వెనక్కు వేసి ‘మే..‘ అని గట్టిగా తన తోటి మేకలను పిలిచింది.

అవన్నీ బిరబిరా పరుగెత్తుకు వచ్చాయి. పొదలలో పడి ఉన్న వింతమేకను చూశాయి. సంఖ్య బలం వల్ల మేకలకు ధైర్యం వచ్చింది.

ఓ బలిష్టమైన మేక, తన కొమ్ములతో ఆ మేకను సున్నితంగా తాకింది. కదపాలని చూసింది.

కానీ, ఆ వింతమేకను తాకటంతోటే మేక శరీరమంతా అలవికాని ఓ శక్తి ఝల్లుమని పాకింది. ఆ శక్తి తాకిడికి ఎగిరిపడింది 'మేక' భయంతో అరుస్తూ. మిగతావన్నీ పెద్దగా అరుస్తూ కకావికలైపారిపోయాయి.

కాస్సేపటికి మళ్ళీ అన్నీ ఒకటొకటిగా మెల్లిగా పొద దగ్గరకు వచ్చాయి. ఈసారి ఆ వింత మేక దిక్కు చూసిన వాటి చూపుల్లో భయం కుతూహలాలతో పాటు భక్తి కూడా ఉంది.

ఆ వింత మేకను తమ మందలో చేర్చుకున్నప్పటి నుంచీ తమలో ఏదో మార్పు వచ్చినట్టు మేకలన్నీ గ్రహించాయి. ఈ మార్పు ఏమిటో ఎవరూ స్పష్టంగా చెప్పలేకున్నా, తమలో ఏదో నూతనోత్సాహం శక్తి ప్రవేశించినట్టు మేకలకు అనిపిస్తోంది. దానికి ఏ కారణం తెలియక పోవటంతో కొత్తమేక ఆగమనం వల్లనే అన్న భావన వాటికి కలుగుతోంది.

కొత్తమేకను తాకగానే ఏదో శక్తి తాకినట్టు మేక ఎగిరిపడినప్పటి నుంచీ మిగతా మేకలు కొత్తమేకను తాకాలని ప్రయత్నించలేదు. అయితే, కొత్తమేక ఎందుకనో కదలలేక పోతోంది. తనంతట తాను లేచి నిలబడలేకపోతోంది. దానిమాట కూడా వింతగా ఉండి ఇతర మేకలకు అర్థం కావటంలేదు.

కానీ సాటి మేకను ఒంటరిగా పొదలలో వదిలి వెళ్ళటానికి మేకలన్నీ ఇష్టపడక పోవటంతో, దాన్ని తమతో తీసుకు వెళ్ళాలని నిశ్చయించుకున్నాయి.

అంతలో ఎలా వచ్చిందో వాటికి ఆలోచన వచ్చింది.

మేకలన్నీ కలిసి చకచకా కొమ్మలు, శాఖలను అల్లి ఒక బల్లలా తయారు చేశాయి. అతి కష్టం మీద కొత్త మేక దాని మీదకు చేరింది. మేకలన్నీ ఆ బల్లను తమ శక్తి అంతా ఉపయోగించి లాగటంమొదలెట్టాయి. అలా లాగుతూంటే శ్రమ తెలియకుండా ఒక మేక 'మే..' అని శ్రావ్యంగా ఆలాపించింది. ఇన్నాళ్ళూ 'మే, మే' అని అరిచేవి. ఆ అరుపును లయబద్ధంగా పలికితే ఇంత ఆనందం, సంతృప్తి ఉంటాయని వాటికి అప్పుడే గ్రహింపుకు వచ్చింది. ఇన్నాళ్ళూ ఈ విషయం తమకు తెలియకపోవటం, అదీ ఈ కొత్తమేక వచ్చిన తరువాతనే తెలియకపోవటం, అదీ ఈ కొత్తమేక వచ్చిన తరువాతనే తెలియటం, మేకలన్నిటిలో 'కొత్తమేక' అంటే భయభక్తులను పెంచింది.

'ఈ మేకను చూసినప్పటి నుంచీ అన్నీ మంచే జరుగుతున్నాయ్' అనుకున్నాయి.

'ఈ మేకవల్ల మనలో మనకే ఉన్నాయని తెలియని అనేక కొత్త ఊహలు ఆలోచనలు పుట్టుకొస్తున్నాయి' అనుకున్నాయి.

అయితే మేకలన్నిటికీ బాధ కలిగిస్తున్న విషయం ఏమిటంటే, ఈ కొత్త మేక ఎందుకో బాధపడుతున్నట్టు వాటికి అనిపిస్తోంది. అది ఎందుకో అర్థంకావటంలేదు. ఆ మేక వల్ల తమకు ఇంత ఆనందం కలుగుతూంటే, తమ నడుమ ఉన్న ఆ మేక విచారగా ఉండటం వాటికి బాధ కలిగిస్తోంది. 'ఎందుకు బాధ?' అని ఎంత అడిగినా కొత్తమేక ఏమీ చెప్పటంలేదు.

దాన్ని నవ్వించాలని మేకలు ఎంతో ప్రయత్నించాయి.

నేలమీద పడి పొర్లుతూ కాళ్ళు ఆడించాయి. ఇతర మేకలన్నీ నవ్వాయి కానీ కొత్తమేక నవ్వలేదు. అది జాలో, విషాదమో అర్థంకాని చూపులు చూస్తూ ఉండిపోయింది.

అయితే ఆ కొత్త మేక తమలాంటిది కాదన్న విషయం వాటికి 'పులి'దాడి జరిగినప్పుడు స్పష్టంగా తెలిసింది.

ఎప్పటిలాగే ఆ రోజు పచ్చిక బయళ్ళలో మేస్తున్నాయి మేకలు. తాము ఎక్కడికి వెళ్ళినా తాము తయారు చేసిన కొమ్మలు, శాఖల 'బండి'పైన కొత్త మేకను లాక్కుని వెళ్ళటం వాటికి అలవాటయింది. దాన్ని ఓ చెట్టు నీడలో వదిలి, మేకలన్నీ హాయిగా మేస్తుంటాయి. ఎందుకో కొత్తమేక తమ నడుమ ఉంటే వాటికి భద్రతా భావం కలుగుతోంది.

ఆ రోజూ అలాగే కొత్తమేక దగ్గరలో ఉండటం వల్ల కలిగిన ఆత్మస్థయిర్యంతో అవి నిశ్చింతగా మేస్తున్నాయి.

ఇంతలో భయంకరమైన గాండ్రింపు వినిపించింది. మేకలన్నీ చెదిరాయి. అవి భయం నుంచి తేరుకుని కదిలేలోగా, పెద్దగా గాండ్రిస్తూ పులుల గుంపు వాటిపైకి దూకింది.

పులుల వెనకే నక్కలు, తోడేళ్ళు ఆశగా, ఆకలిగా సిద్ధంగా ఉన్నాయి. ఏ మేక అయినా పులులను తప్పించుకుంటే అవి నక్కలు తోడేళ్ళ బారిన పడటం ఖాయం.

మేకల పై ప్రాణాలు పైనే పోయాయి. అవి కకావికలయ్యాయి. పెదాలు తడుపుకుంటూ, కోరలు చూపుతూ పులులు దూకాయి. కానీ అంతలో విచిత్రం.. కాదు.. అద్భుతం జరిగింది. 'మే' అని కొత్త మేక అరిచింది.

దాని అరుపు ధ్వని చిత్రంగా ఉంది. అది మేకలలో తన్మయత్వం కలిగించింది. ఉత్తేజాన్ని రగిలించింది.

కానీ ఆ అరుపు పులులను భయ భ్రాంతులను చేసింది.

మేకలపైకి దూకటానికి ఎత్తిన కాళ్ళు గాలిలోనే ఆగిపోయాయి. కొరకటానికి తెరచిన నోరు తెరుచుకునే ఉండిపోయింది.

నక్కలు, తోడేళ్ళయితే చెదరి తోకముడిచాయి.

'మే..' అని అరుస్తూ కొత్తమేక లేచి నిలబడింది.

దాన్ని చూసి మేకలు సైతం భయంతో ఒక అడుగు వెనక్కు వేశాయి. కొత్త మేక ముఖం క్రోధంతో భీకరంగా ఉంది. కళ్ళు ఎరుపు, గోధుమ వర్ణాలతో కాషాయ వర్ణం కలసినట్టు భయం గొలిపే రంగులో ఉన్నాయి.

దాని కొమ్మలు వంపులు తిరిగి చురకత్తులు కొనలకు తగిలించమన్నట్టు తళతళలాడుతున్నాయి.

తెరచిన దాని నోట్లోంచి పళ్ళు కత్తుల వరసలా భయం కలిగిస్తున్నాయి.

పులులు తేరుకున్నాయి. గాండ్రించి ముందుకు దూకాయి.

ఆగిన మేకలు మళ్ళీ పరుగులంకించుకోబోయాయి.

'మే..' అని అరిచింది కొత్తమేక.

'పరుగెత్తి పారిపోతారేం? నిలబడి పోరాడండి. పారిపోయినా తప్పించుకోలేరు. ప్రాణాలు ఎలాగో పోతాయి. పోరాడి చూడండి. ప్రాణాలు పోతే, ఎలాగో పోయే ప్రాణాలు. కానీ పోరాడి ప్రాణాలు పోగొట్టుకోవటంలో ఉన్న గౌరవం, పారిపోతూ ప్రాణాలు పోగొట్టుకోవటంలో లేదు' అన్న భావన ధ్వనించింది ఆ అరుపులో.

కొత్తమేక ముందుకు దూకింది. కాలిగోళ్ళు, నోటి కొమ్ములు, తలపైని కొమ్ములు ప్రస్ఫుటంగా ప్రదర్శిస్తూ.

క్షణకాలం నిర్ణయం తీసుకోలేనట్టు ఆగాయి పులులు.

ముందుకు దూకుతున్న కొత్త మేకను చూసి, ఏదో తమకి తెలియని ధైర్యం తమలో ప్రవేశించిన భావన కలిగింది మేకలకు. అవి కూడా 'మే..' అని అరుస్తూ కాలిగోళ్ళు, పళ్ళు చూపుతూ ముందుకు దూకాయి.

పులులు వెనుకడుగు వేశాయి.

మేకలు ముందుకు దూకాయి.

పులులు వెనుతిరిగి పరుగెత్తాయి.

'మే..మే..మే..' అని అరుస్తూ మేకలు సంబరాలు చేసుకున్నాయి. కొత్త మేక చుట్టూ తిరుగుతూ నృత్యాలు చేశాయి.

'ఐకమత్యంలో బలం ఉంది. కలిసి ఉంటే మనకు ఎదురులేదు. కానీ ***ఐకమత్యం సాధించాలంటే ఆత్మవిశ్వాసం ఉండాలి. ఆత్మగౌరవం ఉండాలి. విచక్షణ ఉండాలి. ఇవిలేని నాడు ఐకమత్యం ఉండదు. అభివృద్ధి ఉండదు. పతనం, దిగజారుడు తనం తప్ప మరొకటి మిగలదు.***'

ఆ సంఘటన జరిగినప్పటి నుంచీ కొత్త మేకలో ఏదో మార్పు వచ్చింది. ఇప్పుడది లేచి తిరుగుతోంది. ఉత్సాహంగా కదులుతోంది. ఇతర మేకలతో మాట్లాడుతూ వాటికి స్ఫూర్తినిస్తోంది. వాటిలో నిద్రాణమై ఉన్న శక్తిని జాగృతం చేస్తోంది. 'నేను ఈ లోకానికి చెందిన దాన్ని కాదు' అందా కొత్తమేక ఒకరోజు.

ఇతర మేకలన్నీ ఆశ్చర్యంగా చూశాయి.

విషాదంగా తల ఊపింది కొత్తమేక. 'మా నివాసం ఈ నల్లటి ఆకాశంలో మీకు కనబడని ఓ గ్రహంలో ఉంది. మేము, భూగ్రహాన్ని పరిశీలించటం కోసం, మాలాంటి ఇతర జీవులను పరిశోధించటం కోసం బయలు దేరాము. పొరపాటున నేను తప్పిపోయాను. ఇక్కడుండిపోయాను. అప్పటికే ఆలస్యమయింది. అందుకని, ఆలస్యం అవుతోందని నాతో వచ్చిన వారు నన్నొదిలి వెళ్ళిపోయారు. వాళ్ళు నన్ను వెతుక్కుంటూ వస్తారు. అప్పటి వరకూ నేను మీతో ఉంటాను' అని చెప్పింది కొత్తమేక.

మిగతా మేకలన్నీ కుతూహలంగా కొత్తమేక చుట్టూ మూగాయి.

'ఎలా ఉంటుంది మీ గ్రహం? పులులంటే భయం వేయలేదు? నీకీశక్తి ఎక్కడినుంచి వచ్చింది?' ప్రశ్నల వర్షం కురిపించాయి.

నవ్వింది మేక. 'మా గ్రహంలో అన్ని జీవులు కలసి మెలసి ఉంటాయి. భగవంతుడు జీవులన్నిటినీ తన అంశతోనే సృష్టించాడు. ప్రతిజీవికీ దాని ప్రత్యేకత ఉంటుంది. దాని జీవన విధానం దానికి ఉంటుంది. ప్రతి జీవికీ ఆత్మ రక్షణ తప్పనిసరి. ఆహార సేకరణ తప్పనిసరి. ఇది గ్రహించిన మేము, మా గ్రహంలో ఆత్మ రక్షణ పద్ధతులను కనుగొన్నాము. జనన సమయంలోనే ఆత్మరక్షణ లక్షణాన్ని శరీరంలో ప్రవేశపెడతాం. ఆ రక్షణ వ్యవస్థ శిశువుతోపాటు ఎదుగుతుంది. పులులే కాదు ఏవీ నన్నేమీ చేయలేవు' గర్వంగా చెప్పింది కొత్తమేక.

అన్ని మేకలు దాని వైపు ఆరాధనగా, ఈర్ష్యగా చూశాయి. 'మాకు ఆ శక్తులు ఇయ్యవా? మేము ఎప్పుడు దీని బారిన పడతామోనని భయపడుతూ బ్రతుకుతాం' అన్నాయి.

'నేనూ అదే ఆలోచిస్తున్నాను. నేను వచ్చినప్పటి నుచీ గమనిస్తున్నాను. మీలో శక్తి ఉంది. విశ్వాసం లేదు. మీకు తెలివి ఉంది. ఆత్మగౌరవం లేదు. మీకూ మేధ ఉంది. అది ఉందన్న చైతన్యం లేదు. నేను , మా గ్రహంలో మేము ఏర్పాటు చేసుకున్న పద్ధతి ద్వారా మీ మెదళ్ళను ప్రభావితం చేసి కాస్సేపు మీలో విశ్వాసం, ఉత్తేజం కలిగించగలిగాను. కానీ ఆ విశ్వాసాన్ని శాశ్వతంగా కలిగించాలని ఉంది. అప్పుడు మీరు దేనికీ భయపడరు' అంది కొత్త మేక.

'మాకూ ఆ శక్తినివ్వు' బ్రతిమిలాడాయి మేకలు.

'అందుకు మీరు  నేను చెప్పిన నియమాలు పాటించాలి. నేను చెప్పింది చేయాలి. నేనూ కొన్ని ప్రయోగాలు చేయాలి. రక్షణ వ్యవస్థ లక్షణాన్ని తయారు చేసి మీలో ప్రవేశపెట్టాలి' అంది.

అన్నీ అందుకు ఒప్పుకున్నాయి. కొత్తమేక ఏమడిగితే అది చేస్తామన్నాయి. ఇలా చెపితే అలా వింటామన్నాయి.

తనకు ఆశ్రయం ఇచ్చిన మేకలన్నిటినీ తనలాగే నిర్భయమూ, శక్తిమంతమూ చేయాలని నిశ్చయించుకుంది కొత్త మేక.

పులులు, నక్కలు, తోడేళ్ళు సమావేశమయ్యాయి. అన్నీ గంభీరంగా ఉన్నాయి. అన్నిటి వదనాలలో విషాదం ఉట్టిపడుతోంది.

'పరిస్థితి దారుణంగా ఉంది. మేకలు శక్తిమంతం అవుతున్నాయి. మనకు ఆహారం చిక్కటం లేదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మనం ఆకలితో చచ్చిపోవాల్సి ఉంటుంది. అడవికి రాజు సింహం కాదు మేక అవుతుంది' అన్నాయి నక్కలు, తోడేళ్ళు దీనంగా.

అది నిజమన్నట్టు తలలాడించాయి పులులు.

'మేకలేవేవో చేస్తున్నాయి. దీనంతటకీ కారణం ఓ కొత్తమేక. అదెక్కడి నుంచో వచ్చి ఏదో మాయ చేస్తోంది. దాన్ని చంపితే పీడా విరగడ అయిపోతుంది' అన్నాయి పులులు.

ఆలోచిస్తూ తలాడించింది అడవికి రాజు సింహం. సాలోచనగా నక్కలు, తోడేళ్ళ వైపు చూసింది. దాని మదిలో ఓ పథకం రూపుదిద్దుకుంటోంది.

ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది కొత్తమేక. దాని ఒళ్ళు, జలదరించింది. దాని కళ్ళపొరల్లో ఉన్న రహస్య సమాచార దర్శనిలో దృశ్యం కనిపించింది.

'నిన్ను తిరిగి మన గ్రహానికి తీసుకువెళ్ళటానికి, సరిగ్గా మూడు సూర్యోదయాల తరువాత వచ్చే సూర్యాస్తమయానికి, దగ్గరలో ఉన్న నదీ తీరంలో ఎదురు చూస్తుంటాం'

సమాచారం అందుకోగానే కొత్తమేక కంగారు పడింది. అది చేస్తున్న ప్రయోగం ఇంకా పూర్తికాలేదు.

మేకలలో ఉన్న భీరుత్వం, బలహీనతలను తొలిగించి, వాటి స్థానే శక్తిని, ధైర్యాన్ని, విశ్వాసాన్ని నింపే ప్రయత్నాలు చేస్తోంది.

వాటి మెదడును సంపూర్ణంగా రూపాంతరమొందించాలని ప్రయత్నిస్తోంది. మరోవైపు తమలో నిద్రాణమై ఉన్న శక్తిని గుర్తించి దాన్ని శాశ్వతంగా జాగృతం చేసేందుకు కృషి చేస్తోంది.

కొన్ని మేకలు సులభంగా గ్రహిస్తున్నాయి. కొన్ని గ్రహించలేకపోతున్నాయి. సులభంగా గ్రహించలేని మేకలు నిరాశ చెందుతున్నాయి. ఆక్రోశం ప్రదర్శిస్తూ తాను కొన్ని మేకలతో పక్షపాతంగా వ్యవహరిస్తున్నదని ఆరోపిస్తున్నాయి.

మేకలలో ఐకమత్యం సాధించాలన్న తన ప్రయత్నం వాటి మధ్య తేడాలు పెంచుతూ, విభేదాలు సృష్టిస్తోందన్న భావన కలుగుతోంది కొత్తమేకకు.

అందుకని మేకల్లో ఉన్న పోరాట లక్షణం, ఆలోచనలు అన్నిటినీ సంపూర్ణని తొలగించి, తాను తమ పద్ధతిలో తయారు చేసిన వీరత్వం, ధైర్యం, సామరస్య భావనల లక్షణ బీజాలను వాటిలో ప్రవేశపెట్టాలని నిశ్చయించింది. ప్రయోగం ఆరంభించింది.

మేకలలోని అన్ని లక్షణాలను తొలగించింది. అవి సంపూర్ణంగా తొలిగితే కానీ తాను తయారు చేసిన లక్షణాలను ప్రవేశపెట్టలేదు. ఇది పూర్తికాకుండా తాను వెళ్ళిపోతే, మేకలలో ధైర్యం పెరగటం అటుంచి అవి భీరువుల్లా, క్రరచూస్తే భయపడి చెప్పినట్టు చేసే స్వీయ వ్యక్తిత్వం లేని జీవుల్లో తయారవుతాయి.

కానీ తన వారు తనకోసం వస్తూంటే వెళ్ళకుండా ఉండలేదు. ఇప్పటికే ఈ భూగ్రహ వాతావరణంలో ఉండటం వల్ల తనలోనూ మార్పులు వస్తున్నాయి. తన గ్రహ లక్షణాలు కరిగి, భూగ్రహ మేకల లక్షణాలు వస్తున్నాయి. ఇంకొన్నాళ్ళుంటే తానూ భూగ్రహ లక్షణాలకు తగ్గట్టు మారిపోతుంది. ఏం చేయాలో తోచటంలేదు. ఆలోచిస్తూ పనిచేస్తోంది మేక. సమయం గడచిపోతోంది. సూర్యుడు వస్తూ పోతున్నాడు. రోజులు దగ్గరపడుతున్నాయి.

కొత్తమేకలో ఆందోళన పెరుగుతోంది.

ఇతరమేకలలో అసంతృప్తి, ఆందోళనలు కలుగుతున్నాయి. ఈ కొత్తమేక తమతో ఆడుకుంటోందని, ఇది తమని నాశనం చేయటానికే వేరే గ్రహం నుంచి వచ్చిందన్న ఆలోచన నెవరో మేకలలో ప్రవేశపెట్టారు. మేకలకు కొత్త మేకపై విశ్వాసం సడలుతోంది. అపనమ్మకం పెరుగుతోంది. ఇది కొత్తమేక ప్రయోగఫలితాలపై ప్రభావం చూపిస్తోంది.

కొత్తమేకకూ ఆందోళన కలుగుతోంది. దానికి తనశక్తి తగిపోవటం తెలుస్తోంది. గతంలోలా ఇతర మేకల మెదళ్ళను తాను ప్రభావితం చేయలేక పోవటం తెలుస్తోంది.

ఇంతలో మేక కోసం దాని గ్రహం వారు వచ్చే రోజు రానే వచ్చింది.

'ఇదే అదను. మేకలన్నీ బలహీనంగా ఉన్నాయి. కొత్తమేక కూడా ఆందోళనగా ఉంది. దాడి చేయండి' ఆజ్ఞాపించింది మృగరాజు.

పులులు నక్కలు, తోడేళ్ళు సిద్ధమయ్యాయి. సాయంత్రమవుతూండగా దాడి చేయాలని నిశ్చయించాయి.

'నేను మా గ్రహం వెళ్ళిపోవాలి. నా ప్రయోగం సగంలో ఉండిపోయింది. నేను చెప్పినట్టు చేస్తూండండి. ఈలోగా మావాళ్ళని ఒప్పించి, మీ అందకి మాలాగా చేసే రక్షణ వలయంతో వస్తాను.'

కొత్తమేక మాటలకు ఇతర మేకలు అడ్డొచ్చాయి.

'నువ్వు మోసగత్తెవు. సుఖంగా ఉన్న మాకు ఆశలు చూపావు. కల్లబొల్లి కబుర్లు చెప్తావు. ఇప్పుడు పారిపోతున్నావు.'

'నీ వల్ల మా జీవన విధానంలోని సమతౌల్యం లోపించింది. ఇప్పుడు పులులు, తోడేళ్ళు మమ్మల్ని క్షమించవు. వదలవు'

కోపంతో మేకలు కొత్తమేకపై దూకాయి. వారిస్తున్న ఇతర మేకలు వినలేదు.

'ఈ కొత్తమేక మంచిది' అని అంటున్న వాటి నోళ్ళు మూసేశాయి. 'మీకు లాభం కలిగింది కాబట్టి. మీరలాగే మాట్లాడతారు. నష్టం కలిగింది మాకు. కడుపు మండేది మాకు' అని మేకపైకి ఉరికాయి.

ఇలా మేకల నడుమ పోరు జరుగుతూంటే, వాటి ఐకమత్యం భగ్నమవటానికి కారణమయిన పులులు, తోడేళ్ళు, నక్కలు సంబరంగా వాటిపై దాడి చేశాయి. ఇదంతా చూస్తూ, తన వల్ల జరుగుతున్న అనర్థానికి చింతిస్తూ నది వైపుకు పరుగెత్తింది మేక, తన గ్రహం వెళ్ళిపోవటానికి.

నది చేరుతూంటేనే నౌక కనిపించింది. అది ఎగిరిపోవటానికి సిద్ధంగా ఉంది. తొందరగా రమ్మని సౌంజ్ఞ చేశారు ఆ అంతరిక్ష నౌకలోనివారు. పరుగు పరుగున నౌకను చేరింది మేక. నౌకలోకి అడుగుపెడుతూ ఆగిపోయింది.

నౌకలో తన వైపే ఆకలిగా చూస్తున్న పులి కనిపించింది.

'అదేమిటి?' అని అనబోయింది. మేకకు ఆ అవకాశం ఇవ్వకుండా మీదకు దూకింది పులి.

'మన గ్రహం చేరితే నిన్ను తినే అవకాశం రాదు. ఇపుడు నువ్వు భూగ్రహలక్షణాలున్న మేకవి. నిన్ను తినాలనే నిన్ను రక్షిస్తానని మనవారిని ఒప్పించి నేను వచ్చాను' ప్రాణం పోయేముందు పులి మాటలు వినిపించాయి మేకకు. దానికి ఆ మాటలు అర్థమయేలోగా అంతరిక్ష నౌక ఆకాశానికి ఎగిరింది.

పులులు, తోడేళ్ళు, నక్కలు, మేకలు చాటునుండి నోరు తెరచుకుని ఆకాశానికేసి చూస్తూండిపోయాయి.

# జీవకారుణ్యం

**నిశ్శబ్దంగా ఒక దానివైపొకటి** చూసుకున్నాయి అవి. సౌంజ్ఞలు చేసుకున్నాయి. మౌనంగా లేచాయి. ఒకటొకటిగా, ఇతరులకు నిద్రాభంగం కలగకుండా ఆ ప్రాంతం వదిలేశాయి. తాము శబ్దం చేసినా ఇతరులకు నిద్రభంగం కలగనంత దూరం రాగానే వేగంగా పరుగులంకిచుకున్నాయి. ఎలాగో చావు తప్పనప్పుడు. ప్రాణాలు దక్కించుకునే ప్రయత్నం చేస్తూ చావటం మేలని నిశ్చయించుకున్నాయి ఆ పది మేకలు.

ఉన్నట్టుండి మేకల మందలో మేకలు అదృశ్యం కాసాగాయి. ఇది మేకలన్నిటిలో కలవరం కలిగించింది.

మేకలు స్వతహాగా మెతక జీవులు. ఆకులు తింటూ బ్రతుకుతాయి. ఎవరికీ హాని చేయవు. అనవసరంగా వాదాలలో పాల్గొనవు. తమ పని తాము తలవంచుకుని చేసుకుంటూ పోతాయి. అయినా సరే, అనేక ఇతర క్రూర జీవులు మేకలకు హాని తలపెడతాయి. ఎప్పుడు మేక ఒంటరిగా దొరుకుతుందా, బలహీనమవుతుందా, అని ఎదురుచూస్తుంటాయి. అవకాశం దొరకగానే మీదపడి లాక్కుపోతాయి. పీక్కుతింటాయి. అందుకే మేకలు అనుక్షణం అప్రమత్తంగా ఉంటాయి. ఏ వైపునుంచి ఏ ప్రమాదం ఎలా పొంచుకువస్తుందోనని ఎదురు చూస్తూనే ఉంటాయి.

అయితే ఈ మధ్య మేకలకొక అనూహ్యమైన ప్రమాదం ఎదురయింది. ఒక భూతం మేకలమందని పీడించసాగింది ఎప్పుడు వస్తుందో తెలియదు. ఎలా వస్తుందో తెలియదు. ఎందుకు వస్తుందో తెలియదు. కానీ వస్తుంది. భయంకరమైన రూపం దానిది. దాన్ని సరిగ్గా చూసిన మేకలేదు. చూసిన తరువాత చెప్పలేదు ఏ మేక కూడా. ఎందుకంటే భూతం దాన్ని లాక్కుపోతుంది.

ఆ భూతం నుంచి తప్పించుకోవాలని మేకలు పలు ప్రయత్నాలు చేశాయి. కానీ ఆ భూతం ఎలా పసికడుతోందో, మేకల ప్రతి చర్యనూ పసికట్టేస్తోంది. పైగా మేకలను పట్టుకోవటానికి ఇంతవరకూ ఏజీవి దగ్గరా లేని భయంకరమైన శక్తులు ఆ భూతానికి ఉన్నాయి.

దాని గోళ్ళు, వేళ్ళు సాగుతాయి. ఒక వలలాగా మేకలను చుట్టి పట్టేస్తాయి. వాటి పళ్ళు పరుగులిడతాయి. మేకల శరీరంలో కీలకమైన ప్రాంతాలలో దిగబడి కసుక్కున కొరుకుతాయి.

మేకల దైవంతో సంభాషించే మేకపూజారులు రకరకాల శాంతులు చేశారు. పూజలు జరిపారు. కానీ ఫలితం కనబడలేదు. పూజకు అవసరమైన ఆకులు వెతుకుతున్న పూజారి మేకను ఎత్తుకుపోయింది భూతం.

సాధారణంగా భూతాలు, దయ్యాలు దైవం పేరు చెబితే బెదురుతుంటారు. కానీ, ఈ భూతం దైవాన్ని లెక్కచేయటంలేదు. కనిపిస్తే దైవాన్ని కూడా మింగేసేంత జాష్ట్యం ఉన్న భూతం అది.

ఇంతలో, మేకల పెద్దలు కలసి, అడవికి రాజయిన సింహానికి తమ కష్టాన్ని చెప్పుకున్నాయి.

'మృగరాజా, మన అడవి జంతువుల నడుమ కొన్ని నియమాలున్నాయి. ఆకలికి ఆహారాన్ని వెతుకుతాం. కానీ ఈ భూతానికి మన అడవి నియమాల పట్ల గౌరవం లేకపోవటమే కాదు, ఎవరినీ దేన్ని లెక్క చేసేట్టు లేదు. మమ్మల్ని రక్షించి, మళ్ళీ ఈ అరణ్య సామ్రాజ్యంలో శాంతి భద్రతలను కాపాడి నియమాలను అందరూ పాటించేట్టు చూడటం మీ బాధ్యత' అన్నాయి.

మేకల మాటలు విని మృగరాజు తల వంచుకుంది.

‘జంతువులకు రాజును నేను. భూతాలను, దయ్యాలను నియంత్రించలేను. అడవి రాజును నేను. ఇది నా సామ్రాజ్యం. కానీ అడవిని దాటిని శక్తుల ముందు నేను అశక్తుడిని‘ అంది.

దాంతో మేకలన్నీ హతాశులయ్యాయి. తమని రక్షించాల్సిన రోజే తన అశక్తతని వెల్లడిస్తే, ఇక మేకలేం చేస్తాయి? అన్ని అడవి జీవులలోకి సాత్విక జీవులు మేకలు. దాంతో ఏం చేయాలో తోచక మేకలు అలాగే భయపడుతూ, బిక్కుబిక్కుమంటూ ఉండటం ఆరంభించాయి. ఒంటరిగా కాక గుంపులుగా తిరగసాగాయి అయినా లాభం లేకపోయింది. భూతం గుంపులనూ భోంచేయసాగింది. కానీ ఇలా ప్రతిక్షణం భయపడుతూ, ప్రాణాన్ని అరచేతిలో పెట్టుకుని బ్రతకటం కొన్ని మేకలకు నచ్చలేదు. ఎదురు తిరిగి పోరాడాలని వాదించాయి.

పెద్దలు వెనుకంజ వేయటంతో పెద్దలను కాదని, అవే భూతాన్ని మట్టుపెట్టాలని పథకాలు వేశాయి.

తమలోనే ఒక మేకను చెట్టుకు కట్టేశాయి. దాని చుట్టూ కందకం తవ్వాయి. కందకాన్ని చెట్టు పొదలతో మూసేశాయి.

దానికి దగ్గరలో వాడికొమ్ములు కల మేకలు, కొమ్మలను మరింతగా సానబెట్టి భూతం రావటం కోసం ఎదురు చూశాయి. భూతం రాగానే దాడిచేసి దాన్ని చీల్చి చెండాడేందుకు సిద్ధంగా ఉన్నాయి.

కానీ, అవి ఊహించిందొకటి.. జరిగిందింకొకటి.

భూతంలా ఉంటుందని, అలా వస్తుందనీ అవి ఊహించలేదు.

భూతం కన్నా ముందు సుడిగాలి వచ్చింది. సుడిగాలితో పాటు ఉరుములు, మెరుపుల కన్నా ఘోరమైన భయంకరమైన శబ్దం వచ్చింది.

మేకలేకాదు అడవి మొత్తం గడగడ వణికిపోయింది.

ఏనుగులు, పులులు, సింహాలు సైతం గడగడా వణుకుతూ కకావికలై పరుగెత్తటం ఆరంభించాయి.

భూతం మేకలకే కాదు సింహాలను, పులులనూ, ఏనుగులనూ వదలటం లేదు. అతి భయంకరాకారం భూతానిది. మేకలు కళ్ళెత్తి సరిగ్గా చూడలేక పోయాయి. కొన్ని మేకలు గాలికి ఎగిరి పోయాయి. కొన్ని శబ్దానికి గుండెలాగి చచ్చాయి.

ఇంకొన్ని ఉన్న చోటనుంచి కదలలేకపోయాయి. క్షణాలలో భూతం వాటిని పొట్టన పెట్టుకుంది.

చెట్టుకి కట్టేసి ఉన్న మేక గిజగిజలాడింది కానీ భూతానికి దొరికిపోయింది. ఆ రోజు అక్కడి నుంచి తప్పించుకున్న ఒక్క కొమ్ముల మేక మాత్రం మందను చేరి జరిగింది చెప్పింది.

‘ఇక ఈ అడవిలో మనకు మనుగడలేదు. ఈ సృష్టి నాశనానికే వచ్చినట్టుందీ భూతం. దైవానికీ, అసురలకీ నడుమ జరిగే పోరులో అసురులదే విజయమయ్యేట్టుంది. ఇక్కడే ఉంటే మనమందరం భూతానికి ఆహారం అవుతాము. ఈ అడవి వదిలి మరో అడవికి పారిపోవటం తప్ప మరో గత్యంతరం లేదు‘ అంది.

కానీ అన్ని మేకలు, తమకలవాటయిన అడవిని వదిలి రావటానికి ఇష్టపడలేదు. ‘ఎక్కడయినా ప్రమాదం తప్పినప్పుడు అలవాటయిన ప్రమాదాన్ని ఎదుర్కోవటమే మేలు. ఏవేంటో తెలియని ప్రాంతంలో చిన్న ప్రమాదం కూడా ప్రాణాంతకం అవుతుంద‘ని వాదించాయి.

దాంతో ఉన్నచోటే ఉండి చావుకోసం ఎదురు చూసేకన్నా ప్రాణాలు రక్షించుకోవటం కోసం ప్రయత్నిస్తూ ప్రాణాలు కోల్పోవటం మేలని భావించింది కొమ్ముల మేక.

ఆ ప్రాంతం వదిలి కొత్త అడివిని వెతుక్కుంటూ వెళ్ళాలని నిశ్చయించింది. దానివెంట రావటానికి ఇంకొన్ని మేకలు సిద్ధమయ్యాయి. ఒకరోజు ఇతర మేకలు ఇంకా నిద్రిస్తూండగా, తెల్లవారకముందే బయలుదేరాయి మేకలు.

నిశ్శబ్ధంలో ప్రతి చిన్న శబ్ధం భయంకరంగా వినిపిస్తోంది.

ఉలిక్కి ఉలిక్కిపడుతూ నడుస్తున్నాయి మేకలు.

ఎంత ధైర్యం తెచ్చుకుందామనుకున్నా వాటి ధైర్యం నిలవటం లేదు.

తమ నీడను చూసి తామే బెదురుతున్నాయి. తమ అడుగుల చప్పుడుకు తామే అదురుతున్నాయి. ఎంత వద్దనుకున్నా వాటన్నిటి మనస్సుల్లో భూతం భూతంలా భయపెడుతోంది.

జాగ్రత్తగా చుట్టూ పరికించి చూస్తూ, ఒకో అడుగు ముందుకు వేస్తున్నాయి. ఏ వైపు నుంచి భూతం వచ్చిపడుతుందోనన్న భయం వాటిది.

ఇంతలో వాటికి ఏదో శబ్ధం వినిపించింది.

ఒక్కసారిగా ఆగిపోయాయి. గుండెలు దడదడలాడుతూండగా నేలమీద నక్కాయి. కాస్సేపు అలా ఉన్నాయి. ఏమీ వినబడలేదు. ఒకదానివైపొకటి చేస్తున్నాయి. వాటి కళ్ళల్లో భయం స్పష్టంగా తెలుస్తోంది.

అడుగు ముందుకు నడవాలంటే భయంగా ఉంది. కానీ ఉన్న చోటునే ఉండటంలో భద్రతలేదు.

కాస్సేపు కదలకుండా అలాగే ఉన్న తరువాత కొమ్ముల మేక కదిలింది. లేచి నిలబడి చుట్టూ చూసింది.

అడవి నిశ్చలంగా, నిశ్శబ్ధంగా ఉంది. గాలి కూడా కదలటంలేదు.

రెండడుగులు మెల్లిగా ముందుకు వేసింది.

ఏమీ కాలేదు. వెనక్కు తిరిగి చూసింది. ఇంకా నేలపైనే ఉన్న ఇతర మేకలను రమ్మని సౌంజ్ఞ చేసింది.

అవి భయం భయంగా నిశ్శబ్ధంగా లేచాయి. కొమ్ముల మేకను అనుసరించాయి. మళ్ళీ జాగ్రత్తగా నడక ప్రారంభించాయిం

వెన్నెల కాంతి పెరుగుతున్నా, ఆకాశంలో దాన్ని మించిన కాంతి వచ్చే సూచనలు కనిపించటంతో వెన్నెల కాంతి తగ్గుతున్నట్టనిపిస్తోంది.

ఎదురుగా ఉన్నవి కనిపిస్తూండటంతో తమ నడకను వేగవంతం చేశాయి మేకలు.

ఇంతలో మళ్ళీ వెనక శబ్ధం వినిపించింది.

హఠాత్తుగా ఆగిపోయాయి మేకలు. భయం భయంగా ఒకదానివైపొకటి చూసుకున్నాయి. భయంతో ఓరకంట వెనక్కు తిరిగి చూశాయి. ఏమీలేదు. అంతలో పొదల్లో చిన్న కదలిక కనిపించింది.

పరుగుపెట్టటానికి సిద్ధపడ్డాయి మేకలు. వాటి ఒళ్ళు గజగజ వణకసాగింది. పొదల్లోంచి పులి బయటకు వచ్చింది.

'మే' అని భయంతో అరచి మేకలు పరుగందుకున్నాయి.

'భయపడకండి. పారిపోకండి' దీనంగా అంది పులి.

పరుగుపెడుతున్న మేకలు ఆగి వెనక్కు తిరిగి చూశాయి. కానీ పులి దగ్గరకు రాలేదు. దూరంగానే నిలబడ్డాయి.

'నన్ను చూసి భయపడకండి. మీరు భూతం నుంచి పారిపోతున్నారని తెలిసింది. నేనూ భూతం నుంచి పారిపోతున్నాను. నా భర్తా పిల్లలను భూతం తినేసింది. నేను చావు తప్పి కన్నులొట్టబోయి తప్పించుకున్నాను' దీనంగా అంది పులి. అసహనంగా చూశాయి మేకలు దానివైపు.

'నా మాట నమ్మండి. నా వెంట ఉన్న వాటిని చూడండి.' అంటూ చూపించింది. దాని వెనక ఓ జింక ఉంది. బలహీనంగా, ఒళ్ళంతా పుళ్ళతో, కళ్ళల్లో ప్రాణంతో ఉందా జింక. దాని పక్కనే కుందేలుంది. దాని ఒళ్ళంతా గాయాలున్నాయి.

'మేము భూతం పంజాలో చిక్కుకుని, అదృష్టవశాత్తు తప్పించుకున్నాం.' ఇక ఇక్కడ ఉండలేం. మమ్మల్ని మీతో తీసుకెళ్ళండి' జాలిగా, బ్రతిమలాడుతూ అన్నాయవి.

పులివైపు చూసింది కొమ్ముల మేక.

'భూతం నన్నేం చేసిందో చూడండి' అని చూపించింది పులి. దాని కోరలు లేవు. వేళ్ళకు గోళ్ళు లేవు. ఒళ్ళంతా గాయాలున్నాయి.

మేకలు మాట్లాడలేదు. అవి నడవ సాగాయి. వెంట పులి, జింక, కుందేలు నడవలేక నడవలేక నడవసాగాయి.

ఇంతలో నడుస్తున్న కొమ్ముల మేక ఆగిపోయింది.

'దాక్కోండి' అంది కంగారుగా చెట్టు చాటుకి దూకుతూ. అవి దాక్కోవటం పూర్తయ్యేలోపలే గాల్లో తేలుతూ, పెద్ద శబ్దంతో అరుస్తూ సుడిగాలిలా భూతం వచ్చేసిందక్కడికి.

పులి, జింక, కుందేళ్ళను చూస్తూ వికటాట్టహాసం చేసింది. వెంటనే రెండు చేతులను సాగదీసి వలలాగా చేసి వాటిని బంధించింది.

'నన్ను తప్పించుకుని ఎక్కడికి పోతారు?' అంటూ గర్జించింది. అంతలో దాని దృష్టి ఇంకా పూర్తిగా చెట్టుచాటున దాక్కుని మేకలపై పడింది. ఆనందంతో గర్జించిందది.

తన వలలాంటి వేళ్ళను పొడిగించి మేకలనూ బంధించింది.

ఇది చూస్తున్న కొమ్ముల మేక చెట్టుచాటున మరింతగా నక్కింది. దాని శరీరం సర్వం వణకసాగింది.

ఎర్రగా చింతనిప్పుల్లా ఉన్నాయి భూతం కళ్ళు. దాని నోట్లోంచి నిప్పులొస్తున్నట్టుంది. దాని చేతులు వలలు, గోళ్ళతో వికృతంగా, భయంకరంగా ఉన్నాయి.

మొత్తం జంతువులను ఎగరేసుకుని పోయిందా భూతం, ఇంకా ఏమైనా దొరుకుతాయేమోనన్నట్టు చుట్టూ చూస్తూ.

అది వెళ్ళిన చాలాసేపటివరకూ ఒంటరిగా వణుకుతూ మిగిలిపోయింది కొమ్ముల మేక.

భూతాన్ని చూసిన వాళ్ళెవరూ ప్రాణాలతో నిలవలేదింతవరకూ. తన ప్రాణాలు నిలుస్తాయన్న ఆశ ఆ మేకకు పోయింది. 'పదిమంది ఉన్నప్పుడు వేరు. ఇప్పుడు ఒంటరిగా మిగిలిపోవటం వేరు' అనుకుంది ఆ మేక. కానీ భూతం బారిన పడకుండా మరణం సంభవిస్తే చాలనుకుంది. ఈ భూతం కరాళ దంష్ట్రలలో పడినలిగి చచ్చేకన్నా పులి వాడి గోళ్ళతో చీల్చబడి, కోరలతో కరకరా నమిలితే వచ్చే చావు సహజము, ప్రాకృతికము అనుకుంది.

కాళ్ళీడ్చుకుంటూ నడవసాగింది. ఇప్పుడు దానిలో బ్రతికి ఉంచి కాబట్టి ముందుకు సాగాలన్న ధ్యాస తప్ప నిజంగా కొత్త అడవికి చేరి, కొత్త జీవితాన్ని ఆరంభిస్తానన్న ఆశలేదు.

అలా ఎంతో దూరం నడిచింది మేక దారిలో శబ్దం వినిపించినప్పుడల్లా నక్కుతూ, దాక్కుంటూ నడుస్తోంది.

పలుమార్లు భూతం దృష్టిలో పడకుండా తప్పించుకుంది.

ఆ భూతం ఏమిటో, ఎలాంటిదో మేకకు బోధపడటంలేదు.

దాని గురించి ఆలోచించకుండా నీరసంగా ముందుకు సాగింది. చీకటి పడింది.

ఓ మంచి పొద చూసుకుని విశ్రమించాలని అనుకుంటూండగా ఏవో శబ్దాలు వినిపించాయి.

పొదలమాటున నక్కి జాగ్రత్తగా తొంగిచూసింది.

దూరంగా ఏవో వెలుగులు కనిపిస్తున్నాయి. చిత్రమైన శబ్దాలు వినిపిస్తున్నాయి.

శబ్దం చేయకుండా, నేలపైన పాకుతూ, దడదడలాడుతున్న గుండెలతో ఆవైపు వెళ్ళింది.

పొదలమాటున దాక్కుని తొంగి చూసింది.

దాని గుండెలు ఆగిపోయాయి.

ఎదురుగా భయంకరమైన దృశ్యం కనిపిస్తోంది.

ఒకటి కాదు రెండు కాదు ఎన్నో భూతాలున్నాయి. అవన్నీ వెర్రిగా నృత్యాలు చేస్తున్నాయి. అతి భయంకరంగా ఉందా నృత్యం. వాటి మధ్యలో పెద్దగా మంట మండుతోంది. మంట చుట్టూ గెంతుతున్నాయి భూతాలు.

మరో వైపు చిన్న చిన్న మంటలున్నాయి. రకరకాల జంతువుల మాంసాలు వ్రేలాడుతున్నాయి.

ఇంకా ముందుకు వచ్చి తొంగిచూసింది మేక.

అనేక జంతువులు సంకెళ్ళలో ఉన్నాయి. వాటి ఒళ్ళంతా గాయాలున్నాయి. భూతాలు వికృతంగా నృత్యం చేస్తున్నాయి. మంటల వెలుతురులో వాటి నృత్యం కరాళ కంకాళాల నృత్యాల్లా ఉన్నాయి.

ఇంతలో మేక దృష్టి నిరాశగా పడి ఉన్న పులిపై పడింది. అది కట్టేసి లేదు. కానీ పారిపోయే ప్రయత్నాలు చేయటంలేదు. పొదల్లోంచి పాకుతూ ఆ వైపు వెళ్ళింది మేక. గుసగుసగా దాన్ని పిలిచింది. 'పారిపో.. భూతాల కంటపడితే నిన్ను వదలవు. నువ్వయినా స్వేచ్ఛగా బతుకుపో..' అంది పులి మేకను గమనించి గుసగుసగా.

'నేను ఛస్తాను కానీ వీటి బారిన పడను. నువ్వు స్వేచ్ఛగానే ఉన్నావుగా.. రా.. పారిపోదాం' అంది మేక.

పులి విషాదంగా నవ్వింది. అంతవరకూ ఓ వైపు కూచున్నది మేకవైపు కదిలింది. మేక కళ్ళల్లోంచి నీరు బదులు రక్తం కారింది. దాని గుండె కరిగిపోయింది. విషాదంతో, భయంతో.

పులికి కాళ్ళులేవు. కేవలం శరీరం మాత్రం ఉంది. కాళ్ళు శరీరానికి అతుక్కున్న చోట మాంసం ముద్దలున్నాయి.

'పారిపోయినందుకు శిక్ష అందుకే భూతాలకు ప్రాణాలతో దొరకకూడదు' అంది పులి విషాదంగా.

మేక మాట్లాడలేదు. శక్తినంతా కూడగట్టుకుని పరుగెత్తసాగింది.

ఉలిక్కిపడి లేచింది మేక.

అది గజగజా వణకసాగింది.

పెద్దగా భూతం శబ్దం వినిపిస్తోంది. గాలి రివ్వురివ్వున వీస్తోంది. చెట్లు, చేనులు అల్లల్లాడిపోతున్నాయి. దుమ్ము ఆకాశానికి ఎగుస్తోంది..

భూతం వచ్చేస్తోంది.

ఈ ఆలోచన రావటంతో మేక చివాలున లేచింది. ప్రాణాలు పోయినా ఫరవాలేదు కానీ, భూతం బారిన పడకూడదు.

పరుగు ఆరంభించింది. దిశలేదు. గమ్యంలేదు.

దాని వెనుక చెట్లు కూలిపోతున్నాయి. విరిగిపోతున్నాయి.

భూతం వచ్చేస్తోంది.

శక్తినంతా కూడగట్టుకుని పరుగిడుతోంది మేక.

మేకకు తెలుసు.. పరుగిడుతూంటే నది వస్తుంది. నదికావల మరో అడవి ఉంది.

భూతం నదిదాటలేదు.

'నది చేరుకుంటే తాను బ్రతికినట్టే' అనుకుంది.

పరుగెత్తసాగింది. వెనక శబ్దాలు వినిపిస్తున్నాయి. శబ్దాలు దగ్గరగా వినబడుతూండటంతో వేగం పెంచింది.

కానీ తాను ఓడిపోతోందని, వెనుక పడిపోతోందని, దగ్గరగా వస్తున్న శబ్దాలు, తనని కుదుపుతున్న గాలి, అదురుతున్న భూమి తెలుపుతున్నాయి. ఇంతలో పరుగెత్తుతున్న మేక హఠాత్తుగా ఆగిపోయింది. ఎదురుగా నదినీళ్ళు తళతళ మెరుస్తూ కనిపిస్తున్నాయి. కానీ.. నదికి ఆవల అడవిలేదు.

దట్టమైన చెట్లు ఏమయ్యాయో తెలియదు కానీ, అవి ఉండాల్సిన చోట చిత్ర విచిత్రమైన కట్టడాలు కనిపిస్తున్నాయి. అవి వేటికీ నీడనివ్వవు. వేటికీ ఆహారాన్నివ్వవు. చూడగానే జీవం లేని, జీవం హరించే విచిత్రమైనవి అని తెలుస్తోంది.

ప్రాణం లేదని, ప్రాణాన్ని హరించే భయంకరమైన భూతాల్లా కనిపించాయవి. మంత్రదష్టలా ఆగిపోయిన మేక వెనుక శబ్దం వినిపించగానే తెలివి తెచ్చుకుంది. 'ప్రాణాలెలాగో పోతాయి. కానీ భూతం చేతిలో పడి పోగొట్టుకునే కన్నా, నీటిలో పడి ప్రాకృతికంగా ప్రాణాలు వదలటం మేలు' అనుకుంది. వెంటనే గాల్లోకి ఎగిరింది చిత్రంగా. భూతం చేతులు సాగాయి. వలలా మారి మేక నీటిలో పడక మునుపే గాల్లోనే మేకను పట్టేశాయి వలల తాళ్ళు.

భూతం మేకను ఒడ్డుకు లాగింది.

అరుస్తూ, గింజుకుంటూ ఏడవసాగింది మేక.

ఏడుస్తూ, గింజుకుంటున్న మేకను చూసి వికృతంగా నవ్వింది భూతం. వల తాళ్ళతో మేకను ఒడ్డుకు లాగి పారేసింది.

తనలోంచి ఇతర జంతువులన్నీ తీసి ఒడ్డున నిలిపింది. చివరన కాళ్ళులేని పులిని తెచ్చి నేల మీద పారేసింది.

కాళ్ళు లేని పులి వలలో ఉన్న మేకను చూసింది. భూతం వలను తొలగించి మేకను తన చేతుల్లో పట్టుకోవటం చూసింది. వెంటనే లేని శక్తితెచ్చుకుని ఎగిరింది. నోరు తెరిచి మేక మెడను పట్టి కొరికింది. విరిచేసింది.

**నేలను జాగ్రత్తగా పరిశీలించింది డిటెక్టివ్ మేక.** తలెత్తి చుట్టూ చూసింది. అంతా నిశ్శబ్దంగా ఉంది. దూరంగా చెట్లు గాలికి ఊగుతున్నాయి నిశ్శబ్దంగా. ఇంకా దూరంలో ప్రవహించే నీరు కూడా వేగాన్ని నియంత్రించి శబ్దం కాకుండా ప్రవహిస్తున్నట్టుంది.

తనతోపాటు వస్తున్న సహాయక మేకవైపు చూసింది.

'ఏమి చేయమంటారు?' అన్నట్టు ప్రశ్నార్థకంగా చూసిందా సహాయక మేక. తన ప్రతి కదిలకలను కొన్ని వందల జతల కళ్ళు పరిశీలిస్తూండటం డిటెక్టివ్ మేకకు ఇబ్బందిగా ఉంది.

ఆ రాజ్యంలో హత్య జరిగింది. ఓ అందమైన లేత మేక శవం నది ఒడ్డున పడి లభించింది. దాంతో రాజ్యమంతా హాహాకారాలు చెలరేగాయి. ఎందుకంటే సింహరాజు, అడవిలో ఓ నియమం ఏర్పాటు చేశాడు.

'ఏ జంతువు కూడా మరో జంతువును అనవసరంగా వేటాడకూడదు. కానీ ఆహారం స్వీకరించక పోతే జంతువులు బలహీనమవుతాయి. అందుకని ప్రతి వర్గానికి చెందిన జంతువు నుంచి నిర్ణీత సంఖ్యలో జంతువులు ఓ స్థలానికి రోజు విడిచి రోజు రావాలి. వేటాడే జంతువులు వాటిని భోంచేస్తాయి. తరువాత అవి మళ్ళీ రెండో రోజు వరకూ వేటాడటం చేయకూడదు.'

సర్వ జంతు అంగీకారమైన ఈ నిర్ణయం వల్ల జంతువుల నడుమ బయాలు తగ్గిపోయాయి. ఏ జంతువు వర్గానికి చెందిన నేత, ఆ జంతువుల్లో ఏది ఆహారమవ్వాలో నిర్ణయిస్తున్నాయి. ఆ రకంగా జరుగుతూ వస్తోంది. ఇందువల్ల జంతువులు అడవి అంతా స్వేచ్ఛగా తిరగగలుగుతున్నాయి. ఎలాంటి భయాలు లేకుండా పులులు సింహాల పక్కనే నిలబడి మేకలు గడ్డి మేస్తున్నాయి.

ఇంతలో ఓ యువతి మేక అదృశ్యమైంది.

దాంతో అంతకాలం అడవిలో నెలకొని ఉన్న ప్రశాంతత భగ్నమయింది. జంతువుల నడుమ ఏర్పడిన సున్నితమైన నమ్మకం తొలిగింది.

ఇంతలో మరో మేక హత్య జరిగింది.

దాంతో మేకలన్నీ కలసి సింహం వద్ద మొరపెట్టుకున్నాయి.

'మీరు నియమం చేశారు. మేము నమ్మాము. పాటిస్తున్నాము. మరి ఎవరో ఒకటొకటిగా మా మేకలను చంపుతున్నారు. మీరేం చేస్తున్నారు? మీ నియమాన్ని భంగపరచిన వారిని మీరు శిక్షించకపోతే, ఇక నియమోల్లంఘనం అలవాటయిపోతుంది. మళ్ళీ ఎవరూ ఎవరినీ తెలిచేయని అరాచక ఆటవిక పరిస్థితులు నెలకొంటాయి' అని మొరపెట్టుకున్నాయి.

మేకల మొర విన్న సింహం వాటి అభ్యర్థనలోని నిజం అర్థం చేసుకుంది. వాటి ఆవేదన వెనక దాగిన భయాల్ని గ్రహించింది.

మేకలను దొంగతనంగా చంపి తింటున్నదెవరో కనిపెట్టమని గూఢచార వ్యవస్థను ఆదేశించింది.

కానీ ఫలితం లేకుండా పోయింది. ఎంత ప్రయత్నించినా మేకలను ఎవరు చంపి తింటున్నారో తెలియలేదు. పైగా మేకలను చంపి తినటం పెరిగింది. దాంతో మేకలలోనే కాదు ఇతర జంతువులలోనూ కలవరం మొదలయింది.

'ఇవాళ నియమోల్లంఘన చేసి మేకలను చంపుతున్నారు. రేపు జింకల వంతు అవుతుంది. ఇపుడే మనమంతా కలసికట్టుగా నిలిచి పోరాడకపోతే మళ్ళీ అడవి న్యాయం అమలులోకి వస్తుంది' అని జంతువులన్నీ తీర్మానించాయి. అన్నీ వెళ్ళి సింహంతో మొరపెట్టుకున్నాయి. ఈ అన్యాయాన్ని అంతం చేయకపోతే రాజుగా సింహానికి విలువ ఉండదని హెచ్చరించాయి.

దాంతో సింహం జంతువులన్నిటినీ సమావేశపరచింది. సమస్య అందరి ముందు ఉంచి పరిష్కారం కోరింది.

రకరకాల జంతువులు రకరకాల అభిప్రాయాలు వ్యక్తపరచాయి.

సింహాలు నిరసన తెలిపాయి. 'అంటే మన పరిశోధన పైన మేకలకు అనుమానం ఉందన్నమాట' అన్నాయి నిరసనగా.

పులులు సింహాలకు మద్దతు తెలిపాయి. నక్కలు అటూ ఇటూ కాకుండా మాట్లాడాయి. ఏనుగులు ఏమీ పట్టించుకోలేదు. చిఱుతలు చిట్టుబుట్టులాడాయి.

‘వేటాడి చంపటం జీవలక్షణం కలవాటిని వేటాడవద్దు. అవే పళ్ళెంలో మీదగ్గరకు వస్తాయి. తినండి అనటం అప్రాకృతికం, అన్యాయం. ఇలాగే కొనసాగితే కొన్నాళ్ళకి మేము వేటాడటం మరచిపోయి, వెంట నోటి దగ్గరకు రావాలని ఎదురు చూసేవాళ్ళుగా మారతాం. ఈ పద్ధతి మాకేమీ నచ్చలేదు‘ అన్నాయి నిష్కర్షగా.

చిఱుతలు మాట్లాడుతూంటే ‘అవునన్న‘ట్టు తలలూపాయి తోడేళ్ళు. కానీ మేకలు శాసిస్తూంటే వాటితో సానుభూతిగా తలలూపాయి.

చివరికి సింహం రాజు తన నిర్ణయం తెలిపాడు.

‘మా సింహం గూఢచారుల పరిశోధన మీకు అసంతృప్తిగా ఉంటే, మీరు స్వయంగా పరిశోధించవచ్చు.‘

ఆ నిర్ణయం విన్న మేకలు నిర్ఘాంతపోయాయి. ఎందుకంటే, మేకలు పరిశోధనకు పనికిరానివి. వాటి జ్ఞానేంద్రియాలు పరిశోధనకు సరిపోవు. కుక్కల్లా వాసన చూడలేవు. జింకల్లా చిన్న కదలికను కూడా పసికట్టలేవు. గ్రద్దల్లా ఎత్తు నుంచి, దూరం నుంచి కూడా చిన్న చిన్న వాటిని పసికట్టలేవు. పాముల్లా శబ్దజ్ఞానం లేదు. మరి, మేకలు అపరాధపరిశోధన ఎలా చేస్తాయి?

వాటి సమస్యను పరిష్కరించటానికన్నట్టు, పొరుగు అడవిలో ఓ డిటెక్టివ్ మేక ఉందని మేకలకు తెలిసింది.

ఆ మేక మనిషి దగ్గర ఉండి రకరకాల చిత్ర విచిత్ర పరిశోధన పద్ధతులను నేర్చుకుని వచ్చిందని విన్నాయి. అందుకని మేకలు వెళ్ళి తమను రహస్యంగా చంపుకుతింటున్న ఆ హంతకుడిని వెతికిపట్టుకుని శిక్షపడేట్టు చూసే బాధ్యతను ఆ డిటెక్టివ్ మేకకు అప్పచెప్పాయి. తోటి మేకలకు సహాయం చేసేందుకు తన నైపుణ్యాన్ని వినియోగించేందుకు సిద్ధపడి వచ్చింది డిటెక్టివ్ మేక.

కానీ డిటెక్టివ్ మేకను ఏ జంతువూ సరిగ్గా పనిచేయనివ్వటం లేదు. ఇదెలా హంతకుడిని పసికడుతుందోనని ప్రతి జంతువూ అది ఎటు పోతే అటు పోతున్నాయి. ఒక్క క్షణం కూడా ఒంటరిగా వదలటంలేదు. ప్రశాంతంగా పని చేసుకోనివ్వటం లేదు. అది ఇబ్బందిగా ఉంది డిటెక్టివ్ మేకకు.

అయినా వీలయినంత ఏకాగ్రతతో తన పని చేసుకుంటూ పోతోంది. మేకల హత్యలు జరిగిన ప్రాంతాలను పరిశీలించటం ఆరంభించింది. ఇంతకు ముందు మేకలు గుబురు పొదలున్న ప్రాంతాలలో ఒంటరిగా తిరిగేవికాదు. కానీ సింహం నిర్ణయం అమలులోకి వచ్చినప్పటి నుంచీ మేకలు స్వేచ్ఛగా తిరగటం వల్ల ఒకప్పుడు ప్రమాదకరంగా భావించిన ప్రాంతాలలోనూ మేకలు తిరుగుతున్నాయి.

ఇలా ఆలోచిస్తూ పరిశోధన సాగిస్తున్న డిటెక్టివ్ మేకకు నేలపై ఏవో గుర్తులు కనిపించాయి.

నేల మీద పడుకుని తన దగ్గర ఉన్న భూతద్దంతో ఆ గుర్తుకు దగ్గరగా పరిశీలించాలని పాకింది మేక.

అంతలో పక్కకు దొర్లింది హడావిడిగా. లేకపోతే, అక్కడికి దూకిన సింహాల కాళ్ళగోళ్ళు మేకను చీల్చేవే.

‘ఏం చేస్తున్నావు?‘ గర్జించినట్టు అడిగాయి సింహాలు. అవి గూఢచార సింహాలు.

దుమ్ము దులుపుకుంటూ లేచి నిలబడింది డిటెక్టివ్ మేక. సింహాల వైపు ఓసారి పరిశీలనగా చూసింది. మౌనంగా అక్కడి నుంచి వెళ్ళిపోబోయింది. తిన్నగా సింహం రాజు దగ్గరకు వెళ్ళింది.

‘రాజా.. మీకు నేరస్తులను పట్టుకోవాలని ఉందా? లేదా?‘ గంభీరంగా అడిగింది.

‘అదేమిటి అలా అడుగుతావు? నిన్ను మా అడవికి పంపినందుకు మీ అడవి రాజుకు బోలెడంత రుసుము చెల్లించాను. ఇష్టంలేకపోతే రుసుము చెల్లిస్తానా?‘ ఎదురు ప్రశ్నించింది సింహం. అపుడు గమనించింది, ఆ గుహలో ఇందాక తనపైకి దూకిన గూఢచారి సింహాలున్నాయి.

డిటెక్టివ్ మేక తడబడింది. ధైర్యం కూడకట్టుకుని చెప్పింది.

'పరిశోధించాలంటే హత్యజరిగిన స్థలంలోని అనేక విషయాలను పరిశీలించాల్సి ఉంటుంది. అందరూ నన్ను వింత జంతువులా చూసినట్టు చూస్తూంటే పరిశీలించటం ఇబ్బందిగా ఉంది. అదీగాక, హత్యాస్థలాన్ని ఎవ్వరూ తొక్కకూడదు. ఇంత మంది ఉంటే నియంత్రణ కష్టం' చివరి మాటలనేప్పుడు గూఢచారి సింహాల వైపు చూస్తూ అన్నది డిటెక్టివ్ మేక. గూఢచారి సింహాలు డిటెక్టివ్ మేక చూపుల వాడికి ఇబ్బందిగా కదిలాయి. సింహం రాజు నవ్వింది.

'అందరూ ఉంటే నీ రక్షణకి ఇబ్బంది ఉండదని భావించాను. ఎందుకంటే ఎంత డిటెక్టివ్ అయినా నువ్వు కూడా మేకవేకదా' అంది సింహం.

'నాకు భయంలేదు. రక్షణలో శిక్షణ పొందాను' అని తన వాడి కొమ్ములను, కాళ్ళకున్న కృత్రిమ గోళ్ళను చూపించింది డిటెక్టివ్ మేక.

'తలాడించింది సింహం. 'సరే.. నేను తగిన ఆజ్ఞలు జారీ చేస్తాను' అంది.

తన సహాయక మేక వైపు చూసింది డిటెక్టివ్ మేక.

'ఇక్కడ ఒంటరిగా భయం వేస్తోంది' అంది సహాయక మేక.

'భయంలేదు' అంది డిటెక్టివ్ మేక నేలను పరిశీలిస్తూ

'ఇక్కడ మేక నుంచున్నట్టు గుర్తులున్నాయి. ఇక్కడెందుకు నుంచుంది మేక' తనలో తాను అనుకుంటూ పైకే అంది డిటెక్టివ్ మేక.

అటునుంచి చుట్టుపక్కల నేలను పరిశీలించింది. దగ్గరలో ఉన్న పొదలను పరిశీలించింది. దానికళ్ళు చిన్నవయ్యాయి.

పొదలలో తెగిన ఆకులను జాగ్రతగా పరిశీలించింది. ఆకులు తెగిన విధానం చూస్తే ఏదో జంతువు గోళ్ళతో వాటిని పక్కకు జరిపి, పొదలలోంచి ఎదురుగా నుంచున్న మేకను చూసినట్టు తెలిసింది.

ఆకులను జాగ్రత్తగా తుంచి, సహాయక మేకకు అందించింది.

చుట్టూ జాగ్రత్తగా పరిశీలిస్తూ ముందుకు సాగింది.

కాస్త దూరం వెళ్ళి ఆగిపోయింది.

నేలపై బోలెడన్ని జంతువులున్న జాడలున్నాయి. వాటన్నిటినీ జాగ్రత్తగా మనసులో ముద్రించుకుంది.

'ఇన్ని ఒక చోట ఉన్నాయంటే మళ్ళీ ఇటునుంచి ఎటయినా వెళ్ళి ఉండాలి. వాటి గుర్తులుండి తీరతాయి' అనుకుంది.

ఇంకా జాగ్రత్తగా నేలను పరిశీలించసాగింది. పలు జంతువుల కాలిగుర్తులు కనిపించాయి.

అవి పలు దిశలలో వెళ్ళాయి.

'అంటే కొన్ని జంతువులు ఇక్కడ కలసి ఇటునుంచి వేర్వేరు దిశలలో ప్రయాణమయ్యాయన్నమాట. దీనికీ, మేకల హత్యలకూ సంబంధం ఏమైనా ఉండి ఉంటుందా?

క్రూర జంతువులన్నీ కలసి మేకలలాంటి బలహీనమైన జంతువులకు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నాయా?'

ఆలోచిస్తూ నడుస్తున్న డిటెక్టివ్ మేక హఠాత్తుగా ఆగిపోయింది.

దూరంగా పొదలోంచి తనవైపే చూస్తున్న కళ్ళు మిలమిల మెరుస్తూ కనిపించాయి.

వెంటనే తన కొమ్మల్లోని ఎత్తులను కనబడేట్టు చేసింది డిటెక్టివ్ మేక.

'ఎవరది?' అడిగింది.

'నీ అడవికి వెళ్ళిపో... నీ అవసరం ఇక్కడలేదు. అనవసరమైన విషయాల్లో తల దూర్చకు' గొంతు మార్చి అందా జంతువు.

'ఎవరది?' అని ఆ వైపు దూకింది డిటెక్టివ్ మేక.

పొదల దగ్గరకు వెళ్ళేసరికి అక్కడ ఏ జంతువూ లేదు. కానీ ఆకులు చిరిగి ఉన్నాయి. కల చెదిరి ఉంది.

'నేను నీకు సహాయకుడిగా ఉండను' అని మూటను విసిరేసి సహాయక మేక పరిగెత్తింది.

ఆలోచిస్తూ ఉండిపోయింది డిటెక్టివ్ మేక.

తన స్థలంలో నుంచుని ఆధారాలను జాగ్రత్తగా పరిశీలించటం ఆరంభించింది డిటెక్టివ్ మేక.

ముఖ్యంగా తెగిన ఆకులను అత్యంత జాగ్రత్తగా పరిశీలించింది. ఆలోచనలో పడింది.

చూస్తూంటే, ఈ హత్యలు పథకం ప్రకారం జరిగినట్టే అనిపిస్తోంది డిటెక్టివ్ మేకకు.

ఒక్క క్షణం దానికి భయం వేసింది.

అనవసరంగా ఈ అడవి రాజకీయాలలో తాను ఇరుక్కుంటున్నట్టు అనిపించింది. కానీ ఇంత దూరం వచ్చి చేతకాదని వదలి వెళ్ళటం బాగుండదు. దానికి తోడు, తాను ఇక్కడికి వచ్చేందుకు రుసుము చెల్లించారు.

తనకెలాంటి ప్రమాదం రాదని డిటెక్టివ్ మేక ధైర్యం వెనుక ఓ కారణం ఉంది.

మేకను క్షేమంగా తిరిగి పంపించే బాధ్యత సింహం రాజుది.

ఆలోచిస్తున్న డిటెక్టివ్ మేక ఉలిక్కిపడింది.

ఏదోగోల వినిపిస్తోంది. లేచి ఆవైపు చూసింది.

అడవిలోని జంతువులన్నీ గోలగోలగా డిటెక్టివ్ మేక దగ్గరకే వస్తున్నాయి.

'ఏమిటీ విషయం?' అడిగింది డిటెక్టివ్ మేక.

'ఇదే. దీనితోటే వెళ్ళింది నా బుజ్జిమేక. ఇంకా తిరిగిరాలేదు' ఏడుస్తూ చెప్పింది తల్లిమేక.

'ఏమైంది?'

'నీ సహాయక మేక ఏమైంది?' అడిగింది సింహం రాజు గంభీరంగా.

'నాతో కలిసి పనిచేయనని వెనక్కు తిరిగివచ్చేసింది. నాకన్నా ముందే వచ్చి ఉండాలే'

'లేదు. ఇంతవరకూ రాలేదు. నా మేకపిల్లనిదే పొట్టన పెట్టుకుంది' ఏడవసాగింది తల్లిమేక.

'నీ డిటెక్టివ్ పనితో నాకు పనిలేదు. నా రాజ్యంలోని ప్రజల ప్రాణాలతో నువ్వు చెలగాటమాడటం నాకు ఇష్టంలేదు. నీ సహాయక మేకను తెచ్చి క్షేమంగా అప్పగించే బాధ్యత నీదే లేకపోతే మేకను చంపిన నేరానికి నువ్వు శిక్షను అనుభవించాల్సి ఉంటుంది. 'తీవ్రంగా అంది సింహం రాజు. జంతువులన్నీ డిటెక్టివ్ మేకను దూషించాయి. ఒకటొకటిగా వెళ్ళిపోయాయి. వెళ్ళిపోయిన వాటివైపే చూస్తూ నిలబడింది డిటెక్టివ్ మేక.

తనకు సంబంధంలేని రాజకీయాలాటలలో తాను పావు అవుతున్నట్టు గ్రహించింది. అంతలో దాని దృష్టి నేలపైనున్న కాలిగుర్తులపై పడింది.

జాగ్రత్తగా పరిశీలించింది. పొదలో తనవైపు చూసి బెదిరించిన జంతువు కాలి గుర్తులు.

అంటే ఇప్పుడిక్కడికి వచ్చిన జంతువుల్లో అది కూడా ఉందన్నమాట.

అంతలో డిటెక్టివ్ మేకకు ఓ విషయం గుర్తుకు వచ్చింది.

తననీ జంతువు బెదిరించటం విని బెదిరి సహాయక మేక పారిపోయింది. కానీ.. అది పారిపోయింది ఒంటరిగా..

ఆ సమయంలో అక్కడ ఈ క్రూర జంతువు ఉంది.

జరిగినది ఊహించటం కష్టంకాదు.

వెంటనే తన ఆయుధాలను తీసుకుంది. చీకట్లోకి నడిచింది.

చీకటికే ప్రత్యేకమైన శబ్దాలు తప్ప మరో శబ్దంలేదు. రాత్రి అయినా ధైర్యంగా ప్రొద్దున్న సహాయక మేక తనను వదలి పరుగెత్తిన స్థలానికి చేరింది డిటెక్టివ్ మేక.

మేఘాల మాటు నుండి చంద్రుడు బయటకు రావటంతో ఆ ప్రాంతం చల్లని వెలుతురుతో నిండింది.

ఆ వెలుతురులో మట్టిలోని గుర్తులను పరిశీలించటం ఆరంభించింది డిటెక్టివ్ మేక.

సహాయక మేక పరుగెత్తిన గుర్తులు సులభంగానే కనిపించాయి. వాటిని వెంబడించింది. ఇంతలో హఠాత్తుగా నేలపై గుర్తులు మాయమయ్యాయి. కానీ, మేక నేలమీద పడిన ఛాయలు కనిపించాయి. అది గిలగిలా కొట్టుకున్నట్టు మట్టి చెదిరి ఉంది.

డిటెక్టివ్ మేక కళ్ళు పక్కనే ఉన్న పొదపై పడ్డాయి.

ఆకులు చిరిగి ఉన్నాయి.

ఆకులను పరిశీలించి చూసింది

ఒకే రకంగా చిరిగి ఉన్నాయి.

అంటే మేకలను చంపుతున్నది ఒక్క జంతువే. ఆ జంతువు కొద్ది సేపటి క్రితం తన ఎదురుగానే ఉంది.

ఇంతలో దాని దృష్టి పొదకు ఆవలివైపున్న మట్టి రక్తంతో తడిసినట్టు లేదు.

ఎంత జాగ్రత్తగా పట్టుకున్నా నేలమీద నుంచి లాగుతూంటే, పొదల్లోంచి లాగుతూంటే ఎక్కడో ఏదో గీసుకుని పోవాలి. రక్తం రావాలి.

ఆలోచిస్తూ పొదలు దాటిన మేకకు ఎదురుగా గలగల పారుతున్న నది కనిపించింది. నది నీటిలో ప్రతిఫలిస్తున్న వెన్నెల చూస్తుంటే అది నీటి ప్రవాహలా కాదు, వెన్నెల ప్రవాహంలా తోస్తోంది.

బలవంతంగా దానివైపు దృష్టి మరల్చి నేలపై వెతికింది. నది ఒడ్డున ఆనవాళ్ళు కనిపించాయి.

ఇప్పుడు స్పష్టంగా తెలుస్తోంది, పులి పంజా ఆనవాళ్ళు.

తన ఆయుధాలను మరోసారి చూసుకుని అడుగులో అడుగులేస్తూ ఆ ఆనవాళ్ళను అనుసరిస్తూ నడిచింది డిటెక్టివ్ మేక.

ఆ ఆనవాళ్ళు, నది ఒడ్డున ఉన్న కొండ గుహలోకి దారితీశాయి.

గుహలో చీకటిగా ఉంది.

ఒక్క క్షణం సందేహించింది డిటెక్టివ్ మేక. తరువాత గట్టిగా ఉపిరి పీల్చుకుని చీకట్లోకి అడుగుపెట్టింది.

ఆ గుహనిండా ఎముకలు పడి ఉన్నాయి. చిట్లిన చర్మాలు, మాంసం ముద్దలు పడి ఉన్నాయి.

డిటెక్టివ్ మేకకు అర్థమయింది.

ఇది హంతక జంతువు స్థావరం.

జాగ్రత్తగా అడుగులో అడుగువేస్తూ వెళ్తున్న మేకకు, గుహ రాతిలోని రంధ్రంలోంచి లోపన పడిన వెన్నెల వెలుతురులో పడి ఉన్న మేక శవం కనిపించింది.

వింతగా అనిపించింది డిటెక్టివ్ మేకకు.

జంతువులు చంపితినేసి, మిగిలినవి పారేస్తాయి. కానీ ఈ జంతువు చంపి, దాచుకుని ఆకలేసినపుడు తినేదానిలా ఉంది.

మేక దగ్గరకు వెళ్తున్న డిటెక్టివ్ మేకకు చీకట్లో మిలమిల మెరుస్తూ కళ్ళు కనిపించాయి.

ఆగిపోయింది.

'నిన్ను వెళ్ళిపొమ్మన్నాను. వినలేదు.. అనుభవించు' అందా జంతువు.

దాని స్వరం వింటూనే గుర్తుపట్టింది డిటెక్టివ్ మేక.

'నేనూహించాను నువ్వే హంతకుడివని' అంది డిటెక్టివ్ మేక. అంతలో గూఢచార సింహాలు చీకట్లోంచి బయటకు వచ్చాయి.

నెమ్మదిగా నడుస్తూ వెలుగులోకి వచ్చింది సింహం రాజు.

'మేకలు ధైర్యంగా సంచరించటం మాకు అవమానం. నాతోటి వారి అసంతృప్తిని అణచాలంటే వారికి వేటాడే స్వేచ్ఛను కలిపించాలి. కానీ అన్ని జంతువుల విశ్వాసం పొందాలంటే నియమాలుండాలి. అందుకే పైకి నియమాలు చేశాను. పరోక్షణంగా నియమోల్లంఘున స్వేచ్ఛను ఇచ్చాను.' అంది సింహం రాజు.

'మరి నన్నెందుకు పిలిచారు?' అడిగింది డిటెక్టివ్ మేక. 'ఏదో చేస్తున్నట్టు నటించకపోతే ఇతరులలో అనుమానాలొస్తాయి. అందుకని. అందుకే నువ్వు నిజం కనుక్కోవటం నాకిష్టంలేదు' అంది పళ్ళు చూపిస్తూ.

'నువ్వు నన్నేం చేయనని మా అడవి రాజుకు మాటిచ్చావు' అంది డిటెక్టివ్ మేక.

'నీలాంటి తెలివైన మేక తన రాజ్యంలో ఉండటం తనకి కష్టం అని నీ పీడ వొదుల్చుకునేందుకే నిన్న మా దగ్గర పంపాడు. పైకి రక్షణ ఒప్పందం కానీ అసలు విషయం' అంటూ డిటెక్టివ్ మేక వైపు దూకింది.

కానీ ఒడుపుగా తప్పించుకుని కొమ్ములతో సింహాన్ని పొడిచింది. అది చూసి ముందుకు రాబోయిన గూఢచార సింహాలు వెనక్కు తగ్గాయి.

కానీ చచ్చినట్టు పడి ఉన్న మేక లేచి ఒక్కసారిగా తన కొమ్ములతో డిటెక్టివ్ మేకను పొడిచింది. 'నీకూ నీ కుటుంబానికి ప్రత్యేక రక్షణ' అంటూ డిటెక్టివ్ మేక మెడలోకి తన వాడి కోరలు దింపింది సింహం రాజు.

## మేక పురాణం

**మేకలు రహస్యంగా సమావేశమయ్యాయి.** ఆ రోజు పొరుగు మంద నుంచి పురాణాలు చెప్పే మేక వస్తోందని కొన్ని మేకలకు ముందే రహస్యంగా వర్తమానం అందింది.

రహస్యంగా ఎందుకంటే, అడవికి రాజయిన సింహం, మేకలు తమ గతం గురించిగానీ, తమ పురాణాలను, ప్రత్యేకతల గురించిగానీ ప్రస్తావించటాన్ని వినటాన్ని నిషేధించింది.

ఇది కేవలం ఒక్క అడవికే కాదు. మొత్తం అడవుల రాజులందరూ కలిసి ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. ఎందుకంటే మేకలు, తేళ్ళు, కుందేళ్ళు వంటి జీవులన్నీ తమకు సేవచేయటానికి, తమకు ఆహారంగా అడవిలోని ఇతర క్రూర మృగాలకు ఏర్పడింది. నక్కలు, తోడేళ్ళు మేకలకన్నా ఎక్కువ తమకన్నా తక్కువ అని పులులు, సింహాలు ఇతర జంతువులు తీర్మానించాయి. అయితే తమని తక్కువ స్థాయిగా భావించటం నచ్చని మేకలు అడవిలో రాజు ఏర్పాటు చేసిన నియమాలను ఉల్లంఘించటం ఆరంభించాయి.

కొన్ని మేకలు కలిసి మేకల విముక్తి కోసం పోరాటం ప్రారంభించాయి. మేకలు ప్రత్యేక జీవులని, వాటి జీవన విధానం, వాటి పుట్టుక, వాటి పురాణాలు ప్రత్యేకమని వాదించి ప్రచారం చేసి తల వంచి రాజు చెప్పే మాటలను వినే మేకలను జాగృతం చేయసాగాయి.

కొన్ని అడవుల్లో మేకలు తిరుగుబాటు చేశాయి. ఇంకొన్ని అడవుల్లో మేకలు అడవుల్లో ఉండమని చెప్పి నగరాల బాట పట్టాయి. అయితే, మేకలు, తమ పోరాటంలో ఇతర అణచివేతకు గురయిన జీవులను భాగస్వాములను చేయలేకపోయాయి.

'మన బాధలు, వేదనలు ఒకటయినా మనం ఒకటికాదు. మన సమస్యలు, పరిష్కారాలు ఒకటికాదు' అని జింకలు మేకలతో కలవలేదు. కుందేళ్ళూ కలవలేదు. అందువల్ల మేకలు ఒంటరిగా పోరాడాల్సి వచ్చింది. ఐకమత్యం లేకపోవటం వల్ల, ప్రాకృతికంగా బలహీనులవటం వల్ల మేకల తిరుగుబాటు విఫలమయింది. మేకలు మళ్ళీ అడవిలో ఇతర జంతువుల సేవకులయ్యాయి.

మరోసారి మేకలు తిరుగుబాటు చేయకుండా అడవుల్లోని క్రూర మృగాలన్నీ సమావేశమై చర్చించి, తీసుకోవాల్సిన కఠినమైన చర్యలను నిర్ణయించాయి.

మేకలకు ఎట్టి పరిస్థితుల్లో తమ ప్రత్యేకత తెలియకూడదు. వాటి కొమ్ములు వాటిని అవి పొడుచుకోవటానికే తప్ప ఇతర జంతువులతో పోరాడటానికి కాదు.

ఎట్టి పరిస్థితులలో మేకలకి ఆత్మ విశ్వాసం కానీ, ఆత్మగౌరవం అన్నది కలగకూడదు. అది ఏర్పడే పరిస్థితులకు తావీయకూడదు. అందుకని మేకలను మందలు మందలుగానే ఉంచాలి. వాటికి కాపలాగా ఏదో ఒక క్రూర జంతువు ఉండాలి.

నిరంతరం ఏదో ఓ రీతిలో మేకలను భయపెడుతూ, వాటికి మరో ఆలోచన లేకుండా వాటిలో ధైర్యం, పౌరుషం, పోరాట పటిమ అన్నది ఏ కోశానా లేకుండా చేయాలి.

చివరిగా, మేకలకు తామూ భగవంతుడి సృష్టిలో భాగమనీ, తమలోనూ భగవంతుడి అంశ ఉందనీ, తమకూ పురాణాలు, వాఙ్మయాలూ, ప్రాచీన చరిత్ర ఉన్నాయనీ తెలియకూడదు. అవి తెలిస్తే వాటికి ఆత్మ గౌరవం, ఆత్మవిశ్వాసాలు ఎపుడో ఒకప్పుడు స్వతంత్ర పోరాటానికి ఇది దారితీస్తుంది. కాబట్టి మేకలు పుట్టించే ఇతర జీవులకు బానిసలుగా ఉండి, వాటికి ఆహార్మగా కావటం కోసమే అన్ని నమ్మించి, తరతరాలు మేకల నరనరాన జీర్ణించుకు పోయేట్టు మేకల కోసం కొత్త పురాణం సృష్టించాలి. పాత పురాణ శ్రవణం నిషేధించాలి. వాటి ప్రసక్తి తెచ్చిన వారికి మరణ శిక్ష విధించాలి, మేకలకు ఒకే పురాణం ఉండాలి. అది మనం కల్పించిన పురాణం.

ఈ నిర్ణయాలు తీసుకుని వాటిని అందరూ కఠినంగా అమలు పరిచారు. మేకలకు నక్కలు, తోడేళ్ళు సృష్టించిన అబద్ధపు పురాణాలు చెప్పించసాగారు. ఆ పురాణాలు చెప్పిన మేకలకు ప్రత్యేక ప్రతిప్రత్తి ఇచ్చి, రాజభోగాలు ఏర్పాటు చేశారు.

దాంతో మేకలన్నీ పాత పురాణాలను వదిలి కొత్త పుంఖాల వైపే మొగ్గు చూపాయి. ఒక పద్ధతి ప్రకారం తాము పుట్టుబానిసలమని మన్న నమ్మకం ప్రచారంలోకి వచ్చింది. మేకలు తమని తాము మరచిపోయాయి.

కానీ కొన్ని మేకలు ఈ పరిస్థితికి వ్యతిరేకంగా పోరాటం ఆరంభించాయి. మేకలకు తమ అసలు పురాణాలను తెలిపి వాటిని జాగృతం చేయాలన్న ప్రయత్నాలు ఆరంభించాయి. కానీ వాటి ప్రయత్నాలు ఫలించటంలేదు. అయినా సరే అవి తమ ప్రయత్నాలను

వదలలేదు. రహస్యంగా సమావేశాలు ఏర్పాటు చేయటం, పైకి ఒక అర్థం వచ్చేట్టు, లోపల మరో అర్థం ఉండేట్టు పురాణాలు చెప్పుకోసాగారు.

కానీ ఎలాగొలా పులులకు ఈ సమాచారం అందేవి. తమ దగ్గర అనుమతి పొందని వారు మేకపురాణం చెప్పకూడదని ఆంక్షలు విధించాయి అడవి రాజులు. అంతేకాదు, పురాణాలు తెలిసిన మేకలను వెతికి వెతికి పట్టుకుని సంహరించటం ఆరంభించాయి. దీనివల్ల పాత పురాణాలు తెలిసిన మేకల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఇలాగే సాగితే కొన్నాళ్ళకి మేకల పురాణం, అసలైనది సంపూర్ణంగా అంతరిస్తుంది. అందుకని ప్రాణాలకు తెగించి మరీ ఇతర మేకలకు అసలు పురాణాలు తెలిపే ప్రయత్నాలు సాగుతున్నాయి. అలాంటి ప్రయత్నంలో భాగమే ఆ రోజు రాత్రి అన్ని జంతువులు నిద్రించిన తరువాత జరుగుతున్న ఆ రహస్య పురాణశ్రవణం.

'మేకలన్నీ నమ్మదగ్గవే కదా?' పురాణం ఆరంభించమన్న మేకవైపు చూసి అడిగింది, పురాణం చెప్పే మేక.

'నమ్మదగ్గ వాటికే చెప్పాను. మనకు సంఖ్య అవసరంలేదు. కానీ నమ్మకమైన మేకలు కావాలి కదా' అందా మేక.

'అయితే ఆరంభిస్తాను' అని గొంతు సవరించుకుంది మేక.

అక్కడున్న నాలుగయిదు మేకలు ఆత్రంగా ముందుకు వంగాయి. విన్న ప్రతి శబ్దాన్ని అర్థం చేసుకుని గుర్తుంచుకోవాలన్న ఆత్రం వాటిది. తరువాత ఈ నాలుగు మేకలు వేర్వేరు ప్రాంతాలకు వెళ్ళి అసలు పురాణాన్ని వినిపించాలి. 'ఆరంభంలో ఏమీ లేదు. కానీ ఏదో ఉంది. ఆ ఉన్నదేమిటో ఎవరికీ తెలియదు. అదేమిటో అది కూడా ఎవ్వరికీ చెప్పలేదు. ఎందుకంటే అదేమిటో దానికి కూడా తెలియదు.'

అర్థం అయినా కాకున్నా ప్రతి పదాన్నీ జ్ఞాపకం ఉంచుకుంటున్నాయి మేకలు.

'ఆ ఒంటరిగా ఉన్న దానికి తోడు కావాలనిపించింది. ఆలోచన రావటంతోటే సృష్టి ఆరంభమయింది. సూర్యచంద్రులు, నక్షత్రాలు, పాలపుంతలు మొత్తం సృష్టి ఏర్పడింది.'

మేకలు ఆకాశంలోకి తలెత్తి చూశాయి. ఆ ఊహనే వాటి మెదళ్ళకు అందటం లేదు.

'దేవతలు ఏర్పడ్డారు. దేవతలు రాగానే రాక్షసులు వచ్చారు.'

'ఎక్కడనుంచి?'

'ప్రపంచంలో మంచి చెడు కలిసే ఉంటాయి. ఒకటుందంటే ఇంకొకటి వెన్నంటి ఉంటుంది. అంతా దానిలోంచే వచ్చాయి. సృష్టి, దేవతలు, రాక్షసులు.. అన్నీ' అయోమయంగా తలలూపాయి మేకలు.

'అలా ఏర్పడ్డ దేవతలకు రాక్షసులకు ఆహారం కావాల్సి వచ్చింది. అవి తమని సృష్టించిన దాన్ని ప్రార్థించాయి. తమకు ఆహారాన్ని ఏర్పాటు చేయమని వేడుకున్నాయి.'

'దేవతలకు కూడా ఆహారం అవసరమా?' అడిగిందో మేక ఉండబట్టలేక.

'ఆకారం ఉన్న ప్రతి జీవికీ ఆహారం అవసరమే దేవతలు, రాక్షసులు ఆహారం కోసం ప్రార్థించటంతో దైవం ప్రకటితమయింది. చెట్లు, చేమలను చూపించి ఇది మీ ఆహారం అంది.'

'మాకు చెట్లు చేమలు సరిపోవు. ప్రపంచాన్ని పాలించాలంటే మాకు బోలెడంత శక్తికావాలి' అన్నారు రాక్షసులు.

'సరే..' అని దైవం వారికి సింహాన్ని చూపించింది.'

'అమ్మో.. ఇది క్రూర జంతువు ఇది మా ఆహారమైతే మాలోనూ క్రౌర్యం ప్రవేశిస్తుంది. ఒద్దొద్దు' అన్నారు దేవతలు.

'ఇంత క్రూరమైన జంతువును ఆహారంగా స్వీకరించటం కష్టం. మా అంశనే మేము స్వీకరించినట్టు అవుతుంది' అన్నారు రాక్షసులు.

ఇలా ఏ జంతువును చూపించినా ఇది కాదంటే ఇది ఒద్దని దేవతలు, రాక్షసులు కొట్టి వేస్తూ వచ్చారు. చివరికి దైవం వారికి మేకను చూపించింది.

మేకను చూస్తూనే దేవతలు సంతోషించారు. 'ఆకులు అలమలు తింటూ శరీరాన్ని పవిత్రంగా ఉంచుకుంటుంది. ఇది మాకు సరిపోతుంది' అన్నారు దేవతలు.

'ఆ ఇది బాగుంది. మరీ పెద్దగా లేదు. మరీ చిన్నగా లేదు. మరీ వేగంగా పరిగెత్తదు. మరీ మెల్లగా నడవదు. మరీ కోపిష్టి కాదు. అలాగని రోషం లేనిది కాదు. ఇది మాకు నచ్చింది' అన్నారు రాక్షసులు.

అయితే దేవతలు, రాక్షసులకు ఒకటే ఆహారం కావాల్సి రావటంతో ఇబ్బంది వచ్చింది. ఇంతలో దేవతలు ఒక్కసారిగా మేక శరీరంలోకి దూకారు. దేవతల ఆలోచనను పసిగట్టిన రాక్షసులూ మేక శరీరంలోకి ఒదిగారు.'

'అయ్యో' అన్నాయి వింటున్న మేకలు 'అందుకే మన శరీరంలో దేవతలు ఉన్నారు. రాక్షసులు ఉన్నారు. వారిద్దరి నడుమ ఎపుడూ మనకోసం పోరు జరుగుతూంటుంది. మనలోని మంచిని పెంచితే దేవతలు గెలుస్తారు. మనకి ధైర్యం వస్తుంది. ఆత్మ విశ్వాసం వస్తుంది. మనం స్వతంత్రంగా ఎవ్వరికీ భయపడకుండా జీవిస్తాం. అలాకాక మనం భయపడినా, ఇతర జీవులకన్నా తక్కువగా మనల్ని మనం భావించుకున్నా ఎవరికైనా బానిసత్వం చేసినా మనలోని రాక్షసులు శక్తిమంతులవుతారు. మనం పైకి ఎదగలేము. రాక్షసపు జంతువుల బారినపడి వాటికి ఊడిగం చేస్తూ, వాటికి ఆహారమై రాక్షసత్వాన్ని పెంపొందిస్తాం. కాబట్టి మనం దైవనికి బలం ఇచ్చి స్వతంత్రంగా, శక్తిమంతంగా నిలబడతామో, రాక్షసత్వానికి లొంగిపోయి రాక్షస జంతువులకు బానిసలమౌతామో మనమే నిర్ణయించుకోవాలి. అలా దైవత్వానికి శక్తినిచ్చి, దేవతల అనుగ్రహం పొంది స్వతంత్రంగా నిలిచిన మహానుభావ మేకలెన్నో ఉన్నాయి. వాటిని ఆదర్శంగా తీసుకోవాలి. ఎప్పుడయితే మనం మనలోని దైవత్వాన్ని గుర్తిస్తామో అప్పుడిక మనకి తిరుగులేదు. ఎదురులేదు. ఇదే మన మేక పురాణం చెపుతోంది.'

'కానీ.. మనం బలహీనులము.'

'ఎవరన్నారు మనం బలహీనులమని. అన్ని జంతువులను కాదని దైవం మనల్నే తనకర్హమైన జీవిగా ఎంచుకున్నాడు. మనలో శక్తి ఉంది. సింహాలకు కోరలుంటే ఏమిటి? మనకు బుద్ధి ఉంది. వాటికి పశుబలం ఉంటే ఏమిటి? మనకు దైవబలం ఉంది. భయపడటం అంటే రాక్షసత్వానికి లొంగి పోవటమే. బానిసగా బ్రతకటమంటే రాక్షసులకు ఊపునివ్వటమే భగవంతుడిచ్చిన శక్తిని రాక్షసుల కోసం వాడటమే. తలవంచటం అంటే దైవానికి అన్యాయం చేసి రాక్షసులకు లొంగినట్టే. ఇదే మన పురాణం చెప్తుంది. తలవంచద్దు. బయపడవద్దు. తలెత్తి పోరాడితే దైవం మన పక్కన నిలుస్తుంది. మనలోని దైవం గెలుస్తుంది. మనం ఏ ఇతర జీవికన్నా తక్కువ కాము. ఇంకా అన్నిటికన్నా మనమే అధికులం'

మేక ఆవేశంలో ఇతర మేకలు మైమరచి పోయాయి. వాటిలో ఆవేశం ఉరకలు వేస్తోంది.

ఇంతలో వాటికి పులుల గర్జనలు వినిపించాయి.

వెంటనే తెలివి నవ్వింది.

పారిపోయే వ్యవధి కూడాలేదు. అందుకే పురాణం చెప్పే మేక కథను మార్చింది.

'మనల్ని దైవం ఆహారంగానే సృష్టించాడు. మనం పుట్టిందే సింహాలకు, పులులకు, తోడేళ్ళకూ, నక్కలకు ఊడిగం చేయటానికి వాటి కరాళ దంష్ట్రలలో పడి నలగటమే మన జీవితానికి సార్థకత. అర్థం... పరమార్థం' చెప్తూన్న మేక, పులి దగ్గరగా వచ్చి నిలబడటంతో ఆగిపోయింది. మేక వైపు తీక్షణంగా చూసింది పులి.

'నువ్వీ మందకు చెందిన దానివి కాదుకదా?' గాండ్రించింది.

'నేను పొరుగు మందకు చెందిన మేకను. పురాణం చెప్పటానికి వచ్చాను.' ధైర్యం చిక్కబట్టుకుని అందా మేక.

'మీ మందలో పురాణం చెప్పే మేకల జాబితాలో నువ్వులేవు' అనుమానంగా అంది పులి.

'అది నాకు తెలియదు. కానీ నేను, మేకలు పుట్టిందే ఇతర జీవులకు ఆహారం అవటం కోసం, ఆకులు తింటూ శరీరాన్ని పవిత్రంగా ఉంటూ తనని తాను ఆత్మార్పణం చేసుకోవటం కోసమే జీవించాలని నమ్ముతాను. దేవుడు మేకను సృష్టించి ఇతరులకు ఆహారం కమ్మని ఆదేశించాడని ప్రచారం చేస్తాను. అన్ని జీవుల్లో అల్పజీవి మేక అని నమ్ముతాను' గబగబా వల్లెవేసింది మేక.

పులిని ఏదో అనుమానం పట్టి పీడిస్తోంది. ఎందుకో దానికి సమాధానాలు సంతృప్తి నివ్వటంలేదు.

కానీ మేక ప్రవర్తనలో, మాటల్లో దాన్ని శిక్షించటానికి ఏమీలేదు. అందుకని ఆలోచిస్తూ నిలబడింది. చివరికి తనతో వచ్చేయమని నక్కకు, తోడేలుకు సౌంజ్ఞ చేసింది.

'నాకు విశ్వసనీయ సమాచారం అందింది. ఇది తిరుగుబాటు మేక అని, ఆ నిషేధిత, పురాణాలు తెలిసిన చివరి మేక అని' అంది నక్క కాస్త దూరం వెళ్ళిన తరువాత. పులి వెనక్కు తిరిగి చూసింది.

మేక పురాణం చెప్పటం ఆరంభించింది.

ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. చీకటి జగతిని అలుముకుని ఉంది. కానీ ఇంకా ఎంతో కాలం చీకటి రాజ్యం చెల్లదని తెలుస్తూనే ఉంది. చీకట్లో నాలుగు మేకలు, పురాణం చెప్పిన మేక గబగబా నడుస్తున్నాయి. 'మీరు నేను చెప్పినది గుర్తుంచుకోండి. నాలుగు దిశల్లోకి వెళ్ళండి. వీలయినన్ని మేకలకు మన పురాణం చెప్పండి. చివరలో, మనల్ని బంధవిముక్తుల్ని చేయటానికి దైవం మేక అవతారం ధరించి వస్తాడని చెప్పటం మరచిపోకండి. ఆ మేక ముందు ఏ దుష్టశక్తి నిలవలేదని చెప్పండి. దాని రాకకు మనం సిద్ధంగా ఉండాలని చెప్పండి' అంది పురాణం చెప్పిన మేక గబగబా.

మిగతా మేకలు తలలూపాయి. 'జాగ్రత్తగా నది దాటండి అని, మీరు చెప్పినవన్నీ పాటిస్తాం' వాగ్దానం చేశాయి.

సంతృప్తిగా నిట్టూర్చింది పురాణం చెప్పిన మేక. దైవం మేక అవతారంలో వస్తాడని, తమని బానిసత్వం నుంచి విముక్తి చేస్తాడని, వింత పురాణంలో కొత్తకథ జోడించిందీ మేక.

***ఎందుకంటే మనిషికి విశ్వాసం శక్తినిస్తుంది. విశ్వాసం ఉంటే కొండను పిండికొట్టవచ్చు. విశ్వాసం లేని మనిషికి ఏనుగు బలం ఉన్నా క(గ)రపుల్లను కూడా కదల్చలేడు.*** అందుకే పురాణాల ద్వారా ఆశను, విశ్వాసాన్ని రగిలించాలని ప్రయత్నిస్తోందీ మేక.

నది చేరుకుంది వెనక్కి తొంగి చూసింది. నాలుగు మేకలు నాలుగు దిశల్లో వెళ్తున్నాయి.

సంతృప్తిగా నిట్టూర్చింది పురాణం చెప్పిన మేక.

దాహం తీర్చటం కోసం నీళ్ళలో మూతి పెట్టింది. ఉలిక్కిపడింది. పక్కనుంచి సింహం గర్జన వినిపించింది.

'ఏమిటీ నీ ఎంగిలి నీళ్ళు నాకు పంపుతున్నావు?'

'రాజా.. మీరు ఎగువన ఉన్నారు. నేను దిగువన ఉన్నాను. మీ ఎంగిలి నాకు వస్తుంది కానీ.. నా ఎంగిలి నీళ్ళు మీకు రావు'

పెద్దగా, భయంకరంగా నవ్వింది సింహం. 'పులులను, సింహాలను తరిమి మేకలను విముక్తి చేసే మేకవీరుడు వచ్చేట్టు పురాణం చెప్పినప్పుడు, నీళ్ళు దిగువ నుండి ఎగువకు ప్రవహించటంలో ఆశ్చర్యం ఉందా?' అడిగింది సింహం.

'మీరంటున్నది నాకు అర్థం కావటంలేదు' భయాన్ని అణచుకుంటూ అంది మేక,

'నీ నలుగురు శిష్యులు నాలుగు దిశలకు కాదు వెళ్ళింది. నాలుగు సింహాల పొట్టల్లోకి. నిజం చెప్పి చచ్చారు.' అంది సింహం మేకపైకి దూకుతూ.

'నా పురాణం ఏనాడైనా నిజం చెయ్యిదేవా. మేకలను బానిసత్వం నుంచి విముక్తి లభించేట్టు చేయి' అని ప్రార్థిస్తూ సింహానికి ఆహారమయ్యింది మేక.

## 'వీరమేక' అను సింహాన్ని పెళ్ళాడిన మేక కథ.

**అనగనగా ఒక అడవి రాజ్యం.**

ఆ అడవి రాజ్యానికి ఒక సింహం రాజు.

ఆ సింహం రాజుకు ఒక భార్య సింహం, రెండు పిల్ల సింహాలు.

పిల్ల సింహాలలో ఒకటి మగపిల్ల సింహం, రెండవది ఆడపిల్ల సింహం.

మగపిల్ల సింహం, సింహం పుట్టగానే దాని వీరత్వం అందరికీ తెలిసేట్టు బాల్యంలోనే ఇతర బలహీన మృగాలను చీల్చి చెండాడటంలో పేరు పొందింది.

ఆడపిల్ల సింహం అందానికి మారుపేరుగా ప్రసిద్ధి పొందింది. అందానికి తన వాడియైన గోళ్ళు, కరకు పళ్ళు తోడవటంతో ఆమె ఖ్యాతి దశదిశల వ్యాపించింది.

ఆమెను వివాహమాడటానికి ఎందరెందరో రాజసింహ కుమారులు ముందుకు వచ్చారు.

అంతమంది రాజసింహాలు ముందుకు రావటంతో ఆ అడవి రాజుకు ఏం చేయాలో తోచలేదు. ఎందుకంటే పిల్ల సింహం ఎవరిని వరించినా, మిగిలిన వారికి కోపం వస్తుంది. అవసరమైన వివాదాలు చెలరేగుతాయి. ఒకవేళ పిల్ల సింహం వరించిన వీరుడు మిగతా వారందరితో తలపడలేక పోతే అనర్థం వాటిల్లుతుంది.

రకరకాల ఆలోచనలతో రాజసింహం తలనొప్పి పెరిగిపోయింది. ఇంతలో ఒక రాక్షసుడు లాంటి రాజు ఎక్కడ నుంచి వచ్చాడో ఎగురుతూ వచ్చాడు. సింహాలు, సింహ రాజకుమారులు, సమస్త అడవి జంతువులు ప్రజలు చూస్తూండగా ఆ రాక్షసుడు రాకుమారి పిల్ల సింహాన్ని ఎత్తుకుపోయాడు వికటాట్టహాసం చేస్తూ.

అతడితో తలపడాలని వెళ్ళిన సింహాలను, పులులను తన మంత్రదండంతో బూడిద చేసి పారేశాడు. దాంతో రాక్షసుడితో తలపడటానికి ఎవ్వరూ ముందుకు రాలేదు.

రాక్షసుడు అమ్మాయిని గుప్పిట బిగించి ఎగిరిపోయాడు ఎక్కడికో. సింహం రాజు కన్నీరు మున్నీరయ్యాడు. పిల్ల సింహం కోసం విలపించాడు. చివరికి ప్రకటించాడు. 'ఎవరు నా పిల్ల సింహాన్ని రాక్షసుడి బారినుంచి తప్పించి తీసుకు వస్తారో, వారికి నా రాకుమారినిచ్చి వివాహం చేస్తాను. నా రాజ్యమూ వారిదే అవుతుంది.'

తన రాజ్యంలోనే కాదు ఇరుగుపొరుగు రాజ్యాలలోనూ ప్రకటన చేయించాడు. ప్రకటనకు విస్తృత ప్రచారం ఇచ్చాడు.

కళ్ళు నులుముకుంటూ నిద్రలేచింది వీర మేక. బంగారంలాంటి తన నిద్రను 'పాడుచేసిందెవరా?' అని చుట్టూ చూసింది.

పిట్టలు, గుడ్లగూబలు టముకు వేస్తున్నాయి.

'మహారాజ సింహం ముద్దుల కూతురు యువరాణి సింహాన్ని రాక్షసుడు ఎత్తుకుపోయాడు. రాక్షసుడి బారినుంచి రాకుమారి సింహాన్ని తప్పించి తెచ్చిన వారికి రాకుమారినిచ్చి వివాహం చేయటంతోపాటు రాజ్యాన్ని కూడా అప్పచెప్తానని రాజు సింహం ప్రకటిస్తోందహో.. వీరులంతా తమ తమ అదృష్టాన్ని పరీక్షించుకోండి. తమ శౌర్యధైర్య సాహస ప్రతాపాలను ప్రదర్శించి రాకుమారిని రక్షించండి' వింటున్న వీరమేక మనస్సు ఆనందంతో గంతులు వేసింది. వీరమేక రాకుమారి సింహాన్ని చాలాసార్లు దొంగతనంగా చూశాడు. అతడి మనస్సు రాకుమారి పచ్చటి శరీరంపైన, క్రూరమైన కత్తుల్లాంటి దంతాలపైన చిక్కుకుపోయింది. తన శక్తికి, తాహతకు మించినదని తెలిసినా ఆ పిల్ల సింహం గురించి ఊహించకుండా ఉండలేకపోయాడు. ఇటీవలి కాలంలో అతడికి అన్ని పనులపై శ్రద్ధపోవటానికి, అందరితో తిట్లు తినటానికి ఆమెపై అతడి మనస్సులో రహస్యంగా పెరుగుతున్న ప్రేమ వ్రణమే ప్రధాన కారణం.

పిట్టలూ, గుడ్లగూబలు చేస్తున్న ఆ ప్రకటన విన్న వీరమేక హృదయం గంతులేయటం ఆరంభించింది.అప్పటిదాకా నిర్వ్యాపారంగా, శవసమానంగా పడి ఉన్న వీరమేక చైతన్య వంతమయింది. చెంగున లేచి నిలబడింది.

'నీది మూర్ఖత్వం పెద్ద పెద్దపులులు, సింహాలే సాధించనిది నువ్వెలా సాధిస్తాననుకుంటావు? వాటికున్న బలం నీకుందా? వాటి వేగం నీకుందా? వాటి క్రౌర్యం నీకుందా?' పెద్ద మేకలన్నీ వీరమేకను నిలదీశాయి.

'వాటికి లేని బుద్దిబలం నాకుంది' నిర్భయంగా జవాబిచ్చింది వీరమేక.

'పశుబలం ముందు బుద్దిబలం పనికి రాదు' అన్నాయి పెద్దమేకలు.

'బుద్దిబలం పశుబలాన్ని నిర్దేశించి, నియంత్రిస్తుంది' అంది వీరమేక.

'మేం చెప్పేది చెప్పాం. ఆ తరువాత నీ ఖర్మ' అన్నాయి మేకలు.

'నా ఇష్టం. నా అదృష్టం' అంది వీరమేక.

తెల్లారే తన మేక మందను వదిలి ప్రయాణం ఆరంభించింది.

దారిలో కనిపిస్తున్న ఇతరమేకల్ను, పిట్టలను, కుందేళ్ళను, జింకలను అడిగి రాక్షసుడు ఏ దిశలో ఎగిరిపోయాడో తెలుసుకుంది వీరమేక. ఇవన్నీ రాక్షసుడే దిశలో ఎగిరిపోయాడో తెలుసుకోవాలని ప్రయత్నించిన సింహాలు, పులులను చూసి పారిపోయాయి. దగ్గరకెళ్తే అవి తమని తినేస్తాయన్న భయం వాటికి. కానీ వీరమేకను చూస్తే అలాంటి భయం కలగలేదు. అందుకని చెప్పాయి.

అవి చెప్పినట్టు ఉత్తర దిశలో ప్రయాణించింది మేక.

నడచి నడచి అలసిపోయింది వీరమేక. కాస్సేపు విశ్రమించాలని ఓ మంచి స్థలం చూసుకుంది. విశ్రమించటానికి ఉపక్రమించే సమయానికి ఓ విచిత్రమైన జంతువు క్రూరంగా వచ్చి నిలుచుంది దానిముందు. 'ఎవరు నువ్వు? ఇది నా స్థలం. ఇక్కడ నువ్వుండటానికి వీలులేదు' అంది. దాని మాట పిడుగులు కురుస్తున్నట్టుంది.

వీరమేక బెదరలేదు. 'ఈ ప్రపంచం నీది కాదు. నాదికాదు. ఇందులో ఏదీ నీది నాది కానపుడు నీ స్థలం అంటూ ఏదీ లేదు. నీ స్థలం అంటూ ఏదీ లేనప్పుడు నేను నీ స్థలాన్ని ఆక్రమించటమే ప్రసక్తే లేదు. ఏమిటి నీ సమస్య?' అని అడిగింది ధైర్యంగా. తనని చూసి అందరూ బెదిరి పారిపోవటమే తెలుసా విచిత్రజీవికి. ఎవరైనా ఎదురు నిలిచినా తాను నోరువిప్పగానే పారిపోతారు. అలాంటిది ఈ మేక నిలబడటమే కాక ధైర్యంగా సమాధానం ఇవ్వటం ఆ జీవిలో భయం కలిగించింది. దీని దగ్గర తనకు తెలియని ఏదో శక్తి ఉండి ఉంటుంది. అందుకని ఇలా సమాధానం ఇస్తోంది అనుకుంది. కానీ వెనుతిరిగితే ఓటమిని ఒప్పుకున్నట్టవుతుంది. అందుకని పెద్దగా అరచి మేకపైకి దూకింది.

అది ఊహించిన వీరమేక దాన్ని దగ్గరకు రానిచ్చి, దగ్గరకు రాగానే పక్కకు దూకింది. అదే వేగంతో వెళ్ళి ఆ జీవి వెనకే ఉన్న బండరాయికి కొట్టుకుంది. దిమ్మ తిరిగి పడిపోయింది.

కాస్సేపటికి తేరుకుంది. వీరమేకవైపు గౌరవంగా చూసింది. అది ఏ పని మీద వెళ్తోందో తెలుసుకుంది. కాస్సేపు ఆలోచించింది. 'నువ్వు వెళ్తున్నది చాలా కఠినమైన పనిమీద. వాడు భయంకరమైన రాక్షసుడు. చాలాకష్టం వాడి నుంచి రాజకుమారి సింహాన్ని తప్పించటం. కానీ నీ తెలివి చూస్తే నువ్వాపని సాధించగలవనిపిస్తోంది. ఇదిగో ఇది దగ్గరుంచు, నీకు ఇది పనికి వస్తుంది.' అంటూ తనలోంచి ఓ వస్తువు తీసి ఇచ్చింది.

అదేదో విచిత్రమైన వస్తువు. అది ఎలా పనిచేస్తుందో వీరమేకకు తెలియలేదు. కానీ దాన్ని తన సంచిలో వేసుకుంది. ఆ రాత్రికి అక్కడ విశ్రమించి ముందుకు సాగింది.

దారిలో వింతలు చూస్తూ ముందుకు సాగుతున్న వీరమేకకు నది అడ్డం వచ్చింది. నది ఎలా దాటాలా? అని ఆలోచించింది.

నదిలో ఉన్న ఓ మొసలి వీరమేకను చూసి దగ్గరకు వచ్చింది. 'నిన్ను నది దాటిస్తాను. నాకేమిస్తావు?' ఆశగా అడిగింది.

'నీకు నేనేమివ్వగలను. తిరిగి వచ్చేటప్పుడు నాతో రాకుమారి సింహం ఉంటుంది కాబట్టి, ఆమెతో పెద్ద బహుమతి ఇప్పిస్తా' అంది వీరమేక. 'సరే'నని నాలిక తడుపుకుంటూ వీరమేకను వీపునెక్కించుకుంది మొసలి. నది మధ్యలోకి వెళ్ళగానే వికటాట్టహాసం చేసింది. 'ఇప్పుడెక్కడికి తప్పించుకుంటావు? నువ్వే నా బహుమతి' అంది.

వీరమేక నవ్వింది. 'నన్ను తింటే ఛస్తావు. నా శరీరమంతా విషమే. నాకు తెలియదా నీ బుద్ధి? అయినా ఎందుకు నీ వీపు మీదెక్కానంటే ఇందుకే నన్ను కొరకను కూడా కొరకలేవు' అంది వీరమేక ధైర్యంగా. మొసలికి కోపం వచ్చింది. ముఖం వెనక్కు తిప్పి తోకతో మేకను ఒత్తి పట్టి కొరకబోయింది. విచిత్రం జంతువు తనకిచ్చి దాన్ని మొసలి పళ్ళనడుమ ఇరికించింది వీరమేక.

పటపటా మొసలి పళ్ళు విరిగాయి. బాధతో అరిచిందది. నది దాటే వరకూ మాట్లాడలేకపోయింది.

నది దాటిన తరువాత, ఒడ్డుమీదకు దూకుతూ చెప్పింది వీరమేక. 'ఇక్కడే ఉండు. రాకుమారి సింహంతో తిరిగి వస్తాను. నీకు బహుమతి ఇప్పిస్తాను'.

ముందుకు సాగుతున్న వీరమేక ఆకాశాన్ని తాకుతున్న ఆ జంతువును చూసి ఆగిపోయింది.

'నన్ను దాటి ముందుకు వెళ్ళటానికి వీలులేదు' అరిచిందా జంతువు.

'ఈ ప్రపంచంలో ఎవరు ఎవరినీ ఆపలేరు. భగవంతుడు నిర్దేశించినంత దూరం ఎవరెంత అడ్డుపడ్డా ప్రయాణిస్తాం. ఆ తరువాత ఎంత ప్రయత్నించినా అడుగు ముందుకు వేయలేం. నన్నుపోనీ రాజకుమారిని రక్షించాలి' అంది వీరమేక ధైర్యంగా.

ఆ జంతువు వీరమేకవైపు విచిత్రంగా చూసింది.

'చూస్తే తెలివైన దానిలా ఉన్నావు. సింహాన్ని పెళ్ళాడాలన్న ఈ విచిత్రమైన కోరిక ఎందుకు?'

***'తన పరిమితులలోనే ఆలోచించేవాడు సుఖంగా ఉన్నా ఎదుగుదల లేని వాడవుతాడు. పరిమితులను అధిగమించి ఎదగాలని ప్రయత్నించేవాడు అభివృద్ధికి కారణమవుతాడు'*** అంది వీరమేక. ఆ జంతువు వీరమేక వైపు చూస్తూ మౌనంగా ఉంది చాలాసేపు. చివరికి ఓ విచిత్రమైన వస్తువు ఇచ్చింది. 'ఇది నీకు పనికి వస్తుంది. రాకుమారి బందీగా ఉన్న స్థలానికి నిన్ను తీసుకువెళ్తాను. కానీ ఆ రాక్షసుడంటే నాకూ భయమే. వాడి కంట పడితే నన్ను బంధిస్తాడు' అంది.

తల ఊపింది వీరమేక.

'అర్ధరాత్రి దాటితే కానీ రాక్షసుడి నగరంలో ప్రవేశించకూడదు. వాడి దగ్గర పలురకాల మంత్రదండాలున్నాయి. మనల్ని చూస్తే పట్టేస్తాడు' అంది జంతువు.

వీరమేక మాట్లాడలేదు.

రాక్షసుడి నగరం విచిత్రంగా ఉంది. దాన్ని ఆశ్చర్యంగా చూస్తోంది వీరమేక.

అర్ధరాత్రి కూడా నిప్పులేకుండా దీపాలు వెలుగుతున్నాయి. కొందరు రాక్షసులు బుర్రు బుర్రున జారిపోతున్నారు వేగంగా.

'ఇక నేను ముందు రాను. అదిగో ఆ గోడ కనిపిస్తోంది కదా, దాని వెనుక ఉంది నీ రాకుమారి సింహం' చెప్పింది జంతువు. తల ఊపింది వీరమేక.

'తెల్లారే వరకూ మీకోసం ఎదురు చూస్తాం. తెల్లారిన తరువాత వెళ్ళిపోతాను' చెప్పింది జంతువు.

'సరే' అని ముందుకు సాగింది వీరమేక.

గోడ చాలా ఎత్తుగా ఉంది. గోడచుట్టూ ముళ్ళకంచెలున్నాయి. కానీ వీరమేకకు భయం కలగలేదు.

పెద్ద పెద్ద కాండలు, నిటారుగా ఉన్న బండలు పడకుండా పట్టుతో ఎక్కటం మేకలకు వెన్నతో పెట్టిన విద్య. ముళ్ళు, గిళ్ళు అంటే భయం ఎప్పుడూ లేదు.

వెనక్కు వెళ్ళి వేగంగా పరుగెత్తుతూ ముందుకు దూకి ముళ్ళకంచె దాటి గోడపై పట్టు బిగించింది. చకచకా అదే ఊపుతో గోడ ఎక్కి ఆ మరో వైపుకు దూకింది.

తన ఎదురుగా కనిపిస్తున్న వాటిని చూసి ఆశ్చర్యపోయింది.

ఎన్నెన్నో రకరకాల జంతువులున్నాయి. అన్నీ ఏవేవో విచిత్రమైన డబ్బాలలో బంధించి ఉన్నాయి. కొన్ని నిద్రపోతున్నాయి. ఇంకొన్ని వాటిల్లో అటూ ఇటూ అశాంతితో తిరుగుతున్నాయి.

అన్నిటినీ చూస్తూ వెళ్తోంది వీరమేక. ఎక్కడా రాకుమారి సింహం కనబడటం లేదు.

సమయం గడచిపోతోంది వీరమేకలో తొలిసారి సంశయం ప్రవేశించింది. తాను సరైన స్థలానికే వచ్చిందా?

ఇంతలో దాని దృష్టి అన్నిటికీ దూరంగా ఉన్న ఆ జంతువుపై పడింది.

అదే రాకుమారి సింహం.

గబగబా ఆవైపు వెళ్ళింది.

వీరమేకను చూస్తూ ఆకలిగా గర్జించింది రాకుమారి సింహం. వీరమేక భయపడలేదు.

'రాకుమారీ.. శాంతించు. నేను నిన్ను రక్షించటానికి వచ్చాను. నాతోరా' అంది వీరమేక.

నమ్మనట్టు చూసింది రాకుమారి సింహం.

'నమ్మండి ఇది నిజం' అంటూ దగ్గరకు వెళ్ళింది. అప్పుడు గమనించి సింహం బయటకు రాలేదు. ఎందుకంటే డబ్బుకు అడ్డుగా బలమైన పదార్థాలేవో ఉన్నాయి.

అప్పుడు గుర్తొచ్చింది వీరమేకకు. తనకా విచిత్ర జంతువు ఇచ్చినదాన్ని బయటకు తీసింది. ఆ అడ్డుగా ఉన్న బలమైన పదార్థాల నడుమ దీన్ని ఇరికించి బలంగా వ్యతిరేక దిశలో ఒత్తింది.

కాస్సేపటికి అడ్డుగా ఉన్నవి పటపట విరిగాయి.

చెంగున బయటకు దూకింది రాకుమారి సింహం. దానికి తన దగ్గర ఉన్న ఆ బలమైన వస్తువును చూపించింది వీరమేక.

'దీన్ని చూశావు, దీని బలం చూశావు. నిన్ను రక్షించింది నేను. నా దిక్కు ఆకలి చూడకు' బెదిరించింది వీరమేక.

రాకుమారి సింహం వెనక్కు తగ్గింది.

'నా వెంటరా' అంటూ సింహాన్ని వెంట తీసుకెళ్ళింది. తాను గోడ ఎక్కి సింహాన్ని పైకి లాగింది. ఇద్దరూ చకచకా విచిత్ర జంతువు ఎదురు చూస్తున్న స్థలానికి వెళ్ళారు.

వీళ్ళని చూడగానే ఆ జంతువు సంతోషించింది.

సింహం గుర్రుమంది.

'ఇది మనకు సహాయం చేస్తోంది' చెప్పింది వీరమేక.

ఇద్దరినీ వీపు మీద మోసి నది దగ్గరకు తెచ్చింది. నది దగ్గర వదిలివెళ్ళిపోయింది.

ఇదంతా రాకుమారి సింహానికి విచిత్రంగా ఉంది. ఈ జంతువులన్నీ ఓ మేక మాట వినటం ఏమిటి? గొప్ప గొప్ప వీరులు సాధించలేని పని ఈ పనికి రాని మేక సాధించటం ఏమిటి?

దాని ఆలోచనలు పూర్తికాకముందే మొసలి వచ్చింది. 'సాధించాలే' అంది.

'ఈ మొసలికి ఏదైనా బహుమతి ఇవ్వాలి' అని అది చేసిన సహాయం చెప్పింది మేక.

'ఈ నది నీదే ఇది నీ సామ్రాజ్యం' వాగ్దానం చేసింది సింహం, ఆశ్చర్యపోతూ.

ఇద్దరూ మొసలి మీద నది దాటుతూంటే చెప్పింది వీరమేక.

'మనం సామ్రాజ్యానికి వెళ్ళిన తరువాత మనిద్దరం భార్యాభర్తలమవుతాం. నిన్ను రక్షించిన వాడికి నిన్నిచ్చి పెళ్ళిచేయటమే కాదు రాజును చేస్తానని ప్రకటించింది రాజసింహం. రాజ్యం చేరినప్పటి నుంచీ మన భార్యాభర్తలం'

కోపంగా, అసహ్యంగా మేకవైపు చూసింది సింహం. 'ఇది తన భర్తనా?' మీదపడి పుటుక్కున దాని మెడ కొరికేయాలనుకుంది. కానీ దాని బలం గుర్తొచ్చింది ఈ మేకను పెళ్ళి చేసుకోవటం కన్నా ఆ రాక్షసుల దగ్గరే ఉండటం మేలనిపించింది. కానీ ఏం చేస్తుంది?

నది దాటారు. ఇద్దరూ మొసలికి చేయి ఊపారు. ఇంతలో ఓ సింహం మొసలిపైకి దూకింది. క్షణాల్లో దాన్ని చీల్చి చెండాడింది. 'ఏయ్. దాన్ని ఎందుకు చంపావు? అది మాకు సహాయం చేసింది' ఆయుధాన్ని సిద్ధంగా పట్టుకుని అరిచింది వీరమేక.

గర్జించింది సింహం. 'నాకు తెలుసు నువ్వు రాకుమారిని రక్షిస్తావని. అందుకే నీకు తెలియకుండా నిన్ను వెంబడించాను. ఇప్పుడు నిన్ను చంపుతాను. రాకుమారిని రక్షించింది నేనే. రాకుమారీ నాదే రాజ్యంనాదే' అంది సింహం.

'సత్యమే గెలుస్తుంది నువ్వు చెప్పింది అబద్ధం నువ్వు గెలవలేవు' ఆయుధాన్ని ఊపుతూ అరిచింది వీరమేక.

'సత్యానికి సాక్ష్యాలు కావాలి. నువ్వు మేకవి. నువ్వు పోయి రాక్షసుడి నుంచి సింహాన్ని రక్షించావంటే ఎవ్వరూ నమ్మరు. సాక్ష్యాలేవి?'

'నాకు సహాయం చేసిన వారంతా ఉన్నారు. వారే సాక్ష్యం'

'హ్హా..హ్హా..హ్హా.. వారందరినీ నీ వెనకే నేను చంపుతూ వచ్చాను. ఇదిగో ఈ మొసలితో నీ చివరి సాక్ష్యం ఖతం'

'రాకుమారి నాకు సాక్ష్యం. ఇతర సాక్షులు అవసరంలేదు' అంది మేక. మేక మాట పూర్తికాకముందే రాకుమారి సింహం వెనుక నుంచి మేకవైపు దూకింది. దాని మెడను పట్టుకుని కొరికింది. వీరమేక చేతిలోంచి ఆయుధం జారిపడింది. వెంటనే ఇంకో సింహం మేక మీదకు దూకింది.

కాబోయే భార్యాభర్తలు, రాజు, రాణులిద్దరూ కలిసి వీరమేకను కడుపు నిండా పంచుకుని తిన్నాయి.

ప్రజల జయజయధ్వనుల నడుమ తమ రాజ్యంలో అడుగుపెట్టాయి.

అలా పూర్తయింది సింహాన్ని పెళ్ళాడాలని ప్రయత్నించిన వీరమేక కథ, భావితరాలకు గుణపాఠం నేర్పుతూ.

## *చెలగాటాలు - ప్రాణసంకటాలు*

**'వెళ్ళొద్దు. మనల్ని పిలవలేదు.** మనం వెళ్ళవద్దు. పిలవని ఆటలకు పోవద్దు' కోపంగా అంది తల్లి మేక.

బుంగమూతి పెట్టి అందంగా చూసింది పిల్లమేక తల్లివైపు. 'ఎందుకమ్మా ఎక్కడికీ వెళ్ళవద్దంటావు?' అడిగింది.

తల్లి మేక నిట్టూర్చింది 'నీకు తెలియదే నీకు అర్థం అయ్యేసరికి ఆలస్యం అయిపోతుంది. పెద్దదాన్ని. నీకన్నా ఎక్కువ ప్రపంచం చూసినదాన్ని. అనుభవంతో చెప్తున్నాను. నా మాట వినే'

పిల్లమేక స్వభావం తల్లిమేకకు తెలుసు. తన పిల్లమేక ఇతర మేకలన్నిటికన్నా భిన్నమైనదనీ తల్లి మేకకు తెలుసు.

పిల్లమేక చాలా చురుకయినది. ఏదైనా కావాలంటే దాన్ని సాధించేందాకా వదలదు. ఎటైనా వెళ్ళవద్దంటే అటు వెళ్ళి తీరుతుంది. దాని అడగటం కూడా అభ్యర్థిస్తున్నట్టుండదు. 'వెళ్తున్నా' అంటుంది. వద్దనేలోగా వెళ్ళిపోతుంది. దాని కదలికలు ఎంత వేగంగా ఉంటాయంటే తల్లి మేకకు ఆశ్చర్యం కలుగుతూంటుంది. ఆనందం కలుగుతూంటుంది. కానీ భయం, బాధలు కూడా కలుగుతూంటాయి. దాని చురుకుదనం ఇక్కడ దానికి ఎలాంటి ముప్పు తెస్తుందోనన్నది తల్లిమేక భయం.

అందులో ఇప్పుడు అడవి అంతా సందడి సందడిగా ఉంది. అడవిలో జంతువుల ఆటల పోటీలు జరుగుతున్నాయి. ఏ జంతువు సర్వశ్రేష్టమైనదో తెల్సుకోవాల్నని జరుగుతున్నాయా పోటీలు.

అందరికీ తెలుసు. పులులు, సింహాలు అన్నిటినీ గెలుస్తాయని. కానీ ఏనుగులు, పులులు, సింహాలను కొన్నిటిలో ఓడించగలవు. తోడేళ్ళు, నక్కలు కొన్ని అంశాలలో సింహాలకన్నా మిన్న. దాంతో ఓ పది పదిహేను రకాల పోటీలను నిర్ణయించి అధికమైన పోటీల్లో గెలుపొందిన జంతువు సర్వశ్రేష్టమైనదని నిర్ణయించాయి పోటీలను నిర్వహిస్తున్నాయి.

'ఇలా పోటీలను నిర్వహిస్తున్నారు, మీరూ పాల్గొనాలి' అని నక్కలు వర్తమానం తేగానే మేకలన్నీ ఆలోచించాయి. 'ఇందులో కుట ఏమైనా ఉందేమో'నని.

తీరా చూస్తే ఆ పోటీల్లో ఏ పోటీలోనూ మేకలకు కనీసం పాల్గొనే అవకాశం కూడా లేదు.

అవి ఇలా చర్చించుకుంటుండగానే పిల్లమేక పైకి అనేసింది. 'అరే, ఈ పోటీల్లో చెట్ల ఆకులు వేగంగా తినే పోటీలేదు. చెప్పిన మాట ఎవరు బాగా వింటారో పోటీలేదు. అయినా ఇవన్నీ శారీరక శక్తికి సంబంధించిన పోటీలు, తెలివిపోటీలు లేవు.'

దాంతో ఒక్కసారిగా అందరూ భయపడ్డారు. నక్క సంగతి అందరికీ తెలుసు జిత్తుల మారితనంలో పోటీ ఉంటే నక్కని దేవుడు కూడా గెలవలేడని. అది ఈ మాట పోయి సింహాలకు చెప్తుంది. సింహాలకు కోపం వస్తుంది. మేకల పని పడతాయవి. అందుకని అన్నీ కలసి పిల్ల మేకను మందలించాయి.

'ఏవో పెద్ద జంతువులన్నీ ఉబలాట పడి పోటీ పడుతున్నాయి. వాటి ఉబలాటాన్ని తీర్చుకోనీ. మనం చిన్న బలహీనమైన జంతువులం. పెద్దవాళ్ళ పనులు మనకెందుకు?' అంది పెద్దమేక.

పిల్లమేక నోరాగలేదు 'పెద్ద జంతువులయితే ఈ ఆటలు, పోటీలెందుకు ప్రతి జంతువులకి ఏదో ఓ ప్రత్యేకత ఉంటుందని తెలుసుగా? నాలాగా 'మే' అని ఏ జంతువయినా అరవగలదా? మన 'మే అరుపు పోటీ ఎందుకు లేదు? అయినా దేవుడు అందరినీ సమానంగా సృష్టించాడంటారు కదా! అలాంటప్పుడు ఈ హెచ్చుతగ్గుల పోటీలెందుకు?'

తల్లిమేక బలవంతాన పిల్లమేక నోరుమూసి దూరం లాక్కెళ్ళింది. కానీ అప్పటికే అడవంతా పిల్లమేక మాటలు చిలవలు పలవలుగా మారి ప్రచారమయి పోయాయి 'పులులు, సింహాలు, ఏనుగులకు తెలివి లేదంది పిల్లమేక. దానితో ఎవ్వరూ పోటీపడలేవంది' అంటూ ప్రచారమయింది.

'మేకలు, మేకలలో పిల్లమేక తప్ప ఇతర జీవి ఏ జీవికీ తెలివిలేదంది పిల్లమేక' అన్నమాట అడవిలో అలా అలా మోయసాగింది.

అందుకే ఆటల పోటీలు చూడటానికి పిల్లమేక వెళ్తానంటే తల్లిమేక అభ్యంతరం చెప్తోంది. అక్కడ పగబట్టిన పులులు, సింహాలు ఏదైనా హాని తలపెడతాయని తల్లిమేక భయం.

తల్లి మాటలు పిల్లమేక విన్నట్టే కనిపించింది. ఓ మూలకు వెళ్ళి చెట్లు ఆకులు నమలటం ఆరంభించింది.

అది చూసి తల్లిమేక నిట్టూర్చింది. తన పని చూసుకోసాగింది.

ఆలోచిస్తూ ఆకులు తింటున్న పిల్లమేక ఉలిక్కిపడింది. ఎవరో కాలిని గోకుతున్నట్టనిపించింది. కళ్ళు చికిలించి చూసింది. చెట్ల పొదల నడుమనుంచి ఉడత తల బయట పెట్టి వెక్కిరించింది.

పిల్లమేకకు కోపం వచ్చింది.

తనని చూడగానే, అలికిడి వినగానే భయపడి, ప్రాణాలు అరచేత పెట్టుకుని పరుగెత్తే ఉడత, బుడ్డి ఉడత, తనకాలు గీరుతుందా?

గాలిని బలంగా పీల్చి, కళ్ళెర్ర చేసి, కొమ్ములు వంచి ఉడత వైపు చూసింది. గలగల నవ్వింది ఉడుత. 'భలే మంచి మాటన్నావ్ పిల్ల మేక! మా అంతవేగంగా తినేవాడు, పరుగెత్తేవాడు ఎవరయినా ఉన్నారు? పులులకు పళ్ళతో చీల్చటానికి ఎంతో సమయం పడుతుంది. అదే నేను రెండు చేతుల్లో పట్టుకుని కటకట నమిలి గుటగుట మిగేస్తాను. మనతో పోటీపడటానికి భయపడి మనల్ని చిన్న జంతువులని పక్కకు నెట్టేస్తున్నాయి. అవే పోటీల్లో పాల్గొని బహుమతులు పొంది సంబరాలు చేసుకుని విర్రవీగుతున్నాయి.'

ఉడుత మాటలు విన్న మేకకు నవ్వు వచ్చింది. ఏదో అనబోయింది, ఇంతలో 'కిచకిచ'మంటూ శబ్దం వినిపించింది. చెట్టుపైన కొమ్మలు కదిలాయి.

ఉడుత గబుక్కున కలుగులో దూరిపోయింది. పిల్లమేక పరుగెత్తటానికి సిద్ధమైంది.

'భయపడకండి. నేను పిల్లకోతి బావను' అన్న మాటలు వినిపించటంతో ఆగింది. ఉడుత తల బయట పెట్టి చూసింది.

'నిజం చెప్పు మేకపిల్ల, నాలాగా చెట్లకొమ్మలను పట్టుకుని ఎవరైనా ఊగగలరా? ఎలాంటి స్థంభానయినా, ఎత్తులనయినా నాలా దూకుతూ ఎక్కగలరా? నాలాంటి అల్లరి పనులెవరయినా చేయగలరా?' అడిగింది.

మేక ఏదో సమాధానం ఇవ్వబోయింది. కాలు చుర్రుమనటంతో 'మే' అని క్రిందకు చూసింది.

ఎర్రగా నిగనిగలాడుతూ, వెనక రెండు కాళ్ళమీద నుంచుని ఎర్రటి చీమ కనిపించింది.

'నన్నెందుకు కుట్టావ్' కోపంగా అడిగింది మేక.

'నా బంగారు పుట్టలో వేలు పెట్టినందుకు?' అంది చీమ నవ్వుతూ. కోతి కిచకిచమంది. ఉడుత 'కీకీ' మంది.

'ఇంకోసారి కుడితే?' కోపంగా అంది మేక. దాని మాట పూర్తికాకముందే ఇంకో చీమ వెనుక కాలివైపు కుట్టింది.

'ఏయ్' అని అటు తిరిగేలోగా, ఇంకో చీమ మరోవైపు కుట్టింది.

'మే' అని అటు తిరిగేలోగా, ఇంకో చీమ మరోవైపు కుట్టింది.

'మే' అని అరుస్తూ ఒళ్ళంతా దులుపుకోసాగింది పిల్లమేక.

చీమలు, ఉడత, కోతులు పగలబడి నవ్వాయి.

పిల్లమేకకు కోపం వచ్చింది. కొమ్మతో చీమను పొడవాలని చూసింది. చీమ అందలేదు. కానీ కొమ్మకి మట్టి అంటింది.

కిలకిలా నవ్వుతూ అంది చీమ' ఏ పిల్లమేకా.. నా చీమకాటు సంగతి నీకు తెలియదు. మేం తలచుకుంటే ఏనుగు శవాన్నే కన్నుమూసి తెరిచేలోగా, దంతాలతో సహా చిన్న చిన్న ముక్కలు చేసి కరిగించేసి, ఆరగించేసుకోగలం. మాకన్నా గొప్పవా మేకలు, పులులు? తాము తినగా మిగిలిందాన్ని వదిలేసిపోయే అశుభ్రమైన బద్ధకపు తిండి విలువ తెలియని జీలలు. శరీరం ఉంటే సరా? ఎంత క్రౌర్యం ఉంటే అంత గొప్పనా? మేం తలచుకుంటే ఏనుగును కూడా చికాకు పెట్టి చంపి, తొండంలోంచి దూరి తోకలోంచి బయటకు వస్తాం. ఈ పెద్ద జంతువులు అహంకారంతో మమ్మల్ని పరిగణలోనికి తీసుకోకుండా పోటీలు పెట్టుకున్నాయి. 'కోపంగా అంది చీమ. అసలే ఎర్రచీమ. కోపంతో కణకణమండే నిప్పుకణంలా భుగభుగలాడుతోంది అది.

ఇంతలో జుయ్ మంటూ ఓ దోమ పిల్లమేక చెవి దగ్గర పాటపాడసాగింది. పిల్లమేక ఎంత ప్రయత్నించినా దూరం పోవటంలేదు అది. ఆ చెవి, కాకపోతే ఈ చెవి దగ్గర వచ్చి గాలిలో తేలుతూ పాటపాడసాగింది.

పిల్లమేక నేలమీద పడిపొర్లింది. ఆకులతో చెవులు మూసుకుంది. కానీ దోమ వదలలేదు. దోమ, మేకను పెడుతున్న చికాకును చూసి చీమలతో సహా మిగతా అన్నీ పడీపడీ పొర్లి పొర్లి నవ్వసాగాయి.

చివరికి మేక, దోమకు దండం పెట్టింది. 'నన్నొదిలెయ్ దోమశ్రేష్టా. నీకేం కావాలో చెప్పు?' అడిగింది.

దోమలన్నీ 'గుయ్ గుయ్'మని చప్పట్లు చరిచాయి.

'చూడు. నన్ను మించి పాటలు చెవుల్లో పాడి చికాకు పెట్టే జీవి ఏదైనా ఉందా? పైగా నేను కుడితే, కొట్టుకుంటే బాగుంటుంది కానీ నేను పంపే రక్తం క్రిములతో వాళ్ళు ఛస్తారు. కానీ నాకేంకాదు చెప్పు ఇలా పాటలు పాడే, కుట్టే పోటీలు లేకుండా నన్ను అవమానించినట్టుకాదా?'

ఏదో అనబోయి పిల్లమేక ఆగిపోయింది. దాని ముఖం నవ్వుతో వెలిగిపోయింది. 'మే..మే..' అని ఏదో దృశ్యాన్ని ఊహిస్తూ, చూస్తున్న అనుభూతిని పొందుతూ పొర్లి పొర్లి నవ్వటం ఆరంభించింది మేక.

'ఏమిటేమిట'ని అందరూ గుమికూడారు.

తన ఊహను చెప్పింది మేక. అన్నీ వాటి వాటి స్థాయిలో నవ్వటం ప్రారంభించాయి. కోతి అయితే ఈ చెట్టు కొమ్మ మీద నుంచి ఆ కొమ్మ మీదకు దూకి వ్రేలాడుతూ, ఒళ్ళు బరబర గోక్కుంటూ పరపర నవ్వసాగింది.

జంతువులలో శ్రేష్ఠమైన జంతువేదో నిర్ణయించే ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి.

వేగంగా దూరం పరుగెత్తటంలో జింకలు, గుర్రాలు, చిఱుతలు, పులులకు గట్టిపోటీనిచ్చాయి కానీ, అవి తమని దాటి వెళ్తూంటే భరించలేని పులులు జింకలను గుర్రాలను చిఱుతలు చీల్చివేశాయి. గెలిచాయి.

బరువులెత్తటంలో ఏనుగు అవలీలగా గెలిచింది. అడ్డుపడబోయిన పులిని తొండంతో ఎత్తి దూరం విసిరేసింది.

ఇంతలో మైదానం మధ్యలో మేకను తెచ్చి కట్టేశారు. దాన్ని ఎవరు అందుకుంటే వారు గెలిచినట్టు. పులులు, సింహాలు, ఏనుగులు, తోడేళ్ళు, నక్కలు, కుక్కలు పరుగు ఆరంభించాయి.

ఇంతలో పరుగెత్తుతున్న కుక్కలు ఆగిపోయి తోకతో ఒంటిని కొట్టుకోసాగాయి. కూచుండిపోయి వెనక్కి తిరిగి, తమ శరీరాన్ని తామే కరచుకోసాగాయి.

పరుగెత్తుతున్న తోడేళ్ళు ఆగిపోయి నేలమీదపడి పొర్లుతూ ఒంటిని నేలకు గీసి దురద తీర్చుకోవాలని తీవ్రంగా ప్రయత్నాలు ఆరంభించాయి.

పరుగులిడుతున్న పులులు తమపై దట్టమైన నల్లటి మేఘంలా ముసిరిన ఈగలను తరమటంలో పడిపోయాయి.

ఎక్కడినుంచో ఎగిరి మైదానంలోకి దూకిన కోతులు ఏనుగుల తొండాలను, దంతాలను పట్టుకుని వ్రేలాడసాగాయి.

ఏనుగులు చిరాకుతో తొండం విసిరితే పట్టుతప్పినవి ఎగిరి ఏనుగుమీదకు దూకి ఏనుగు వీపుమీద ఏవేవో ఏరుకుంటూ ఒకటికొకటి తినిపించుకోసాగాయి.

ఖాళీగా ఉన్న తొండంపై మరిన్ని కోతులు దూకాయి.

దాంతో ఏనుగులు కోతులను వదల్చుకోవటానికి క్రిందపడి పొర్లసాగాయి. అది పొర్లినప్పుడు ఎగిరి మళ్ళీ దానిపైకి దూకసాగాయి కోతులు.

పరుగులిడుతున్న సింహాల కాళ్ళకి ఉడతలు అడ్డం పడసాగాయి. వాటిని తప్పించుకోవాలని ప్రయత్నించిన సింహాలు క్రిందపడ్డాయి. వెనకే వేగంగా పరుగుపెట్టి వస్తున్న జంతువులు వీటిని తట్టుకుని పడ్డాయి.

దాంతో చూస్తూ చూస్తూ మైదానమంతా రణరంగంలా, హాస్య ప్రాంగణంలా తయారయింది. క్రిందపడుతున్న జంతువులు, పొర్లుతున్న జంతువులు, చెవులు కప్పుకుని దొర్లుతున్న జంతువులు, ఇలా పరుగుపందేలు క్షణాలలో పొర్లుపందేలుగా మారిపోయాయి.

ఇదంతా నవ్వుతూ చూస్తున్న ప్రేక్షక జంతువులు హాహాకారాలు పెట్టటం ఆరంభించాయి.

ఓ దోమల దండు పైనుంచి, చీమల దండు క్రిందనుంచి, తేనెటీగల దండు మధ్యలో దాడి ఆరంభించాయి.

అంతా అయోమయం అలముకుంది.

ఎవరు ఎటు పరుగిడుతున్నారో తెలియదు. ఎవరు ఎటు పొర్లుతున్నారో తెలియదు. తొక్కిడి తొక్కిడి అయిపోయింది.

అంతా గోకుడు శబ్దాలు, గీకుడు శబ్దాలతో నిండిపోయింది. ఏది దొరికితే దానికి వీపు గీకుతూ దురదలు తీర్చుకుంటున్నాయి జంతువులు. చెట్లు ఊగిపోసాగాయి. నేల అరిగిపోసాగింది. కొండలు ఊగిపోసాగాయి. ఈ హడావిడిలో పిల్లమేక పోయి కట్టేసి ఉన్న బలిపశువు మేకను విడిపించింది.

ఏం జరుగుతుందో అర్థమయ్యేలోగా మేకలు రెండూ మైదానం వదలి పారిపోయాయి.

మేకలు, ఈగలు, దోమలు, ఉడతలు, కోతులు, చీమలు అన్నీ పగలబడి నవ్వుకుంటున్నాయి.

ఎవరెవరిని తామెలా పీడించారో చెప్పుకుంటూ అన్నీ నవ్వుకోసాగాయి. ఇంతలో పిల్లమేక పాటపాడటం ఆరంభించింది. అన్ని జంతువులూ వంతపాడటం ఆరంభించాయి.

**మేమే మేక అరిచింది, హుంకరిస్తూ పులిపారిపోయింది.**
**జుయ్ జుయ్ దోమపాడింది, కుయ్ కుయ్‌మని సింహం దొర్లింది.**
**కిచకిచకిత కోతి దూకింది. కచకచకచ ఏనుగు పొర్లింది.**

పాడుకుంటూ నవ్వుకోసాగాయి. జంతువులెలా బాధపడ్డాయో అనుకరించి చూపుతూ పడీపడీ నవ్వసాగాయి.

ఇంతలో ఎవరో వెనకనుంచి వచ్చి పిల్లమేకను తట్టారు.

తిరిగి చూసింది పిల్లమేక. విషాదంగా నుంచుంది తల్లిమేక.

'నిన్ను అడవి వదలి వెళ్ళిపొమ్మంటున్నారు. నువ్విక్కడ ఉండటం నీకేకాదు మొత్తం అన్ని మేకలకూ ప్రమాదం అంటున్నారు. నీకోసం పులులు, సింహాలు, ఏనుగులు, భల్లూలాలు, తోడేళ్ళు, నక్కలు, కుక్కలు, అన్నీ కసితీర్చుకోవటం కోసం వెతుకుతున్నాయట. త్వరగా పారిపో' కన్నీళ్ళు కారుతూంటే చెప్పింది తల్లిమేక.

'అదేంటమ్మా?' అని ఏదో అనబోతున్న పిల్లమేక మాటలకు అడ్డువచ్చింది తల్లిమేక.

'నిన్ను అప్పగించాలని మన ముందుకు వర్తమానం వచ్చింది. మందలోకి రాకు. ఇటునుంచే ఎటైనా పో. నీకు చెపుతూనే ఉన్నాను. అనవసరమైన విషయాల్లో జోక్యం చేసుకోవద్దని.' ఏడవటం ఆరంభించింది తల్లిమేక.

అక్కడంతా నిశ్శబ్దం తాండవించింది.

'మీ అమ్మ చెప్పింది నిజం. నువ్వెటయినా వెళ్ళిపోవటమే మంచిది. మేమైతే ఎలాగోలా తప్పించుకుంటాం. నువ్వు తప్పించుకోవటం కష్టం' అన్నాయి. చీమలు, కోతులు, దోమలతో సహా అక్కడున్న మేక స్నేహితులన్నీ.

ఇంతలో ఒక్కసారిగా అడవి అదిరిపోయింది.

పెద్ద జంతువులన్నీ ఒక్కసారిగా అక్కడ దాడి చేశాయి.

ఏనుగులు తొండాల్లో నింపుకున్న నీళ్ళు చిమ్ముకుంటూ వచ్చాయి. దాంతో చీమలు, దోమలు పారిపోయాయి.

ఉడతలు కలుగుల్లో దూరిపోయాయి.

కోతులు దాడులు చేయకుండా తోడేళ్ళు, నక్కలు చెట్లను కాపలా కాశాయి.

ఇదంతా చూసిన పిల్ల మేక వణికిపోయింది.

'పారిపో' అని అరుస్తూ తల్లిమేక సింహం మీదకు దూకింది. తన పంజాతో సింహం తల్లిమేకను చీల్చి పారేసింది.

భయంతో వణుకుతూ కదలలేక ఉన్న స్థలాన్నే నిలిచిపోయింది పిల్లమేక.

సింహాలన్నీ దాన్ని చుట్టుముట్టాయి.

నక్క మధ్యలో దూరింది.

'తొందరపడకండి. దీన్ని మధ్యలో కట్టేస్తాను. మీరంతా దూరం పొండి. మీలో ఎవరు వేగంగా వచ్చి దీన్ని ఒక్క దెబ్బతో చంపుతారో వాళ్ళు గెలిచినట్టు. ఈ పోటీ సింహాలకే. చీల్చిన వాళ్ళు గెలుస్తారు. మిగిలింది ఎవరు వేగంగా పీక్కుతింటారో మేం పోటీలు పడతాం' నాలిక తడుపుకుంటూ అంది నక్క.

వణుకుతున్న మేకను మైదానం మధ్యలో నిలబెట్టారు. సింహాలన్నీ దూరంగా దాని చుట్టూ వలయాకారంలో నిలబడ్డాయి.

ఏనుగులు ఒకేసారి తొండాలు ఎత్తి ఘీంకరించాయి.

సింహాలు నలువైపులనుండి మేకవైపు లంఘించాయి.

## వరాలమేక

**ప్రత్యక్షమైన దేవుడు అయోమయంగా** చుట్టూ చూశాడు. ఎవరిదో ఆత్మ తన దర్శనం కోసం ఘోషించే ఘోష భరించలేక లక్ష్మీదేవి కొంగు కూడా విడవకుండా పరుగెత్తుకుని భూమి మీదకు వచ్చేశాడు దేవుడు.

అయితే ఆ కవి ఎవరో వర్ణించినట్లు లక్ష్మీదేవి కొంగు కోసం వెంటపడి రాలేదు. ఆధునిక కాల లక్షణాల్ని అనుసరించి కొంగును చింపి పారేసి పైనే ఉండిపోయింది.

ఆ కొంగు ముక్కను చిరాగ్గా విసిరివేసాడు దేవుడు.

ఈ మధ్య ఎవ్వరూ తనని తలవటంలేదు. కలవటంలేదు. తన దర్శనం కోసం తపస్సు చేయటంలేదు. అలాంటిది ఏదో ఆత్మ తనకోసం తపస్సు చేస్తున్నట్టు తెలియగానే దర్శనమిచ్చి, కోరికలు ప్రసాదించాలని పరుగెత్తుకు వస్తే ఎవ్వరూ కనిపించటంలేదు.

తానిక రాడని, తానులేడని నిశ్చయించుకున్న మానవుడు తపస్సు వదిలి భోగాలనుభవించాలని, బ్రతికి ఉన్నంతకాలం సుఖాల్లో బ్రతకాలని వెళ్ళిపోయాడా? దేవుడికేమీ బోధపడలేదు.

వెళ్ళిపోదామనుకుంటుంటే అతడి దృష్టి ఆ వైపు పడింది. కళ్ళు నులుముకుని చూశాడు. దివ్యనేత్రాలను గబగబా రుద్ది మరీ చూశాడు.

అదే కనిపిస్తోంది.

'మే....మే...' అంటూ ఓ మేక.

దేవుడి మనస్సును నిరాశ ఆవరించింది.

అన్ని జన్మల్లోకీ మానవ జన్మ అత్యుత్తమమైనది. అన్ని జీవుల్లోకీ మనిషి ఒక్కడే దైవదర్శనం పొందగల ధన్యుడు.

అలాంటి మానవుడు తనలోని దివ్యజ్యోతి ధ్యాసనే విస్మరించి లౌకిక వాంఛలు తుచ్ఛమైన కోరికల సాధననే అసలు జీవిత లక్ష్యం అంటూ మాయలో మునిగిపోతూంటే, ఈ అల్పజీవి తన కోసం తపస్సు చేసిందా?

దేవుడు నమ్మలేకపోయాడు.

కానీ నమ్మాల్సి వస్తోంది.

తనకందిన తరంగాల ప్రకారం ఇక్కడి ఆత్మ తపస్సు చేసింది. అక్కడ ఉన్నది మేక.

దేన్నయినా ఆశిస్తే, అది లభ్యం కాకపోతే నిరాశ చెందుతాం. దేన్నీ ఆశించకపోతే ఆశలేదు. నిరాశలేదు. తాను మనిషిని ఆశిస్తూ వచ్చాడు. మేక కనిపించింది. అదీ నిరాశకు కారణం.

వెంటనే నిరాశను అణచి, మనసునిండా ప్రేమను నింపుకుని 'ఓయీ మేకా, నువ్వేనా నా గురించి తపస్సు చేసింది?' అడిగాడు దేవుడు.

'మే' అంది మేక 'అవునన్న'ట్టు.

నిట్టూర్చాడు దేవుడు.

ఇది లోకం రీతి. సృష్టిలో సమతౌల్యం ఉండాలి. మనిషి మూర్ఖుడై పశువు అవుతున్నప్పుడు, పశువులు పశుత్వం వదలి మానవత్వం స్వీకరించాలి. అప్పుడే సమతౌల్యం ఉంటుంది సృష్టిలో.

'ఏం కోరి తపస్సు చేశావు?' అడిగాడు దేవుడు.

'మేమేమే..' అంది మేక.

దేవుడికి అర్థం కాలేదు. దాని మనసులో మాట గ్రహించే ఇంద్రియం మూత తెరిచాడు.

'నాకు మూడు వరాలు కావాలి' అంది మేక.

'నువ్వు చేసిన తపస్సుకు మూడు వరాలు పొందే అర్హతలేదు. అసలు నీకు తపస్సు చేసే అర్హత లేదు. ' అన్నాడు దేవుడు.

'ఇది అన్యాయం. సృష్టిలో జీవులన్నీ సమానం, దైవప్రయోరూపం అన్నప్పుడు మేకకెందుకు తపస్సు చేసే అర్హత ఉండదు?' నిలదీసింది మేక.

మాటలకోసం తడుముకున్నాడు దేవుడు.

చివరికి మేక తీక్షణ చూపులకు తలవంచుకుని 'సరే.. నీకేం కావాలో చెప్పు. కానీ మూడు కోరికలు కావాలంటే మాత్రం నువ్వు చేసిన తపస్సు సరిపోదు' అన్నాడు.

'ఎందుకని సరిపోదు? సరిపోకపోతే ఏ దేవుడేడ్చాడని తొందరపడి దర్శనమిచ్చావు? నాకు మూడు కోరికలు కావాలి. ఇస్తే ఇవ్వు. లేకపోతే ఫో. నేను మళ్ళీ తపస్సు చేస్తాను. మూడు కోరికలకు సరిపడ తపస్సు పూర్తికాగానే రా' మళ్ళీ తపస్సుకు కూర్చోబోయింది మేక.

దేవుడు ఆలోచించాడు. ఇదేదో మొండిఘటంలా ఉంది. ఇప్పుడు వెళ్ళిపోయి, మళ్ళీ కొంత కాలానికి వెనక్కి వచ్చి కోరికలు తీర్చటం కన్నా, ఇప్పుడే దీని కోరికలు తీర్చేస్తే, తనకు శ్రమ తప్పుతుంది, సమయం వ్యర్థం కాకుండా ఉంటుంది అనుకున్నాడు.

'కానీ తానేర్పరచిన నియమాలను తానే ఉల్లంఘించేది నేనే అయినప్పుడు ఆ ఉల్లంఘనే కొత్త నియమం అయిపోతుంది' అనుకున్నాడు దేవుడు.

'సరే మూడేమూడు కోరికలు కోరుకో' అన్నాడు.

మేక నవ్వింది 'అందరూ నన్ను రాజుగా అంగీకరించి, స్వీకరించాలి. ఇది మొదటి కోరిక.'

'కుదరదు' అన్నాడు దేవుడు.

'నేను మళ్ళీ తపస్సు చేస్తా' అంది మేక.

'సరే.. చెయ్యి' అని వెనుతిరిగాడు దేవుడు.

'ఉండు.. ఉండు' అరిచింది మేక. దేవుడు ఇంత దూరం వచ్చాక ఉట్టిచేతులతో మిగిలి పోవటం మేకకు నచ్చలేదు. పైగా, మళ్ళీ తపస్సు చేయాలంటే కూడా దానికి బద్ధకంగా ఉంది.

'సరే.. నా కోరికను మారుస్తాను.. ప్రపంచంలోని మేకల మందలకు నేనే రాజునవ్వాలి' అంది మేక.

'తథాస్తు. రెండో కోరిక?'

ఆలోచించింది మేక. 'మా మందలోని ఆడమేకలన్నీ నేనంటే పడి చచ్చిపోవాలి' సంతోషంగా అంది మేక.

'తథాస్తు' అన్నాడు దేవుడు సంతోషిస్తూ, 'చచ్చింది మేక' అనుకున్నాడు మనసులో. ఎంతెంత వారో లైంగిక తృష్ణకు లొంగిపోయి దిగజారి పాతాళంలో అంట్ల పాత్రల్లోంచి మెతుకులు ఏరుకుని తింటూ బ్రతకటం దేవుడికి అనుభవమే.

'మూడో కోరిక ఏమిటి?' అడిగాడు దేవుడు.

దేవుడి సంతోషం చూస్తే మేకకు అనుమానం వచ్చింది. తానెక్కడో, ఏదో పొరపాటు చేసిందని అర్ధమయింది.

దేవుడు నక్కజిత్తులవాడని మేకకు అందరూ చెప్పారు. దేవుడు ఒక చేత్తో ఇచ్చినట్టు ఇచ్చి పదిచేతుల్తో లాగేసుకుంటాడనీ చెప్పారు. అందుకే చాలాసేపు ఆలోచించి అడిగింది.

'నాకు చావుండకూడదు.'

తల అడ్డంగా ఊపాడు దేవుడు.

'ప్రకృతి విరుద్ధమైన కోరిక ఇచ్చే శక్తి నాకు లేదు. నువ్వు దానికోసం సృష్టించే దేవుడికోసం తపస్సు చేయాలి. సృష్టి నియమాలను మార్చే శక్తి ఆయనకే ఉంది. ఆయన ఏర్పరచిన నియమ పాలన చేయటం మాత్రమే నా విధి' అన్నాడు దేవుడు. మేక బలహీనతకు దేవుడు కనిపెట్టేశాడు.

'మేక ఆలోచించింది. 'అయితే నాకు నక్క, కుక్క, తోడేలు, భల్లూకం, పులి, చిరుత, సింహం, ఏనుగు వంటి అడవి క్రూర జంతువుల వల్ల చావురాకూడదు.'

ఒక్క క్షణం ఆలోచించాడు దేవుడు. 'తథాస్తు' అన్నాడు. అదృశ్యం అయిపోయాడు.

గర్వంగా ఛాతీ విరుచుకుని, తలెత్తుకుని అడవిలో ప్రవేశించింది మేక.

దాన్ని చూస్తూ మీదకు దూకిన పులులు, పిల్లులై భయభక్తులతో వెనక్కు మళ్ళుతున్నాయి.

మేకను కొరికిన ఓ సింహం పళ్ళూడిపోయాయి. మేకను తొక్కిన ఏనుగు కాళ్ళు విరిగిపోయాయి. భల్లూకం గోళ్ళూడిపోయాయి.

దాంతో అడవి అంతా 'మేక' గురించిన వార్త కార్చిచ్చులా వ్యాపించింది. మేకలన్నీ సంతోషంతో నృత్యం చేస్తూ దైవాన్ని చూసిన మేకను చుట్టుముట్టాయి. 'నీవే మా రాజువు' అన్నాయి.

మేక గర్వంగా తల ఊపింది. దాని దృష్టి మందలో సంతోషంగా నృత్యం చేస్తున్న ఓ యువతి మేకపై పడింది.

దాన్ని పిలిచింది.

నృత్యం చేస్తూ ఆ యువతి మేక రాజు మేక దగ్గరకు వచ్చింది. రాజు మేక ఆ యువతి మేకను పొదివి పట్టుకుంది.

'ఎంత అందంగా ఉన్నావు? నా రాణివి అవుతావా?' అడిగింది రాజుమేక.

'నేనా? నేను...' అని ఏదో అనబోయిన యువతి మేక, విచిత్రంగా చూసింది రాజు మేకవైపు. అంతలోనే కళ్ళు తేలేసింది. పడి చచ్చిపోయింది. క్షణంలో మేకలన్నీ హాహాకారాలు చేశాయి. చచ్చిన యువతి మేక చుట్టూ చేరి బిగ్గరగా రోదించసాగాయి.

ఏం జరిగిందో రాజు మేకకు అర్థం కాలేదు. తన చేతులవైపు చూసుకుంది. మామూలుగానే ఉన్నాయి. మరెందుకు మేక చచ్చిపోయింది.

అంతలో రాజు మేకకు గుర్తుకు వచ్చింది 'మే' అని ఆక్రోశంతో, కోపంతో అరిచింది.

తాను కోరిన రెండవ కోరిక 'నేనంటే పడి చచ్చిపోవాలి ఆడమేకలు'.

'నేను' అనగానే చచ్చిపోయింది యువ మేక.

'దేవుడా నువ్వెంత జిత్తులమారివి?' పళ్ళు పటపటలాడించింది రాజుమేక. వెంటనే 'నేను' అన్న పదం వాడవద్దని, మేకలన్నీ ముఖ్యంగా ఆడ మేకలు, చాటింపు వేయించింది.

తన రాజ్యంలో 'నేను' అన్న పదాన్ని నిషేధించింది.

కానీ అదేం ఆశ్చర్యమో, రాజు మేక దగ్గరకు వచ్చిన ప్రతి ఆడమేక పడి చచ్చిపోసాగింది.

దేవుడు చేసిన మోసం రాజు మేకకు అర్థమయింది. ఇక బ్రతికి ఉన్నన్నాళ్ళు తాను మరో ఆడమేకను తాకలేనని అర్థమయింది. అంతేకాదు, తనకు బావుండదనీ, తనకు వారసుడూ ఉండడని, ఎన్ని ఏళ్ళు బ్రతికినా తాను ఎలాంటి సౌఖ్యమూ లేక, అర్థవిహీనమైన బ్రతుకు గడపాలనీ రాజు మేకకు అర్థమయింది.

దాంతో రాజు మేకలో ఓ నిస్పృహ, ఓ రకమైన కసి బయలుదేరాయి. వెంటనే అది మేకల సైన్యం తయారుచేసి, అడవిలో ఇతర జంతువులపై విరుచుకు పడటం ఆరంభించింది.

దానికి చావు లేదు. కాబట్టి ఇతర జంతువులు పారిపోవటం ఆరంభించాయి. అయితే.. ఇతర మేకలు రాజు మేకలా వరం పొందినవి కావు. దాంతో అవి చచ్చేవి.

అది రాజుమేకకు ఎంతో సంతృప్తినిచ్చేది. తను పొందలేని సౌఖ్యం తన ప్రజలు ఎలా పొందుతారు? తాను అనుభవించలేని ఆనందం ఇతర మేకలు ఎలా అనుభవిస్తాయి?

దాంతో పనికట్టుకుని తన రాజ్యంలో ఆడ - మగ మేకలు కలవకూడదని నిషేధాన్ని విధించింది. నియమోల్లంఘనకు మరణశిక్ష విధించింది. తన నిర్ణయాలకు ఇతర మేకలు అల్లల్లాడిపోవటం, తనను చూసి క్రూర జంతువులు పారిపోవటం రాజుమేకకు సంతృప్తినిచ్చేది. దాంతో మరింత క్రూరంగా వ్యవహరించేది.

అంతా విన్న దేవుడు నిర్లిప్తంగా తలాడించాడు. 'తపస్సు చేసింది వరం పొందింది. అనుభవిస్తోంది. నేనేం చేయలేను' అన్నాడు.

'అలాకాదు .. తాను పొందిన వరాల వల్ల విర్రవీగుతూ మేక అల్లకల్లోలం సృష్టిస్తోంది. అడవిలోని క్రూర మృగాలు దాన్ని ఏమీ చేయలేక పోవటంతో దాదాపుగా అడవిలో ఎదురులేక, మకుటం లేని మహరాజులా వ్యవహరిస్తోంది మేక.

క్రూరమృగాలు మేక భయంతో అడవిని వదలి నగరాలపై పడుతున్నాయి. దాంతో నగరంలోని మనుషులు భయభ్రాంతులవుతున్నారు. రాజుమేక తీసుకున్న నిర్ణయాల వల్ల అడవిలో మేకల సంతతి తగ్గిపోతోంది. అది మేకల్ని కలవనివ్వటంలేదు.

అడవిలో మేకల సంఖ్య తగ్గిపోవడంతో, క్రూరమృగాలు నగరాలపై పడుతూండటంతో నగరంలో మేకలు అడవి చేరి రాజు మేక శరణు వేడుతున్నాయి. మీరిచ్చిన వరాల వల్ల సృష్టి అల్లకల్లోలం అయిపోతోంది. ఇలాగే కొనసాగితే ప్రపంచంలో ఏ జీవులుంటాయో, ఏవి ఉండవో చెప్పటం కష్టంగా ఉంది. ఏది ఏమైనా ఈ రాజుమేక ఒక్కటి మిగిలి ఉండేట్టుంది.' ఋషులు, ఆయా జంతువుల రక్షకులయిన దేవుళ్ళు చెప్పునవన్నీ నిర్లిప్తంగా విన్నాడు దేవుడు. వాళ్ళ గోడు అంతా విని ప్రశాంతంగా అన్నాడు.

'నేను సృష్టి నియమాలకు వ్యతిరేకమైన వరాలేవీ ఇవ్వలేదు. దాని తపస్సు పుణ్యం అనుభవించిన తరువాత దానికి మూడుతుంది.' అన్నాడు దేవుడు.

'దానిలాగే తపస్సు చేయాలనుకున్న ఇతర జీవులకు అడ్డుపడుతోంది. తపస్సును భగ్నం చేస్తోంది' వాపోయాడు ఏనుగుల దేవత.

నవ్వాడు దేవుడు. 'సృష్టిలో సమతుల్యం ఉంది. అది పుణ్యం చేసింది. పాపాలు చేస్తోంది. ప్రస్తుతం పాపం కన్నా పుణ్యం అధికంగా ఉంది. ఎప్పుడయితే పుణ్యంకన్నా పాపం అధికం అవుతుందో అప్పుడు దానికి మూడుతుంది' ఇక మాట్లాడేదేమీ లేనట్టు ముఖం తిప్పుకున్నాడు దేవుడు.

అందరూ ముఖాలు చూసుకున్నారు. 'కానీ.. దాని పాపం మూడేదెప్పుడు?' అడిగారు.

'సృష్టిలో ఏదన్నా హఠాత్తుగా జరిగిందా? ప్రతీదీ జరగాల్సిన సమయంలోనే జరుగుతుంది. కష్టం వచ్చినప్పుడు క్రుంగక, సుఖం వచ్చినప్పుడు పొంగక, సర్వం భగవదంకితం చేసి చలించకుండా ఉండేవారు విజ్ఞులు' అన్నాడు దేవుడు.

సంభాషణ అంతమయిందని గ్రహించారు. దేవతలంతా వెనుతిరిగారు. వారంతా వెళ్ళిన తరువాత, దేవుడి సగభాగం అంది దేవుడితో 'మీరు దయాళువని అంటారు కానీ చాలా క్రూరులు'.

ప్రశ్నార్థకంగా చూశాడు దేవుడు.

'లేకపోతే మేకకు వరాలిచ్చారా? శాపం ఇచ్చారా? అది చావలేదు. బ్రతికి లాభంలేదు. దానివల్ల ఇతరులు బ్రతకలేరు. ఇంతకీ మీ కార్యానికి, కారణానికి అర్థాలేమిటి?'

చిద్విలాసంగా నవ్వాడు దేవుడు. 'నేను నిమిత్తమాత్రుడిని. సృష్టినియమానుసారం నడుస్తుంది. జీవులకు ఇచ్ఛశక్తి ఉంది. ఆ నియమాలలో ఒదిగి, పరిమితులలో ఒదిగి అవి ప్రవర్తిస్తాయి. అనుభవిస్తాయి. ఇందులో నా క్రౌర్యం ఏమయింది? దయాగుణం ఏమయింది?' అడిగాడు.

అతని సగం మౌనంగా ఉండిపోయింది.

రాను రాను రాజు మేక క్రౌర్యం పెరిగిపోసాగింది. మేకలకు మాత్రమే రాజయినా అది పొందిన వరాలవల్ల సింహాలను, పులులను కూడా శాసించటం ఆరంభించింది. వాటినీ కలవనివ్వటంలేదు. కలిస్తే, తన కొమ్ములతో వాటిని పొడుస్తుంది. అవి తిరిగి కలబడితే వాటికే నష్టం. ఏం చేయాలో తోచటం లేదు జంతువులకు.

ఒక మేక శక్తివంతం అయితే ఇంత అల్లకల్లోలం సృష్టించగలదని ఎవ్వరూ కలలో కూడా అనుకోలేదు.

ఒక జీవి అసలు స్వభావం దానికి అపరిమితమైన శక్తి లభించినప్పుడే తెలుస్తుందని రాజుమేక నిరూపిస్తోంది.

అడవిలో జంతువులన్నిటినీ ఏడ్పిస్తున్నా మేకకు సంతృప్తి కలగలేదు. దాని దృష్టి మనుషులపై పడింది.

మనుషులకూ కబురు పంపింది. తన మాట వింటారా? లేక తన శక్తికి బలవుతారా? తల్చుకోమంది.

తన దూతలా సింహాన్ని, పులినీ పంపింది. ముందుగా ఆడ, మగ కలవటం మానేయాలని హెచ్చరించింది. తన మాట వినకపోతే ఫలితం అనుభవిస్తారన్న బెదిరింపునూ పంపింది.

సింహం, పులుల మాటలు విన్నారు మనుషులు. వాళ్ళకి బోలెడన్ని బెడదలు ఉన్నాయి. బోలెడన్ని సమస్యలున్నాయి. మధ్యలో ఎందుకూ పనికిరాని మేకతో చిరాకేమిటని అనుకున్నారు. కానీ పులులు, సింహాల హెచ్చరికను తేలికగా తీసివేయలేరుకదా! అందుకని ఈ మేక పొగరుకు కారణం కనుక్కోవాలని నిశ్చయించారు.

పులులు, సింహాలు ఏరుకొచ్చి అందించిన ఆకులను నములుతూ ఇంకా ఎవరిని ఏ రకంగా కష్టపెట్టాలని ఆలోచిస్తున్న మేక, భయం భయంగా అడుగుపెట్టిన తోడేలు వైపు ప్రశ్నార్థకంగా చూసింది.

'మీకో విషయం చెప్పాలని వచ్చాను. మీరు విధించిన నియమాతిక్రమణ జరుగుతోంది' అంది తోడేలు.

రాజుమేక కళ్ళు ఎర్రబడ్డాయి. 'ఏమవుతోంది?' అడిగింది కోపంగా.

'రెండు పులులు, ఆడ, మగ రహస్యంగా కలుస్తున్నాయి.' చెప్పింది తోడేలు. దిగ్గున లేచింది మేక. 'ఈ పులులకు బుద్ధిరాదు' అంటూ గబగబా కోపంగా, తోడేలు దారి చూపిస్తోంటే, అనుసరించింది.

నిజంగానే పులులు, రహస్యంగా కలుస్తున్నాయి. తాము కలుస్తున్నట్టు ఎవ్వరికీ తెలియదన్న ధీమాతో ఆనందిస్తున్నాయి.

వాటిని చూడగానే రాజు మేకకు కోపం ఆగలేదు. 'మేఁ....' అని భయంకరంగా అరిచి వాటిమీదకు దూకింది.

ఉలిక్కిపడ్డాయి పులులు.

పులులు తననేమీ చేయలేవని మేకకు తెలుసు. అవి తనకేమైనా అంటే వాటికే నష్టం అని తెలుసు. అందుకని కొమ్ములతో వాటిని పొడిచింది. కానీ పులులు చెదరలేదు. రెండు పులులూ లంఘిస్తున్న మేకను ఒడిసి పట్టుకుని తమ గోళ్ళతో దాన్ని చీల్చివేశాయి.

పూర్తిగా ఆశ్చర్యం అనుభవించకముందే మేకప్రాణాలు గాల్లో కలిసిపోయాయి.

'ఇది అన్యాయం. పులులతో నాకు చావులేదని దేవుడు వరమిచ్చాడు. మరి నన్ను పులులు ఎలా చంపాయి? దేవుడు నన్ను మోసం చేశాడు' ఆక్రోశించింది మేక ఆత్మ.

'దేవుడు ఎవరికీ అన్యాయం చేయడు. క్రిందచూడు' అన్న స్వరం వినిపించింది క్రిందకు చూసింది మేక.

తాము కప్పుకున్న పులితోలు తీసేసి, చేతులనుంచి కత్తులను తొలగించిన ఆడ, మగ మనుషులు ఒకరినొకరు ఆనందంగా కౌగిలించుకున్నారు. వారి చుట్టూ అడవిలోని జంతువులన్నీ నృత్యం చేస్తున్నాయి ఆనందంగా. వాటిల్లో మేకలు కూడా ఉన్నాయి.

## *ఆలోచనల మేక*

**అడవంతా కార్చిచ్చులా వ్యాపించింది ఆ వార్త.** జంతువులన్ని బేధాలు మరచి చెవులు కొరుక్కుంటున్నాయి. 'ఆవార్త నిజమేనా?' అని ఒకదాన్నొకటి అడిగి మరీ నిర్ధారించుకుంటున్నాయి.

ఓ మేకకూ, పులికీ దోస్తీ కుదిరింది!

అది ఎలా కుదిరిందో ఎవరికీ తెలియదు. పులి మాట్లాడదు. మేక చెప్పదు. కానీ అసంభవమైనది ఎలాగో సంభవమయింది. మేకకూ పులికీ స్నేహం కుదిరింది. పులి, మేకల స్నేహం ఎంత గాఢమైనది, ఎంత తీవ్రమైనది అంటే పులిని వదిలి మేక, మేకను వదిలి పులి ఉండలేకపోతున్నాయి.

తెల్లారి అడవి జంతువులన్నిటినీ కోడి తన కూతతో నిద్రలేపే కన్నా ముందే మేక, పులి కలుస్తాయి. అప్పటి నుంచీ అర్ధరాత్రి అయిందని గుడ్లగూబ అరచి చెప్పేవరకూ అవి కలిసే ఉంటాయి. అప్పుడు కూడా ఒకరినొకరు వదలలేక వదలలేక వదలి వెళ్తాయి. మళ్ళీ తెల్లారకముందే కలుస్తాయి.

ఈ విచిత్రమైన స్నేహం గురించి అడవిలో చర్చలు తీవ్రస్థాయిలో అన్ని జంతువుల సమూహాలలో జరుగుతున్నాయి. విడ్డూరంగా, నోళ్ళు నొక్కుకుంటూ, పెదిమలు విరుస్తూ 'ఎన్నాళ్ళీ స్నేహం సాగుతుందో'నని పందేలు వేసుకోసాగాయి జంతువులన్నీ. ఈ విషయం ఆ పులి తండ్రి పులిరాజు వరకూ వెళ్ళింది.

తన పులి బిడ్డని మందలించింది పులిరాజు.

'నీకూ ఆ మేకకీ ఏమిటి స్నేహం? స్నేహం సమానుల మధ్య కుదురుతుంది. మనకున్న తక్కువ స్థాయి జీవులతో, పైగా మనకు ఆహారమైన మేకతో స్నేహమేమిటి?'

'తండ్రి మాటలను నవ్వుతూ కొట్టేసింది పులిబిడ్డ. అంతస్తును, స్థాయిని చూసి చేసేది స్నేహం కాదు. అది వ్యాపార ఒప్పందం' అంది.

అక్కడ మేకను కూడా మేక తల్లి, తండ్రితో సహా మందలోని అన్ని మేకలూ మందలించాయి.

'పులి క్రూర జంతువు. అది మనల్ని చీల్చి తింటుంది. దాన్ని చూస్తేనే మనలాంటి అన్ని జంతువులూ ప్రాణాలు అరచేత పట్టుకుని పరుగులిడతాయి. అలాంటిది నువ్వు రాత్రింబవళ్ళు దానితో చెట్టపట్టాలేసుకుని తిరుగుతున్నావు. అలాంటి మూర్ఖపు పనులు చేయకు. పులి స్నేహం వదిలెయ్' అని సలహానిచ్చాయి. మేక మంద దాటి వెళ్ళకుండా బంధించాయి.

కానీ ఒక రోజు మేక కలవకపోతే నిలవలేని పులి మరుసటి రోజు తెల్లారే మేక మందని వెతుక్కుంటూ వచ్చింది.

పులిని చూసి మేకలన్నీ ప్రాణాలు అరచేత పెట్టుకుని పారిపోయాయి. ఆ పులి తమని తినటం కోసం కాదు తనని చూడటం కోసం అని తెలిసిన మేక మాత్రం పారిపోలేదు. పరుగున స్నేహితుడిని చేరుకుంది.

అప్పటి నుంచీ వాళ్ళని విడదీయాలని కానీ, కలవకుండా అడ్డుపడాలని కానీ ఎవ్వరూ ప్రయత్నించలేదు.

కానీ ఈ స్నేహం అప్రాకృతికం అనీ ఇది ఎక్కువ కాలం నడవదని అన్నిటికీ తెలుసు. ఈ స్నేహం ఎలా దెబ్బతింటుందోనని ఎదురు చూడసాగాయి. ఊహాగానాలు చేయసాగాయి.

'ఏమిటలా ఉన్నావు?'

ఏదో ఆలోచనలో ఉన్న మేకను అడిగింది పులి. ఆ రోజు పొద్దున్న కలిసినప్పటినుంచీ మేక ఏదోలా ఉండటం గమనించింది పులి. మేక మాట్లాడలేదు. పులి ఎంతగానో బ్రతిమలాడిన తరువాత మెల్లిగా చెప్పింది.

'నాకేవేవో గమ్మత్తయిన ఆలోచనలు వస్తున్నాయి. అవేమిటో అర్థం కావటంలేదు.'

'ఏమిటా ఆలోచనలు?'

ఆలోచిస్తూ జాగ్రత్తగా చెప్పింది మేక.

**'మేకలంటాయి మేమే అని**

**పులులంటాయి గుర్రుగుర్రని**

**కోతులంటాయి కిచకిచమని**

**ఎందుకిన్ని జంతువులు? ఎందుకిన్ని శబ్దాలు?'**

మేక వైపు విచిత్రంగా చూసింది పులి. బుర్రగోక్కుంది. 'ఏది మళ్ళీ చెప్పు' అని పదే పదే చెప్పించుకుంది.

చివరికి తల విదిల్చి అంది. 'ఇది నాకూ అర్థంకావటం లేదు. మన భల్లూకం భాయిని అడుగుదాం పద వాడు తెలివైనవాడు' అని మేకను భల్లూకం దగ్గరకు తీసుకు వెళ్ళింది.

మేకను చూసి గుర్రుమనబోయిన భల్లూకం పులిని చూసి నక్క వినయం ప్రదర్శించింది.

'ఎందుకిలా వచ్చారు? ఏం కావాలి?' అడిగింది.

విషయం చెప్పింది పులి.

విషయం విన్న భల్లూకం, మేకవైపు తిరిగి 'ఏమిటది చెప్పు' అడిగింది. మేక చెప్పింది.

'ఇదేమిటో నాకూ తెలియటంలేదు. మీరిద్దరూ ఓసారి నక్క దగ్గరకు వెళ్ళండి' అంది.

పులి, మేక కలసి నక్క దగ్గరకు వెళ్ళాయి.

నక్క జిత్తుల మారిది. అతి వినయం ప్రదర్శించింది.

మేక చెప్పింది వింటూ 'అహా.. అహోహా.. ఒహో.. ఒహోహో.. అద్భుతం.. పరమాద్భుతం' అని పొర్లి పొర్లి పొగిడింది.

దాని పొర్లుడుకు, పొగడ్తలకు మేక, పులి రెండూ బిత్తరపోయాయి. పొర్లి దొర్లి లేచి దుమ్ముదులుపుకుని 'ఒక్క క్షణం' అంటూ మిగతా నక్కలను, తోడేళ్ళను పిలుచుకు వచ్చింది. 'ఇది వినండి' అంది.

మేక మళ్ళీ చెప్పింది.

అన్నీ 'వహ్వా..జిహ్వా.. అహ్వా' అని పొగిడాయి పొర్లి దొర్లుతూ, దొర్లి పొర్లుతూ.

'ఇంకా ఏమైనా ఆలోచనలు వస్తుంటాయా?' కళ్ళనుంచి నీళ్ళు కారుతూండగా అడిగాయి అన్నీ ముక్తకంఠంతో.

'ఇంకా బోలెడన్ని వస్తూంటాయి' గర్వంగా చెప్పింది మేక.

'ఏదీ చెప్పు' బ్రతిమలాడాయి అవి.

పులివైపు చూసింది మేక. 'చెప్పు' అన్నట్టు సౌంజ్ఞ చేసింది పులి.

**గాలికి ఆకులు కదులుతాయి**

**ఆకులు నీటిపై తేలతాయి**

**చెట్ల ఆకులను కొరికితే**

**నోట్లో రసాలు ఊరతాయి.**

ఆశ్చర్యంగా చూశాయి అక్కడ ఉన్న జంతువులన్నీ. ఎగురుతున్న పక్షులు కూడా సగంలో ఆగి విన్నాయి. తరువాత 'అన్నీ అబ్బో అద్భుతం... పరమాద్భుతం... పరమాద్భుత అద్భుతాద్భుతం' అని పొగిడాయి.

అన్నీ కలసి మేకను పైకి ఎత్తేశాయి.

'నాకింకా ఆలోచనలు వస్తున్నాయి' అంది మేక.

'నాకూ వస్తాయి ఆలోచనలు' అంది ఇదంతా చూస్తున్న ఓ కుందేలు. నక్కలు, తోడేళ్ళు దానివైపు గుర్రుగా చూశాయి.

'ఏమిటీ చెప్పు?' కుతూహలంగా అడిగింది మేక.

పులి ఆవలించింది విసుగ్గా.

అంతే. నక్కలు, తోడేళ్ళు ఒక్కసారిగా కుందేలుపై విరుచుకుపడ్డాయి. చావుతప్పి కన్నులొట్టబోయింది కుందేలుకు. ప్రాణాలు అరచేత పట్టుకుని పారిపోయింది.

'ఆలోచనలొస్తే మేకకే రావాలి' అంది గర్వంగా.

పులి మాటలు విని అన్ని జంతువులూ సంతోషంగా నృత్యం చేశాయి.

'ఆలోచనలొస్తే మేకకే రావాలి' అన్నాయి తోడేళ్ళు.

'మేకకే ఆలోచనలు రావాలి' అన్నాయి నక్కలు.

'రావాలి ఆలోచనలు మేకకే' అన్నాయి జింకలు.

'మేకకు వచ్చేవే ఆలోచనలు' అన్నాయి ఉడతలు.

మరుసటి రోజు ఉదయం, మేకపులి రెండు కలిశాయి. కానీ అవి ఒకదాన్నొకటి పలకరించుకునేలోగా బిలబిలమంటూ కుందేళ్ళు, ఉడతలు పరుగెత్తుకు వచ్చాయి.

చెకచెకమంటూ కప్పలు వచ్చాయి. బిరబిరమంటూ గుడ్లగూబలు వచ్చాయి.

'మేకా.. ఏమిటివ్వాళ కొత్త ఆలోచన?' ప్రశ్నించాయి ఆత్రంగా.

పులివైపు చూసింది మేక. పులి తలాడించింది.

**'తెల్లారగానే పక్షుల కిలకిల**

**రాత్రి పగలు నీటి గలగల**

**వెలుతురు రాగానే ఆకుల తళతళ'** అంది మేక.

'అబ్బా అద్భుతం' కూసింది గుడ్లగూబ.

'అసలు ఎప్పుడూ ఇలాంటిది విననేలేదు' బెకబెకమంది కప్పల మంద. అన్నీ సంతోషంతో కేరింతలు కొట్టాయి.

ఇక అడుగడుగునా జంతువుల మందలు మేక, పులిని ఆపి మేక సరికొత్త ఆలోచనలు వినేవి. పొగుడ్తూ, పులికి పొర్లుడు దండాలు పెడుతూ పోయేవి. రాను రాను మేక ఖ్యాతి అడవి అంతా వ్యాపించింది.

పులి దగ్గర మంచి పేరు సంపాదించటానికి జంతువుల మందలు మేకను ఆహ్వానించటం ఆరంభించాయి.

మేక ఆలోచనలు చెప్పించుకుని సంతోషించి, ఓపికున్నంత సేపూ పొగిడేవి. తరువాత 'మమ్ముబ్రోవమని చెప్పవే' అని పులికి తమ కోరికలు నివేదించమని మేకను వేడుకునేవి.

అలా అడవిలోనే కాదు ఇరుగుపొరుగు అడవుల్లో కూడా ఆలోచనల మేక ఖ్యాతి వ్యాపించింది.

అయితే ఎలా మొదలయిందో తెలియదు కానీ సన్నగా మేకపట్ల వ్యతిరేకత ఆరంభమయింది. అది ముందు మేకల మందలోనే ఆరంభమయింది. 'ఆలోచనలు తనకే వస్తాయి. తనకే రావాలి' అన్న నమ్మకం మేకలో గట్టిగా ఏర్పడింది. అది బలపడి పాతుకుపోయింది.

ఓ రోజు మేకల మందలో ఓ మేక అంది 'ఆలోచనలు జీవులన్నిటికీ వస్తాయి. నువ్వే ప్రత్యేకం కాదు. నువ్వు పుట్టుక ముందు నుంచీ ఆలోచనలున్నాయి. నువ్వు పోయిన తరువాతా ఉంటాయి'

దానికి మేకకు కోపం వచ్చింది. 'ఏం కాదు. ఆలోచనలకు ఆద్యుడిని నేనే. నాకు ముందు ఎవరూలేరు. నా తరువాత ఎవరూ ఉండరు' అంది కోపంగా.

'ఏం కాదు. నీకు తెలియకపోతే లేనట్టుకాదు. ఆలోచనల మేకలకు నీలా పులితో స్నేహం లేదు. అందుకే ఆ ఆలోచనలు మన మేకల మందల్లోనే ఉండిపోయాయి' అందామేక. ఎదురు వాదనని భరించలేకపోయింది ఆలోచనల మేక. తనను పొగుడుతూ వెంట ఉండే గుడ్లగూబలవైపు, గ్రద్దలవైపు, నక్కలు, తోడేళ్ళవైపు చూసింది. అవి వెంటనే ఆ మేకపై విరుచుకు పడ్డాయి. పక్షులు ముక్కుతో పొడిచాయి. తోడేళ్ళు పళ్ళతో చీల్చాయి. నక్కలు దాని శవాన్ని ఆరగించాయి.

దాంతో, మేకకు వ్యతిరేకంగా మాట్లాడే ధైర్యం ఏ జంతువుకూ లేకుండా పోయింది. అయినా సరే అన్ని జంతువులలో ఆలోచనల మేక అంటే ఓ రకమైన నిరసన బయలుదేరింది.

కానీ ఆ నిరసనను బయట పెట్టే ధైర్యం ఏ జంతువూ చేయలేదు. పైకి 'వహ్వా... భేషో..' 'అద్భుతోద్భుత అద్భుతాద్భుత అద్భుతమంటే అద్భుతమే' అని పొగిడి పొగిడి పడిపోయేవి. కానీ మనసులో తిట్టుకునేవి. ఎవరూ లేనపుడు 'ఆలోచనలు ఈ ఒక్క మేకకేనా? మనకు రావా? దాని ఆలోచనలే ఆలోచనలా, మన ఆలోచనలు ఆలోచనలు కావా?' అని గొణుక్కునేవి.

అయితే ఇవేవీ పట్టని మేక ఎవరు ఎప్పుడు పిలిచి ఆలోచనలు చెప్పమని అడిగినా ఆలోచనల వెల్లువపై తెరతీసేది. వాటి పొగడ్తలు, పొర్లుళ్ళు చూసి తనని మించిన ఆలోచనలు ఇంకెవ్వరికీ రావు అనుకునేది. ఎవరైనా తనను ప్రశ్నించినా, వ్యతిరేకించినా, మేక ఏమీ అనకముందే చుట్టూ ఉన్న తోడేళ్ళు, నక్కలు, గుడ్లగూబలు ఆ వ్యతిరేకించిన వారి వ్యతిరేకతను పారద్రోలేవి.

రోజుకో కొత్తరకం పొగడ్తలతో మేకను ముంచెత్తేవి.

'స్వరంలేని మేకల స్వరం నీవు. సుస్వరం నీవు' అని కవితలు రాశాయి.

'నీ స్వరమే మా స్వరమై మన స్వరంగా మ్రోగే' అని పాటలు పాడాయి.

'ఆలోచనలకే ఆలోచనవు. ఆలోచనల మేకవు' అని నర్తించేవి.

ఈ పొగడ్తలు, కీర్తనలతో మేక ఉబ్బిపోయింది. దానికి గర్వం పెరిగింది. అసహనం పెరిగింది. తనని మించిన వారు లేరనుకుంది.

ఎపుడూ దాని చుట్టూ నక్కలు, తోడేళ్ళు, గుడ్లగూబలు ఉండేవి. దాంతో నెమ్మదిగా వాటికి తెలియకుండానే పులి, మేకల నడుమ దూరం పెరగటం ఆరంభమైంది,

ఎప్పుడూ ఎవరో ఒకరు మేకని పొగుడుతూండటం, దాన్ని సన్మానించి తలకెత్తుకోవటం ఆరంభంలో పులికి గర్వంగా అనిపించినా. రానురాను విసుగురావటం మొదలయింది. అది చిరాకుగా అనిపించింది. చివరికి అది ఆలోచనల మేక పట్ల కోపంగా పరిణమించింది.

తనవల్ల అందరూ మేకని పొగుడుతున్నారని పులి అర్థం చేసుకుంది. అది అర్థం చేసుకోలేని మేక తన స్వీయ ప్రతిభవల్ల అందరూ తనని అందలాలెక్కిస్తున్నారని భ్రమ పడింది.

మేక, పులి మధ్య పెరుగుతున్న దూరాన్ని ముందుగా నక్క గమనించింది. తోడేలు దృష్టిని ఆవైపు మళ్ళించింది. అలా నెమ్మదిగా జంతువులు ఇప్పుడు మేకను పొగడటం వల్ల లాభం లేదని గ్రహించాయి. నెమ్మదిగా జంతువులన్నీ మేకకు దూరమవసాగాయి.

ముందు మేక ఇది గమనించలేదు. కానీ తనను కలిసేందుకు జంతువులు రాకపోవటం, వస్తున్న జంతువుల సంఖ్య తగ్గటం, ఎవరి వెంటయినా పడి బలవంతంగా తన ఆలోచనలను వినిపిస్తే, అవి విసుగ్గా ముఖం పెట్టి పారిపోవటం, ఒకవేళ తప్పని సరిగా విన్నా పొగడక, 'ఇది మాకు తెలుసులే' అన్నట్టు చులకనగా వ్యాఖ్యానించి వెళ్ళిపోవటం మేక గమనించింది.

అయినా నిజం ఒప్పుకోవటానికి అది సిద్ధంగాలేదు. మొండిగా ఆలోచనలను వినిపించేది.

చివరికి ఎలాంటిరోజు వచ్చిందంటే, ఎవ్వరూ మేక దగ్గరకు రాలేదు. మేక ఒక్కర్తే మిగిలిపోయింది ఒంటరిగా.

మరుసటి రోజు ప్రొద్దున్నే పులి దగ్గరకు బయలుదేరటానికి సిద్ధమయింది మేక. దాన్ని మేక తల్లిదండ్రులు ఆపారు.

'నువ్వు మొదటినుంచీ పులితో తిరగటం మాకు ఇష్టంలేదు. ఇప్పుడు అసలు ఇష్టంలేదు. బలవంతులతో బలహీనుల స్నేహాలు ఇలాగే ఉంటాయి. బలవంతుడితో ఉండటంవల్ల బలహీనుడికి విలువ వస్తుంది. బలహీనుడు అది నిజమని భ్రమపడి నష్టపోతాడు. బలవంతుడికి అది ఆట. బలహీనుడికి అది ప్రాణసంకటం' అన్నాయి.

మేక వినలేదు. 'ఇక్కడ బలవంతుడు, బలహీనుడు అన్న ప్రసక్తిలేదు. నా ఆలోచనల బలం అది. నాకున్న ఆలోచనలు ఎవ్వరికీ లేవు. అందుకని అందరూ నన్ను పొగిడారు. ఇప్పుడెందుకో నా ఆలోచనలు నచ్చటంలేదు. అది కనుక్కుంటాను' అంది.

'పిచ్చి మొహమా! ఆలోచనలు అందరికీ ఉంటాయి. అందరికీ వచ్చే ఆలోచనలనే ఎవ్వరూ ఊహించని విధంగా ప్రకటించటమే ప్రతిభ. నీకు పులితో స్నేహం ఉండటం వల్ల అన్నీ నీ మామూలు ఆలోచనలను అసామాన్యమైన ఆలోచనలని వాటి వాటి స్వార్థాన్ని అనుసరించి పొగిడాయి. అంతే తప్ప ఆ పొగడ్తలు నీ ఆలోచనల గొప్పతనం వల్లకాదు' నిష్ఠూరమైన నిజాన్ని చెప్పాయి మేక తల్లిదండ్రులు.

'నేను నమ్మను. ఎంత ప్రతిభలేకపోతే అన్ని జంతువులూ నన్ను పొగుడుతాయి? ఒకటి రెండు జంతువులనుకుంటే పులివల్ల అనుకోవచ్చు. అడివిలోని జంతువులే కాదు ఇరుగుపొరుగు అడవుల్లోని జంతువులూ పొగిడాయి' వాదించింది మేక.

'పిచ్చిపిల్లా... స్వయం ప్రతిభ సూర్యుడిలాంటిది. ఎవరి అండదండలు అవసరంలేదు. అది శాశ్వతం. అలాకాక, వేరేవారి ఆధారంగా వెలుగు వెలగాలని ప్రయత్నంచేసేవారు, ఆ సహాయం ఉన్నంతకాలం వెలుగుతారు. అండ తొలిగితే క్రిందపడతారు. కాబట్టి ఇక పులి జోలికి పోకు. జరిగింది మరిచిపో. నువ్వు మేకవు. మేకలానే ఉండు' అన్నాయి.

కానీ మేక తల్లితండ్రుల మాట వినలేదు. పులిని కలవటానికి బయలుదేరింది.

మేక వెళ్ళేసరికి పులి చుట్టూ జంతువులన్నీ ఉన్నాయి. 'వహ్వా వహ్వా' అన్న కేకలు వినిపించాయి.

అందరి మధ్యలో ఓ కుందేలు ఉంది

'కుందేలు తెల్లన, ఏనుగు నల్లన, తాబేలు మెల్లన, పులి నా అన్న' అందరు మళ్ళీ పొర్లి పొర్లి పొగిడారు.

మేక అందరివైపు విచిత్రంగా చూసింది. 'ఏముంది దీన్లో? అసలు దీనికి అర్థం ఏమిటి?' అంది.

ఒక్కసారిగా అందరూ నిశ్శబ్దమైపోయారు.

పులి నెమ్మదిగా మేకవైపు చూసింది. 'నువ్వెళ్ళిపో ఇక్కడి నుంచి.' అంది 'కుందేలు కాలి గోటికి నువ్వు సరిపోవు' అంది మళ్ళీ.

మేక నిర్ఘాంతపోయింది. మౌనంగా వెనుతిరిగింది. అది వచ్చేస్తూంటే వెనక నుంచి నవ్వులు. 'అద్భుతాద్భుత పరమాద్భుత, పరమఘోరాద్భుతాద్భుతం' అని పొర్లి దొర్లే పొగడ్తలు వినిపిస్తున్నాయి.

ఒక్కసారిగా ప్రపంచరీతి మేకకు అర్థమయింది. తన తెలివి తక్కువతనం గ్రహింపుకు వచ్చింది.

బలవంతుడు బలహీనుడిని భౌతికంగానేకాదు మానసికంగానూ చంపవచ్చు అని అర్థమయింది. ఎదురుగా కనిపిస్తున్న రాయిని పరుగున వెళ్ళి ఢీకొంది. అది ఢీకొన్న రాయి పులి ఆకారంలో ఉంది. దాన్నుంచి ఒక రాయి పులి పన్నులా పొడుచుకు వచ్చింది. మేక తిన్నగా వెళ్ళి ఆ పన్నులాంటి రాయికి తగిలింది. అది దాని గుండెల్లో గుచ్చుకుంది.

## *తిరిగే కాలూ - రాసే చెయ్యి*

**హఠాత్తుగా మెలుకువ వచ్చింది.** కళ్ళు తెరచి చూశాను. గబుక్కున లేచి కూర్చున్నాను.

ఇది కలా? నిజమా?

నేను రాత్రి పడుకునేటప్పుడు నా గదిలోనే పడుకున్నాను. ఎప్పటిలాగే పాటలు వింటూ, పుస్తకం చదువుతూ నిద్రరాగానే అన్నీ స్విచాఫ్ చేసి పడుకున్నాను. పడుకోగానే నిద్రపట్టింది.

కానీ.. ఇదేమిటి?

నేను ఎక్కడున్నాను? ఇక్కడికి ఎలా వచ్చాను?

నా పరుపు, మంచం మాయమైపోయాయి. నేను మెత్తటి, పచ్చటి గడ్డిమీద పడుకుని ఉన్నాను.

నా గదిలో నాలుగువైపులా బీరువాలు, బీరువాల నిండా పుస్తకాలు ఉండాలి.. ఇక్కడ.. ఇక్కడ..

నేను అడవిలో ఉన్నాను. నా చుట్టూ అడవిలోని జంతువులన్నీ ఉన్నాయి. అన్నీ నన్నే తీక్షణంగా చూస్తున్నాయి.

వాటి కళ్ళల్లో భావం అర్థం కావటం లేదు.

నా నాలిక తడారిపోయింది. గొంతు ఎండిపోయింది.

పులులు, మేకలు, నక్కలు, తోడేళ్ళు, ఎలుగుబంట్లు, ఏనుగుల గురించి కథలు రాయటం వేరు.

వాటి పక్కన నిస్సహాయంగా నిలబడి వాటి కళ్ళల్లోకి చూడటం వేరు.

కనీసం చుట్టూ మనుషులుంటే.. నేనెక్కడున్నాను? అని అడగవచ్చు. అన్ని జంతువులున్నాయి. ఏమని అడగాలి? ఎవరిని అడగాలి?

ఇంతలో విచిత్రం జరిగింది.. మేక గొంతు విప్పింది.

అయిపోయాయా.. నీ పులీ, మేక కథలు?

గమ్మత్తుగా విచిత్రంగా ఉంది దాని గొంతు. మేకలు మాట్లాడతాయా?

'మాతో వేషాలన్నీ వేయించి, చివరికి ఎక్కడెక్కడినుంచో పులిని తెచ్చి చంపినప్పుడు ఈ సందేహం రాలేదా నీకు?' గద్దించినట్టు అడిగింది మేక.

'ఏమనాలి నేను?

కథలెక్కడన్నా అయిపోతాయా? ప్రపంచంలో అనంతమైన కథలున్నాయి. వాటిని గమనించి, అర్థం చేసుకుని తమదైన ధోరణిలో చెప్పే రచయితల కోసం కథలు ఎదురు చూస్తుంటాయి.

'కథలు అయిపోవటం అంటూ ఉండదు' అన్నాను. అతి కష్టం మీద గొంతు పెగిలించుకుని.

గుర్రుమంది మేక. 'ఇంకా ఎన్ని కథలు చెప్తావు? ఎన్ని రకాలుగా మమ్మల్ని చంపుతావు?'

నాకు కాస్త ధైర్యం వచ్చింది. 'పులి మేకను చంపటం ప్రకృతి ధర్మం. దాన్లో నేను సృష్టించిందేమీ లేదు' చెప్పబోతుంటే మేక అడ్డొచ్చింది. '

'నీకు నేనే దొరికానా? నా గురించే ఎందుకు కథ రాయాలి? నక్క గురించి రాయి. బాతు గురించి రాయి. కోతి గురించి రాయి. ఇన్ని ఉండగా నీకు చంపటానికి, వెక్కిరించటానికి నేనే దొరికానా?' కొమ్ములు నా గుండెలకు పెట్టి అడిగింది మేక.

'రచయితకు వాళ్ళ గురించి, వీళ్ళ గురించి రాయాలని ఉండదు. ఏదో ఒక దానివల్ల ప్రేరణ కలుగుతుంది. ఆ ప్రేరణ అతడిలో నిద్రాణ స్థితిలో ఉన్న అనేక అంశాలు నిద్రలేస్తాయి. సృజనాత్మక రచన వెలువడుతుంది. తనలో లేనిదే రచయిత ఏదీ రాయలేడు. కాబట్టి మేక, పులి అన్నది యాదృచ్ఛికంగా లభించిన అంశమే తప్ప కావాలని కూచుని రాసింది కాదు. '

మేక కళ్ళెర్రబడ్డాయి.

ఇంతలో కుందేలు వచ్చింది ముందుకు. 'నా గురించి ఎందుకు రాయవు?' అడిగింది.

దానికి సమాధానం ఇచ్చేలోగా ఎలుగుబంటి వచ్చింది ముందుకు.

నా పై ప్రాణాలు పైకి పోయాయి.

'నాగురించి రాయి.. నేను చాలా మంచిదాన్ని.. అడవిలో జంతువుల క్రౌర్యాన్ని చూపిస్తూనే రాయాలా? నా మంచితనం గుర్తించలేవా?' అడిగింది కోపంగా.

'రాస్తాను.. రాస్తాను. కానీ ఇలా బలవంత పెట్టి రాయమంటే రాయలేను. నాకు రాయాలనిపించాలి. నాలోంచి ప్రేరణ రావాలి.'

మళ్ళీ నన్ను మాట్లాడనివ్వ. మధ్యలో అడ్డొచ్చాయి.

'ఏమిటి ప్రేరణ? మాటి మాటికీ ప్రేరణ అంటావు.. అయినా నిన్ను అని లాభంలేదు. నీకు రాసే అవకాశాలిస్తున్న వాళ్ళని అనాలి. మేకలు - పులులు మేకని పులి తినటం ఇదీ ఒక కథేనా? అడవిలో ఎన్ని సమస్యలు ఉన్నాయి.. అవన్నీ రాయి..' తొండం ఎత్తి అంది ఏనుగు.

'మీకు ఇది అర్థం కాదు. రచన అనేది ఒక సృజనాత్మక ప్రక్రియ. నేను రాసిన కథల్లో బోలెడన్ని ప్రతీకలున్నాయి. బోలెడన్ని పొరలున్నాయి. పైకి అవి మేక, పులి కథలే అయినా దాన్లో ప్రపంచం ఉంది. ప్రపంచ రీతి ఉంది. అనేక రహస్యాలున్నాయి.' ఇంతలో గుడ్లగూబ వచ్చి నా ముఖానికి ఎదురుగా వ్రేలాడుతూ నా కళ్ళల్లో కళ్ళు పెట్టి చూడటంతో మాట సగంలో ఆపేశాను.

'ఔచిత్యం అంటే తెలుసా నీకు?' గుడ్ల గూబ మాట్లాడుతూంటే విచిత్రంగా ఉంది.

'ఔచిత్యం ... ప్రసక్తి ఏముంది? గుడ్లగూబను పట్టుకురా, లేకపోతే రాత్రంతా నీ కళ్ళల్లోకి చూస్తూ, కూస్తుంటా' బెదిరించింది.

బెదిరాను.. అయితే నా బెదురు వణుకుగా మారింది, అంతవరకూ మౌనంగా ఉండి, క్రూరంగా ఉన్న పులి, సింహాలు నా ఎదురుగా రావటంతో...

నిజంగా పులిని అంత దగ్గరగా చూస్తూంటే, మనిషి ఎంత బలహీనుడో, దాని బలం ముందు ఎంత నిస్సహాయుడో బోధపడుతోంది.

దాని పక్కనే ఉన్న సింహం ఇంకా క్రూరంగా ఉంది.

కానీ.. వాటి క్రౌర్యం లోనే ఏదో అందం ఉంది.

ఓ వైపు భయం, మరోవైపు వాటి అందం వల్ల కలుగుతున్న ఆనందం, భగవంతుడి కళానైపుణ్యానికి ఆశ్చర్యం వంటి పలురకాల విభిన్నమైన భావాలు ఒకేసారి కదలి ఉక్కిరి బిక్కిరి చేస్తూంటే మౌనంగా వాటికేసే చుస్తూండిపోయాను.

'మాకు మీ మనుషులలాగా క్రౌర్యం లేదు. మేము ఆకలేస్తేనే వేటాడతాం. భయం వేస్తేనే దాడిచేస్తాం. కానీ ఆటకోసం, వినోదం కోసం ఎవరినీ హింసించం' గంభీరంగా అంది పులి.

'నువ్వు మమ్మల్ని అవమాన పరచావు. ఏవో అక్రమ సంబంధాల పలవరింతలు, ప్రేమ కథల పులకరింతలు, అణిచివేతల అన్యాయపు కథలు రాసుకోక.. నీకు పని లేకుండా మామీద పడ్డావు. నా కూతురిని రాక్షసుడు ఎత్తుకుపోతే.. మేక రక్షించి తెస్తుందా? అలా రాయటానికి ఎన్ని గుండెలు?' నోరు తెరిచి వాటి వాడి పళ్ళు చూపించింది సింహం. కాలి గోళ్ళతో నేలమీద రాసింది.

'నేను మీ గురించి రాయలేదు. మీరెవరో కూడా నాకు తెలియదు.'

'ఏమీ తెలియకపోతే ఎందుకు రాసావు?' అన్ని జంతువులు కలసి గట్టిగా ఒకేసారి అరిచాయి.

'మా మనుషులకే అర్థంకాదు. మీకెలా వివరించేది సృజనాత్మక ప్రక్రియను? నేను రాసిన పులి, మేక కథలతో మీకు సంబంధం లేదు. నేను మిమ్మల్ని చూసి రాయలేదు. రచయిత సృజన తనలోంచే వస్తుంది. ప్రేరణ బాహ్యమయినా సృజనమాత్రం అంతర్గతమే.'

అర్థం కానట్టు చూశాయి. 'మాటల్లో పెట్టి మభ్యపెట్టి, సున్నం పూయాలని ప్రయత్నించకు' గద్దించింది సింహం.

'నీకు రాయాలని ఉంటే మనుషుల గురించి రాయి. మా గురించి రాయాలన్న లేకితనం నీకెందుకు?' తోడేలు అంది కోపంగా.

'మీకు అర్థం కావటంలేదు. సాలీడు ఎలా తనలోంచే దారాలు తీసి గూడు అల్లుతుందో, రచయిత అన్ని పాత్రలను, కథలను తనలోంచే తీస్తాడు. పైకి మీరు, మేక, పులి అని పేర్లు పెట్టినా మేకలు పులులూ అన్ని జంతువులూ నాలోనే ఉన్నాయి. నాకు లభించిన ప్రేరణను బట్టి ఆయా జంతువులు నాలో జాగృతమవుతాయి. నేను నాలోలోపలకు దూసుకుంటూ జాగృతమయిన జంతువును ఆధారం చేసుకుని కథను సృజిస్తాను.'

అన్ని జంతువులు అనుమానంగా చూశాయి. 'అంటే.. నువ్వు మా గురించి రాయలేదా?' అన్నీ ఒకేసారి అడిగాయి.

'లేదు. నేను నాలో ఉన్నట్టు నాకే తెలియని నా గురించే రాశాను. 'రచన అనేది రచయిత తనను తాను గుర్తించే ప్రక్రియలో భాగం. తనను తాను అర్థం చేసుకునే తపనలో ఓ భాగం. అందుకే రచయిత హృదయం అతని ప్రతి రచనలో కనిపిస్తుంది. రచయిత వేరు.. రచన వేరు కాదు. ఇంకా చెప్పబోతున్న నా మాటలకు మేక అడ్డొచ్చింది.

'అయితే.. మేమంతా నీలోనే ఉన్నామంటావు. ఏదీ చూపించు?'

ఎలా చూపించాలి?

అంతలో విచిత్రం జరిగింది.

ఒక్కసారిగా నేను నేను కాకుండా అయినట్టనిపించింది. ప్రపంచం గిర్రున తిరగటం ఆరంభమయింది.

ఏమవుతోందో అర్థం కావటలేదు.

ఆశ్చర్యమో.. అద్భుతమో..

నేను కొండనయిపోయాను. బండనయి పోయాను. చెట్టనయ్యాను. పుట్టనయ్యాను. వీచే గాలినయ్యాను. పారే నీటినయ్యాను. పిట్టనయ్యాను. పురుగునయ్యాను. చిత్ర విచిత్రాకృతిల్లోకి మారిపోసాగాను.

ఎన్ని జంతువులో! ఎన్ని జీవాలో! ప్రతి ఒక్కటీ అవసాగాను.

నాలోనే అడవులు కనిపించాయి. నాలోనే ఎడారులు కనిపించాయి. సముద్రాలు పొంగిపొర్లుతున్నాయి. భూకంపాలతో భూమి విచ్ఛిన్నమౌతోంది. అగ్నిపర్వతాలు బద్దలవుతున్నాయి.

ఇంతలో ఆకాశం కనిపించింది.

నేను ఆకాశం దాటి పోతున్నాను.. కాదు.. నాలోని ఆకాశం అపరిమితంగా, అనంతంగా విస్తరిస్తోంది.

చంద్రుడు.. సూర్యుడు నాలోనే ఉన్నారు. ఖగోళం, అంతరిక్షం, పాలపుంతలు.. విశ్వం సర్వం నేనే అయ్యాను.

నేనే చీకటి.. నేనే.. వెలుతురు..

నేనే.. పులి.. నేనే.. మేక..

నాలోనే తోడేలు.. నాలోనే నక్క..

నాలోనే అనంతమైన కథలు.. అంతులేని భావాలు... ఎనలేని ఆలోచనలు..

నాలోనే వేలవేల గొంతులు.. కోట్ల కోట్ల అనుభూతులు.. నాలో నాకే తెలియని భిన్నవిభిన్నమయిన మనుషులు.

ఇంతలో నా చుట్టూ ఉన్న ఒక్క జంతువు నా మీదకు దూకటం ఆరంభించింది. నా మీదకు దూకిన జంతువు నాలోనే కలసిపోసాగింది.

కొన్ని పరుగున, కొన్ని పాకుతూ, కొన్ని ఎగుర్తూ, మరికొన్ని వగరుస్తూ నాలోకి దూకసాగాయి.

అన్నీ నాలో కలసిపోయాయి.. ఒక్క మేక మాత్రం బయట మిగిలిపోయింది.

'నా గురించి రాసేశావుగా.. ఇక నీలో నాకు స్థానం లేదు..' అంది.

'ఎందుకు లేదు.. కథలెప్పుడూ పూర్తికావు.. కథలకు కామాలే తప్ప ఫుల్‌స్టాపులు ఉండవు. కథలు అయిపోవటం అంటూ ఉండదు. రచయితలో సృజనాత్మక స్రవంతి ఇంకిపోవటం జరుగుతుందేమో కానీ.. కథలకు అంతం ఉండదు.. రా.. నీ గురించి నేను రాయాల్సింది ఇంకా ఉంది. ఇంకా ఎన్నెన్నో కథలు చెప్పాలి..' బ్రతిమలాడాను.

'నువ్వు చెడ్డవాడివి.. కనీసం కథలో నయిన నేను పులిని చంపినట్టు చూపలేదు. కథలు కల్పన అంటావు. మరి కల్పనలో కూడా నేను బ్రతికినట్టు చూపలేదు' నిష్టూరంగా అంది.

'ఇగో.. ఈసారి మళ్ళీ పులి.. మేక కథలు రాస్తాను.. అప్పుడు కథలన్నీ పులుల్ని చంపిన మేకల కథలే' అన్నాను.

'నిజంగా' సంతోషంగా అడిగింది.

'నిజం' నమ్మకంగా అన్నాను.

'ప్రామిస్..'

'ప్రామిస్..'

'వెంటనే సంతోషంగా నాలోకి దూకింది. అప్పటివరకూ ఓపిక పట్టి ఎదురు చూస్తున్న పులి వికటంగా నవ్వింది. లోపలకు దూకిన మేకపైకి లంఘించింది. హింస గురించి రాయటం లేదు. హింసను అనుభవించటం వేరు. హింసను ప్రత్యక్షంగా చూపడం వేరు. హింసను తనలోనే దర్శించటం వేరు.

ఆ సంఘటన ఏదో కదిలించింది. ఏదో కదలింది. నాలోనే దృశ్యం మారిపోయింది.

ఏదో ప్రేరణ కలిగింది. ఇంకేదో జాగృతమయింది.. సృజనాత్మక సముద్రంలో అలలు తీవ్రమయ్యాయి.

నా చుట్టూ ఉన్న అడవి అదృశ్యమయ్యింది... జంతువులు అదృశ్యమయ్యాయి.. కొత్త ప్రపంచం ఎదురుగా నిలచింది. చెయ్యిని కలం చేరింది, కలంతో రాసే చెయ్యి కదలటం ఆరంభమయింది. కొత్త కథ రూపుదిద్దుకుంది.